అనుదినం... జనస్వరం


నవతెలంగాణ

శుక్రవారం 2-2-2018
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 35 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | W O W | 12 + 16 పేజీలు వెల : 5.00W

కార్పొరేట్ గారడీ

పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన జైట్లీ



2017-18లో పెరిగిన ద్రవ్యలోటు

- ప్రేమతో సామాన్యుడి భజన..
- నిధులు లేకున్నా.. నిండుగా మాటలు..
- రూ.24,42,213 కోట్లతో అరుణ్ జైట్లీ పద్దు
- మౌలిక రంగానికి రూ.14.34 లక్షల కోట్లు
- పలు కీలక రంగాలకు తగ్గిన కేటాయింపులు
- కార్పొరేట్లకు కాసులు కురిసేలా పథకాలు
- ఎన్నికల నేపథ్యంలో అన్నదాతలకు 'జై'
- అన్ని వర్గాల్లోనూ... తీవ్ర నిరుత్సాహం

కార్పొరేట్ల పన్నుతగ్గించింది. కానీ ఉద్యోగ పన్ను మినహాయింపు మరిచింది.వ్యవసాయరంగంపై దృష్టిపెట్టిందన్న మాటతో.. రైతాంగంలో సంతోషం ఎక్కువసేపు నిలవలేదు.అందుకు తగిన విధంగా కేటాయింపులు పెరగలేదు.మాటల్లో తప్ప ఈ పెరుగుదల కనిపించలేదు. ఆరోగ్యంపై దృష్టి సారించామని సాధారణ ప్రజల్ని ఆకర్షించవచ్చని అనుకున్న మోడీ సర్కారు ఎత్తుగడ పారే అవకాశం కనిపించటంలేదు.అందుకు తగ్గట్టు నిధులు కేటాయించలేదు.వ్యవసాయం,వైద్యం,విద్యారంగాల్లో కేటాయింపుల శాతం తగ్గించింది. మరోవైపు మహిళ,సాధారణ ప్రజలపై భారాలు మాత్రం పెరిగాయి.మొత్తం మీద ఈ బడ్జెట్ కార్పొరేట్ గారడీనే తప్ప ప్రజల బాధలకు పరిష్కారాలు కనిపించటంలేదని విశ్లేషకులు పెదవివిరుస్తున్నారు.

వివరాలు 9లో

వార్త విశేషాలు
2,3,7,9,10
పేజీలలో...

రైల్వే చెవిలో పువ్వు

- కేంద్ర నిర్ణయంపై ప్రజాప్రతినిధుల పెదవి విరుపు

9లో



సమగ్ర స్వరూపం

(₹ కోట్లలో)

	2016-17 వాస్తవ కేటాయింపులు	2017-18 బడ్జెట్ అంచనాలు	2017-18 సవరించిన అంచనాలు	2018-19 బడ్జెట్ అంచనాలు
రెవెన్యూ వసూళ్లు	1374203	1515771	1505428	1725738
మూలధన వసూళ్లు	600991	630964	712322	716475
మొత్తం వసూళ్లు	1975194	2146735	2217750	2442213
మొత్తం వ్యయం	1975194	2146735	2217750	2442213
రెవెన్యూ లోటు	316381	321163	438877	416034
ద్రవ్య లోటు	535618	546531	594849	624276
ప్రాథమిక లోటు	54904	23453	64006	48481

PTI GRAPHICS



కార్పొరేట్లకు వరం.. ప్రజలకు అదనపు భారం

కేంద్ర బడ్జెట్‌పై సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

వివరాలు 9లో

సామాజిక న్యాయాన్ని చేకూర్చే బడ్జెట్

ప్రధానమంత్రి నరేంద్రమోడీ

వివరాలు 9లో





నాలుగేండ్లు గడిచినా..

- కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్

వివరాలు 9లో

ఆశలు ఆవిరి...

- టీఆర్ఎస్ సర్కారు విజ్ఞప్తులను పట్టించుకోని జైట్లీ
- అంతరాలు తగ్గించే విధంగా లేదు : ఈటల

9లో



కాగితం మీద లక్షల కోట్లు

గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రూ.9.64 లక్షల కోట్లు

న్యూఢిల్లీ : 2019 ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్ కాబట్టి, గ్రామీణ రంగం ప్రస్తుత బడ్జెట్ నుంచి ఎంతో ఊహించింది. కానీ అవి కేవలం ఊహలుగా మాత్రమే మిగిలిపోయాయి. ముఖ్యంగా గ్రామీణ యువత, మహిళలకు జీవనోపాధి కల్పించాలన్న కనీస ఆలోచన కూడా ఈ బడ్జెట్ చేయలేదు. గ్రామాల్లో జీవనోపాధి, పల్లెల్లో రోడ్లు, గ్రామీణ విద్యా, వైద్యానికి సంబంధించి మౌలిక వసతుల కల్పనకు..మొత్తం రూ.9.64 లక్షల కోట్లను కేటాయించామని జైట్లీ ఘనంగా చెప్పుకున్నారు. ఈ గణాంకం చూస్తే అబ్బో..అంతా బాగానే ఉన్నట్టు కనపడుతుంది. అయితే ఇది నాన్-బడ్జెట్ కేటాయింపు అన్న సంగతి సామాన్యుడికి తెలియని విషయం. ప్రధానమంత్రి ...9లో

కేటీఆర్ సవాల్‌కు సై

- ఓడిపోతే నేను, మా కుటుంబం రాజకీయాలకు స్వస్తి...
- టీఆర్ఎస్ ఓడిపోతే కేసీఆర్, ఆయన కుటుంబం దూరంగా ఉంటుందా?
- రాహుల్‌గాంధీని విమర్శించే అర్హత వారికి లేదు: ఉత్తమ్ కుమార్



వివరాలు 9లో

హెచ్‌సీయూలో ఏబీవీపీ నేతపై వేటు

- రూ.30వేల జరిమానా విధించిన వర్సిటీ
- ప్రొఫెసర్‌పై బూతుల పోస్టింగ్ చేసినందుకు చర్యలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రొఫెసర్ లక్ష్మీనారాయణపై సోషల్‌మీడియాలో బూతులు తిట్టిన ఏబీవీపీ సెంట్రల్ యూనివర్సిటీల జాతీయ కోఆర్డినేటర్ కలురాం పల్సానియాను ఎట్టకేలకు హెచ్‌సీయూ అధికారులు సస్పెండ్ చేశారు. పల్సానియాను ఏడాది పాటు సస్పెండ్ చేయడంతో పాటు రూ.30వేల జరిమానా విధించారు. ఈ శిక్ష వెంటనే అమలులోకి వస్తుందని వర్సిటీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో ...9లో



గద్దెకు చేరుకున్న సమ్మక్క



కిక్కిరిసిన మేడారం..నేడు మొక్కులు

9లో

బీజేపీకి చేయిదెబ్బ

ఒక అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలూ కాంగ్రెస్ కైవసం

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు కాషాయదళానికి షాక్

వివరాలు 2లో

స్కూల్లోకి... దూసుకెళ్లిన కారు

కరస్పాండెంట్ నిర్లక్ష్యంతో విద్యార్థిని మృతి

మరో ఇద్దరికి గాయాలు

జడ్చర్లలో ఘటన

వివరాలు 3లో

ధరలు పెరిగే వస్తువులు

- ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, కార్లు, మోటార్‌బైక్‌లు, టీవీలు, స్మార్ట్ వాచీలు, ఎల్‌సీడీ, ఎల్ఈడీ పరికరాలతో పాటు పలు.
- ట్రక్కు, బస్సు రేడియల్ టైర్లు, మొబైల్ ఫోన్ విడి భాగాలు, ల్యాంప్‌లు, లైటెనింగ్ ఫిట్టింగ్, ఇల్యుమినేటెడ్ సైన్స్.
- స్టాప్ వాచీలు, పాకెట్ వాచీలు, చేతి గడియారాలు, అలారం గడియారాలు.
- బంగారం, వెండి, ఇమిటేషన్ జ్యుయలరీ, రంగు రంగుల రాళ్లు, వజ్రాలు.
- చెప్పులు, సిల్క్ వస్త్రాలు, టూత్‌పేస్టులు.
- దిగుమతి చేసుకునే కూరగాయలు, పండ్ల రసాలు(ఆరెంజ్, క్రాన్‌బెర్రీ జ్యూస్‌లు కూడా), రిఫైన్డ్ వెజిటబుల్ ఆయిల్, వేరుశెనగ నూనె, ఆలివ్ నూనె, కొబ్బరి నూనె, సఫోలా నూనె
- ఫర్నీచర్, పరుపులు, మంచాలు
- మేనిక్యూర్, పెడిక్యూర్ ప్రిపరేషన్స్, బ్యూటీ, మేకప్ ఉత్పత్తులు, ఫర్‌ఫ్యూమ్‌లు, డియోడరంట్లు, సెంట్ స్ప్రేలు, సన్‌స్క్రీన్, సన్‌ట్యాన్
- షేవింగ్ ఉత్పత్తులు
- టాయిలెట్ స్ప్రే, టాయిలెట్ వాటర్స్
- పాన్ మసాలా, బీడీ, సిగరెట్ లైటర్లు, క్యాండిల్స్
- గాలిపటాలు, సన్‌గ్లాసెస్
- వీడియో గేమ్స్, పిల్లలు ఆడుకునే చక్రాల బొమ్మలు, ఫజిల్ గేమ్‌లు, ట్రైసైకిళ్లు, స్కూటర్లు, పెడల్ కార్స్, తదితర బొమ్మలు
- క్రీడా వస్తువులు

ధరలు తగ్గే వస్తువులు

- ముడి జీడిపప్పు
- పెట్రోల్, డీజిల్
- సోలార్ టాంపర్డ్ గ్లాస్, సోలార్ ప్యానెళ్లలో ఉపయోగించే టాంపర్డ్ గ్లాస్
- బాల్ స్క్రూలు, సీఎన్‌జీ మెషిన్ టూల్స్
- వినికిడి పరికరాల తయారీకి అవసరమయ్యే ముడి వస్తువులు

హామీలు సరే.. కేటాయింపులేవీ?

కేంద్ర బడ్జెట్ 2018-19



'ఆత్మహత్యలు, రుణమాఫీ' ఊసే లేని వైనం

- 10 శాతం మాత్రమే పెరిగిన రుణ లక్ష్యం
- ఎగుమతులు 15 శాతం పెరిగాయన్న జైట్లీ
- దిగుమతుల ప్రస్తావనపై దాటవేత ధోరణి

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ కేటాయింపులు అన్నదాతల అంచనాలను అందుకోలేకపోయాయి. వ్యవసాయ రంగంపై జైట్లీ హామీలకు తగ్గ నిధులు కేటాయింపు జరగలేదు. కీలక అంశమైన రుణమాఫీపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం రైతులను మరింత కలవరానికి గురి చేసింది. మోడీ సర్కారు అధికారంలోకొచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా కర్షకుల ఆత్మహత్యలు అంతకంతకూ పెరుగుతున్నాయి. కానీ, జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో అన్నదాతల ఆత్మహత్యల ప్రస్తావన లేకపోవడం గమనార్హం. గత బడ్జెట్ సందర్భంగా చెప్పిన రైతుల ఆదాయం రెట్టింపు విషయాన్ని ఈ యేడాదీ లేవనెత్తారు కానీ, అది ఎలా సాధ్యమన్నది మాత్రం వివరించలేకపోయింది. రైతులకు 2017-18 బడ్జెట్ సందర్భంగా రూ.10 లక్షల కోట్ల రుణాలను అందించాలని సంకల్పించిన కేంద్రం.. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.11 లక్షల కోట్ల రుణాలను రైతులకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇక పంటల ఎగుమతులు 15 శాతం మేర పెరిగాయని జైట్లీ వివరించారు. మరింత పెంచేందుకుగానూ ఎగుమతుల విధానాలను సరళీకృతం చేయనున్నట్టు తెలిపారు. కానీ, దిగుమతుల ఊసే ఎత్తకపోవడం గమనార్హం. 2016-17 ఆర్థిక సంవత్సరంలో గోధుమలు, పప్పులు భారీగా దిగుమతి అయ్యాయి. గోధుమలు, పప్పులపై ఉన్న దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేసి ప్రభుత్వం భారీగా దిగుమతి చేసుకున్నది. 2008-09లో మొత్తం దిగుమతుల్లో వ్యవసాయోత్పత్తుల వాటా 2.09 శాతం ఉండగా.. 2015-16 నాటికి అది 5.63 శాతానికి చేరుకున్నది. దిగుమతులు భారీగా పెరిగినందున మార్కెట్లో పప్పులపై ధరలు ఎంఎస్‌పీపై 30 నుంచి 40 శాతం వరకు తగ్గాయి. చౌక దిగుమతుల కారణంగా భారత వ్యవసాయ రంగం ముఖ్యమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నదని, ఇది ఆందోళన కలిగించే అంశమని స్వామినాథన్ కమిషన్ ఇటీవల పేర్కొన్నది. మొత్తంగా 2018-19 ఆర్థిక సంవత్సరానికి గానూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు కేంద్రం రూ.63,836 కోట్ల నిధులను కేటాయించింది(గత ఆర్థిక సంవత్సరంలో కేటాయించినవి రూ.56,992 కోట్లు).



ఆదాయం రెట్టింపు ఎలా సాధ్యం ?

ఆదాయాన్ని రెండింతలు చేస్తామని కేంద్రం నెత్తినెత్తుకొన్న నినాదం.. కేవలం రైతులకు మభ్యపెట్టేందుకేనని స్పష్టమవుతున్నది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలంటే వ్యవసాయ రంగానికి రూ.6.4 లక్షల కోట్ల నిధులు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని అశోక్ దల్వాయ్ కమిటీ అభిప్రాయపడింది. కానీ, గతంలో కంటే ఈ రంగానికి రూ.6,844 కోట్లు మాత్రమే కేంద్రం అదనంగా కేటాయించింది. దీన్ని బట్టి 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు అన్నది ప్రశ్నార్థకంగానే మారనున్నది. మరోవైపు అన్నదాతల ఆత్మహత్యలను నివారించకుండా ఏం చేసినా వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధ్యం కాదన్నది అంగీకరించక తప్పదు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏడాదికి సగటున 12,600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయినాగానీ, ఆత్మహత్యల నివారణకు కేంద్ర సర్కారు కనీసం దృష్టి సారించకపోవడం గమనార్హం.

ఆహార సంక్షోభం తప్పదా ?

కేంద్రం వ్యవహరిస్తునర్న తీరు చూస్తుంటే దేశంలో రాబోయే కాలంలో ఆహార సంక్షోభం తప్పదేమోనన్న అనుమానాలు నెలకొన్నాయి. ఈ యేడాది దేశంలో ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని అరుణ్ జైట్లీ తన ప్రసంగంలో తెలిపారు. దాంతో పాటు విదేశాలకు ఆహార ఉత్పత్తుల ఎగుమతులు 15 శాతం మేర పెరిగాయని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. అంతేకాక, ఎగుమతులను పెంచేందుకు నిబంధనలు సరళీకరిస్తామని చెప్పడం వెనుక పెద్ద ప్రమాదం పొంచి ఉందని విశ్లేషకులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగుమతుల విధానాలను సరళీకరిస్తే మన దేశంలో ఉత్పత్తయిన పంట విదేశాలకు భారీగా తరలిపోయే ప్రమాదం లేకపోలేదు. మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్న దేశాలకు వ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేసేందుకే వ్యాపారులు మొగ్గు చూపుతారు. దీంతో మార్కెట్ రేట్లు పెరగడమే కాక.. దేశంలో వ్యవసాయోత్పత్తుల కొరత ఏర్పడి ఆహార సంక్షోభం ఏర్పడే అవకాశముందన్నది ఇప్పుడు కలవరపెడుతున్న అంశం.

వ్యవసాయ రంగానికి ఇచ్చిన హామీలు, కేటాయించిన నిధులు

- రైతులకు రూ.11 లక్షల కోట్ల రుణాలందించడమే లక్ష్యం..
- ఖరీఫ్‌లో అన్ని పంటల ఉత్పత్తికి అయిన ఖర్చుకు అదనంగా 50 శాతం లాభంతో(పంట ఖర్చును కలుపుకొని ఒకటిన్నర రెట్లతో మద్దతు ధర) కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ).
- మత్స్య, పశు సంవర్ధక శాఖకు రూ.10 వేల కోట్లు
- 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు కృషి..
- ఫుడ్ ప్రాసెసింగ్(ఆహార శుద్ధి) కోసం రూ.1400 కోట్లు
- దేశంలో 42 మెగా ఫుడ్ పార్కుల ఏర్పాటు
- దేశవ్యాప్తంగా 22 వేల గ్రామీణ మార్కెట్ల అప్‌గ్రేడ్..
- సహకార సంఘాల ద్వారా వ్యవసాయ ఉత్పాదక సంస్థలకు(రూ.100 కోట్ల టర్నోవర్ లోపు ఉన్న కంపెనీలు) 100 శాతం పన్ను రాయితీ..
- జాతీయ వెదురు పరిశ్రమకు రూ.1,290 కోట్లు
- దేశంలో సాగునీటి సౌకర్యంలేని 96 జిల్లాల్లో ప్రాజెక్టుల కోసం రూ.2,600 కోట్లు..
- వైద్య(ఔషధ మొక్కలు), సుగంధ ద్రవ్యాల ఉత్పత్తులకు రూ.200 కోట్లు
- సేంద్రీయ వ్యవసాయాన్ని పెంచేందుకుగానూ మహిళా సంఘాలకు ప్రోత్సాహం..
- పంటల ఎగుమతులను పెంచేందుకు నిబంధనల సరళీకరణ

రుణ ప్రయోజనాలెవరికీ?

ఇక రైతులకు ఇస్తానన్న రూ.11 లక్షల కోట్ల రుణాలకు, బడ్జెట్‌కు సంబంధం లేదు. ఈ మొత్తాన్ని బడ్జెట్ నిధుల నుంచి కేటాయించరన్నది వాస్తవం. ఈ రుణాలు నాబార్డ్, ఇతర కమర్షియల్ బ్యాంకుల ద్వారా రైతులకు అందనున్నాయి. వీటిలో పేద, మధ్య తరగతి రైతులు లబ్ది పొందే అవకాశం చాలా తక్కువ. దీనికి కారణం కేంద్రం తీసుకొచ్చిన నిబంధనలే. రైతు రుణాల్లో కేంద్రం విధించిన నిబంధనలు ధనిక రైతులు, పెట్టుబడిదారులకు లాభం చేకూర్చేలా ఉన్నాయి. మరోవైపు వాస్తవ లెక్కల ప్రకారం.. రైతులకు రూ.18 లక్షల కోట్ల రుణాలను అందించాల్సి ఉన్నా.. కేవలం రూ.11లక్షల కోట్లతోనే సరిపెట్టింది.

దేశాభివృద్ధికి దోహదపడేది కాదు

డి రాజా, సీపీఐ నేత

కేంద్ర ప్రభుత్వం రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజల కండ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేసింది. ఉద్యోగాలు కల్పించడానికి చేసే కచ్చితమైన ప్రయత్నాలు బడ్జెట్‌లో లేవు. రైతుల ఆదాయాన్ని రెటింపు చేస్తామని అన్నారు. అది వాస్తవ రూపం దాల్చాలంటే వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు 12 శాతానికి పెరగాలి కానీ ఆ పరిస్థితి లేదు.

వాస్తవానికి దూరంగా

మన్మోహన్, మాజీ ప్రధాని

బడ్జెట్ లెక్కలు వాస్తవానికి దూరంగా ఉన్నాయి. 'సంస్కరణ' అనే పదాన్ని చాలా సార్లు వాడి ఆ పదానికున్న విలువను మంటలో కలిపారు. రైతుల ఆదాయం రెట్టింపెలా చేస్తారో చెప్పలేదు.

దేశరాజధానిపై సవతి తల్లి ప్రేమ

కేజ్రీవాల్, ఢిల్లీ సీఎం

దేశ రాజధానిలో ముఖ్యమైన మౌళిక వసతులకు కేటాయింపులుంటాయని ఆశించాను. కానీ కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమనే చూపించడం పట్ల నిరాశకు లోనయ్యాను. మధ్యతరగతి ప్రజలకు, వర్తకులకు ప్రయోజనకరంగా లేదు. వారిని పూర్తిగా విస్మరించారు.

నిరుద్యోగుల ప్రస్తావనే లేదు

మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

బడ్జెట్‌లో నిరుద్యోగుల ప్రస్తావనే లేదు. ఇది ఎంతమాత్రం ప్రజానుకూలమైనది కాదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇంకా కష్టాల్లోనే కొట్టుమిట్టాడుతున్నాయి. కేవలం 1శాతం విద్యా సెస్‌ను ప్రవేశపెట్టడం సిగ్గుచేటు. మొత్తంగా ఇందులో కొత్తదనం ఏమీలేదు.

కీలకాంశాల గుర్తింపులో విఫలం

చిదంబరం, ఆర్థికశాఖ మాజీ మంత్రి

ప్రభుత్వం ప్రవేశ పెట్టింది విఫల బడ్జెట్. ఆర్థిక వ్యవస్థలో కీలకాంశాలను గుర్తించడంలో ప్రభుత్వం తన వైఫల్యాన్ని అంగీకరించింది. దురదృష్టవశాత్తు.. బడ్జెట్ ప్రతిపాదనలు విస్మరించారు. భవిష్యత్తులో తీవ్ర పరిణామాలుంటాయి.

ఇది ఎన్నికల దృష్టితోనే : శివసేన

వచ్చే ఏడాది రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టబడిన బడ్జెట్. దృష్టిని పరిశ్రమల నుంచి రైతులు, ఆరోగ్యం, విద్య వైపునకు మళ్లించారు. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు, గుజరాత్ ఎన్నికలకు సంబంధించి విమర్శల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవాల్సి వచ్చింది.

పేదలు, కార్మికులు, రైతులకు నిరాశే

అఖిలేష్ యాదవ్, యూపీ మాజీ సీఎం

పేదలు, కార్మికులు, రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. సామాన్య ప్రజలు, మహిళలు, చిన్న వ్యాపారులను ఈ బడ్జెట్ గట్టి దెబ్బ కొట్టింది. బీజేపీ చివరి బడ్జెట్‌లోనూ తాము ధనవంతుల పక్షమేనని మరోసారి నిరూపించుకుంది.

భ్రమలకు గురిచేసే బడ్జెట్: సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పార్లమెంట్‌లో అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ సరళీకరణ విధానాలకు ఊతమిస్తూ, భ్రమలకు గురిచేసేదిగా ఉందని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, ఎం సాయిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయం, ఆరోగ్యం, సామాజిక పథకాలపై కేంద్రీకరణ అని చెప్పి, గత బడ్జెట్ కంటే 1.31శాతం ఈ రంగాలకు నిధులు తగ్గించడం అన్యాయమని తెలిపారు. కార్పొరేట్ పన్ను రెండు శాతం తగ్గించి, సంపన్నులకు మేలు చేశారని విమర్శించారు.

నేడు అంగన్‌వాడీల నిరసనలు

బడ్జెట్‌లో అంగన్‌వాడీలకు వేతనాలకు పెంచకుండా మోసం చేసిన కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జయలక్ష్మి పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 27లక్షల మంది అంగన్‌వాడీలకు కేంద్రబడ్జెట్‌లో కనీసం ప్రస్తావన లేకపోవడం సరికాదని విమర్శించారు.

కొక్కొరోకో..



విద్యారంగానికి పదిశాతం నిధులు కేటాయించాలి: టీటీఎఫ్

కేంద్రబడ్జెట్‌లో విద్యారంగానికి పదిశాతం నిధులు కేటాయించాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్ డిమాండ్ చేశారు. విద్యారంగానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం సరికాదనీ పేర్కొన్నారు. ఉద్యోగులకు ఆదాయపు పన్నులో మినహాయింపులు ఇవ్వకుండా, విద్యాసెస్‌ను మూడు నుంచి నాలుగుశాతం పెంచడం దారుణమని అన్నారు.

ఎంపీలకు జీతాలు పెరిగాయి...

- 5 ఏండ్లకోసారి ఎంపీ వేతనాల్లో మార్పు
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్ల వేతనాలు పెంపు
- వేతన జీవులకు మాత్రం నిరాశే

న్యూఢిల్లీ : ఎంతో కొంత పన్ను మినహాయింపు దక్కుతుందనుకున్న వేతన జీవికి నిరాశే ఎదురైంది. పోనీ వేతన పెంపునకు సంబంధించి ఊరట కలిగించే వార్త వినిపిస్తుందనుకుంటే, అదీ లేదు. మరోవైపు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ...రాష్ట్రపతి, రాష్ట్రాల గవర్నర్లకు, పార్లమెంట్ సభ్యులకు తీపి కబురు చెప్పారు.

రాష్ట్రపతి వేతనాన్ని రూ.5 లక్షలకు, ఉపరాష్ట్రపతి వేతనాన్ని రూ.4లక్షలకు, గవర్నర్ల వేతనాలను రూ.3.5 లక్షలకు పెంచుతున్నట్టు జైట్లీ ప్రకటించారు. అలాగే పార్లమెంట్ సభ్యుల జీతభత్యాలపైన కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి ప్రతి ఐదేండ్లకోమారు ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఎంపీల వేతనాలు పెరుగుతాయని చెప్పారు. జైట్లీ ఈ మాట చెప్పినప్పుడు లోక్‌సభ చప్పట్లతో మారుమోగింది.

"రాష్ట్రపతి వేతనాన్ని రూ.1.50 లక్షల నుంచి రూ.5లక్షలకు, ఉపరాష్ట్రపతి వేతనాన్ని రూ.1.30 లక్షల నుంచి రూ.4 లక్షలకు, గవర్నర్ల వేతనాన్ని రూ.1.10లక్షల నుంచి రూ.3.5 లక్షలకు పెంచుతున్నాం. ఈ పెంపు 2018 జనవరి నుంచే వర్తిస్తుంది. ఇక ఎంపీల జీతభత్యాల పెంపునకు విధానాన్ని రూపొందించాం. ద్రవ్యోల్బణాన్ని అనుసరించి ప్రతి 5 ఏండ్లకు ఒకసారి ఎంపీల జీతాలు ఆటోమెటిక్‌గా పెరుగుతాయి" అని జైట్లీ చెప్పారు.

- కనీస వేతన సవరణను, ఫిట్‌మెంట్ ఫార్ములాలో మార్పు, ఉద్యోగస్తులకు కొత్త పెన్షన్ పథకం...వంటివి కేంద్రం ప్రకటిస్తుందని ఎన్నో ఆశలతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులంతా ఎదురుచూశారు.
- గత 60 ఏండ్లలో ఉద్యోగస్తుల్ని తీవ్రంగా నిరాశపర్చిన బడ్జెట్ ఇదే. అలాగే దేశంలోని కార్మిక శక్తికి కూడా ఈ బడ్జెట్ ఎలాంటి ప్రయోజనాల్నీ, సంక్షేమ పథకాల్నీ ప్రకటించలేదు.
- జైట్లీ ప్రసంగాన్ని బట్టి ఇక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇక '7వ సెంట్రల్ పే కమిషన్ (సీపీపీ)' గురించి మరిచిపోవాల్సిందే.

కేంద్ర-రాష్ట్రాల భాగస్వామ్యంతో.. జాతీయ ఆరోగ్య భద్రతా పథకం

ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున బీమా సౌకర్యం

- తమతో సంప్రదించకపోవడం పట్ల పలు రాష్ట్రాల అసంతృప్తి
- వైద్య సేవల కోసం లక్షా 50 వేల ఆరోగ్య కేంద్రాలు

న్యూఢిల్లీ: ఆరోగ్య సంరక్షణ కోసం రెండు కొత్త పథకాలను ప్రారంభిస్తున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. అందులో ఒకటి జాతీయ ఆరోగ్య భద్రతా పథకం. ఈ పథకం కింద రూ.5 లక్షల వరకూ ప్రతి కుటుంబానికీ బీమా సౌకర్యం కల్పిస్తారు. ఈ పథకం వల్ల 10 కోట్ల పేద కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. ఒక్కో కుటుంబానికి సగటున ఐదుగురు సభ్యులను లెక్కేసి 50 కోట్లమందికి ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య సంరక్షణ పథకమని జైట్లీ అన్నారు. అయితే, ఈ పథకంలో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున అంటే ఐదుగురు సభ్యులున్న కుటుంబంలో ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పుననే ప్రయోజం కలుగుతుంది. దీంతో, ఇది ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలకన్నా ఏమాత్రం మెరుగైంది కాదని అర్థమవుతోంది.

మహిళలకు మొండిచేయే..

- క్రీమ్ నుంచి ఆభరణాల వరకు అన్నీ పెరిగేవే
- శానిటరీ న్యాప్కిన్స్‌పై జీఎస్టీ తగ్గింపు ఊసేలేదు

జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత జైట్లీ తొలి బడ్జెట్ ఇది. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులపై పన్నులను పెంచడంతో వాటి ధరలు పెరుగుతున్నాయి. అలాగే మహిళలు ఉపయోగించే అనేక వస్తువుల ధరలు పెరుగుతున్నాయి.. ఈ బడ్జెట్ మహిళల జీవనశైలిని ప్రభావితం చేసే విధంగా ఉందని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. ముఖానికి రాసుకునే పౌడర్ మొదలుకుని మహిళలు అమిత ఇష్టంగా ధరించే వెండి, బంగార ఆభరణాలు,శరీరసౌందర్యానికి వాడే సన్‌స్క్రీన్, మానిక్యూర్, పెడిక్యూర్, స్మార్ట్ వాచ్‌లు, సబ్బులు, పరిమళ ద్రవ్యాలు, షూలు, చెప్పులు, స్కిల్ వస్త్రాల రేట్లు భారీగా పెరగనున్నాయి.

'అవసరమైన ఆరోగ్యకరమైన వస్తువులైన' శానిటరీ న్యాప్కిన్స్‌పై విధించిన 12 శాతం జీఎస్టీని తగ్గించాలని మహిళా సంఘాలు, యువతులు చేస్తున్న డిమాండ్‌ను మోడీ సర్కార్ పెడచెవిన పెట్టింది. కనీసం ఈ బడ్జెట్‌లోలైనా దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటారని వారు ఎదురుచూశారు. నిత్యావసరమైన ఈ వస్తువులపై 12 శాతం జీఎస్టీకి వ్యతిరేకంగా మధ్యప్రదేశ్‌లో ఉద్యమం కూడా సాగుతోంది. సబ్సిడీ మీద, నామమాత్రపు ధరలతో వీటిని అందచేయాలని డిమాండ్ చేస్తున్నారు. జీఎస్టీ అమలులోకి వచ్చిననాటి నుంచి దీనిపై పలు మహిళా సంఘాలు తమ నిరసనను వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. అయినా మోడీ సర్కార్ ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు బడ్జెట్‌లో ఎక్కడా కనిపించలేదు.

విద్యారంగంలో మౌలిక వసతుల కోసం.. నాలుగేండ్ల కాలానికి రూ.లక్ష కోట్లు

విద్యారంగానికి ఈ బడ్జెట్‌లో రూ.85,010 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో(సవరించిన) 81,869 కోట్లు కేటాయించారు. విద్యారంగంలో మౌలిక నిర్మాణాల పున:ప్రతిష్టాపన(రైజ్) పేరుతో మౌలిక వసతులు, పరిశోధన కోసం రూ.లక్ష కోట్లు కేటాయిస్తున్నట్టు అరుణ్‌జైట్లీ తెలిపారు. నాలుగేండ్ల కాలంలో ఈ నిధులను ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. విద్యాహక్కు చట్టం కింద 13 లక్షలమంది శిక్షణలేని ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించనున్నట్టు తెలిపారు. జాతీయస్థాయిలో ఉపాధ్యాయ శిక్షణ కోసం సమగ్ర బీఈడీ కోర్సును ప్రారంభించనున్నట్టు జైట్లీ తెలిపారు.

రైతులకు మాటలు పెట్టుబడిదారులకు మూటలు

రైతు సంఘాల నేతలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులో ప్రాధాన్యత లేకున్నా మాటల్లో మాత్రం ప్రథమ పీటం వేసింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని బడ్జెట్‌లో ఆర్థికశాఖ మంత్రి తెలిపారు. అయితే ఈ విషయాన్ని 2014 నుండి చెప్తూ వస్తున్నారని రైతు సంఘాల నేతలు తెలిపారు. వాస్తవానికి రైతుల ఆదాయం పెరగకపోగా వస్తున్న ఆదాయంలోనే 68 శాతం పడిపోయిందని ప్రభుత్వమే తెలిపింది. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు పెరగకపోగా తగ్గుముఖం పట్టింది. సేంద్రియ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్టుగా తెలిపి కేవలం 200 కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. 11 లక్షల కోట్లు వ్యవసాయ రుణాలు ఇవ్వబోతున్నట్టు చెప్పినా, ఈ రుణాలు బడ్జెట్ నుండి ఇచ్చేది ఉండదు. రిజర్వు బ్యాంకు ఆదేశం ప్రకారం 18 లక్షల కోట్లు బ్యాంకుల నుండి రుణాలు ఇచ్చినట్టయితే



(ఫైల్)

రైతులు వడ్డీ వ్యాపారుల దగ్గరికి పోవలసిన అవసరం ఉండదు. దీనిపై ప్రభుత్వం నోరు విప్పలేదు. రైతులందరికీ క్రెడిట్ కార్డులు ఇస్తామని గత నాలుగు సంవత్సరాలుగా చెప్తున్న మాటనే చెప్పారు తప్ప కొత్తదనం ఏమి లేదు. ఆత్మహత్యల నివారణ గురించి బడ్జెట్ ప్రస్తావనే లేదు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్ఎస్‌పి నలభై శాతం పంటలకే దొరుకుతుంది. ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి అమలు చేస్తామని చెప్పిన మాట నీటి మూటలయ్యింది. ఉత్పత్తి ఖర్చులకు 30 శాతం తగ్గించి మద్దతు ధరను నిర్ణయిస్తున్నారు. మద్దతు ధరల నిర్ణయాన్ని చట్టం చేయటానికి మాత్రం ముందుకు రావడం లేదు. వ్యవసాయాధారిత అభివృద్ధి క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు కానీ, వ్యవసాయ పరిశోధనలకు నిధులు పెంచలేదు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం వలన ఒక సంవత్సరంలోనే రైతులకంటే బీమా కంపెనీలకే వేల కోట్లు లాభాలు ఆర్జించాయి. పశుగణాభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నట్టుగా బడ్జెట్‌లో తెలిపారు.

అప్పులన్నిటినీ మాఫీ చేయాలి : తెలంగాణ రైతుసంఘం

వ్యవసాయం రంగం అభివృద్ధి చెందనిదే ఇతర రంగాలు కూడా అభివృద్ధి చెందడం అసాధ్యమని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.జంగారెడ్డి, టి.సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో రైతుల అప్పులన్నింటిని మాఫీ చేయాలని, ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం కలిపి పంటల ధరలను నిర్ణయించడానికి పార్లమెంటులో చట్టం చేయాలని తెలిపారు. గత సంవత్సరం రైతుల ఆత్మహత్యల నివారణకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల నేటికి ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు.

కుంతియాతో మందకృష్ణ భేటీ

- వర్గీకరణ కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తీసుకురావాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియాతో ఆయన భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, ఎంఆర్‌పీఎస్ ఉద్యమంపై చర్చించారు. వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న బీజేపీ పదిహేను వందల రోజులు గడిచిపోయాయని, ఈ బడ్జెట్ పార్లమెంటరీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం కాంగ్రెస్ పట్టుపట్టాలని కోరినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి రాహుల్‌తో లేఖ రాసేలా ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఎస్సీ విభాగం చైర్మెన్ ఆరేపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు. గురువారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ వి హనుమంతరావు ప్రజాగాయకుడు గద్దర్‌తో భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

పంచాయతీరాజ్‌లో ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీ రాజ్‌శాఖలో ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఖాళీగా ఉన్న మొత్తం 151 ఉద్యోగాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ద్వారా నియా మకాలు చేపట్టాలని ఆదేశించింది. హైదరాబాద్ మినహా మిగతా జిల్లాల్లో ఈ ఉద్యోగాల భర్తీ చేపట్టేందుకు అనుమతిచ్చింది. దీంతో 77 జూనియర్ అసిస్టెంట్, 74 టైపిస్ట్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

టీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయాలి : టీ మాస్,కేవీపీఎస్ డిమాండ్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం మర్తిడి గ్రామంలో దళిత మహిళ సువర్ణను కిరోసిన్ పోసి తగలబెట్టిన టిఆర్ఎస్ మండల కో-ఆప్షన్ సభ్యులు బషరత్‌ఖాన్ తదితరులపై హత్య చేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని టీమాస్, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు టీమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ , కెవిపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాడిగల్ల భాస్కర్, టి.స్కైలాబ్‌బాబు వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు. బాధిత కుటుంబానికి రూ. 25లక్షలు ఆర్థిక సహాయం ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇప్పటివరకు జరిగిన దాడులపై ప్రభుత్వం తగిన రీతిలో స్పందించకపోవడం వల్లే ఇలాంటి దాడులు జరుగుతున్నాయన్నారు.

హైదరాబాద్‌లో మహిళలపై దాడులను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర రాజధానిలో 24గంటల్లో ఏకంగా ఆరు హత్యలు వెలుగుచూడటం రాష్ట్ర ప్రజానీకానికి, మహిళలకు ఆందోళన కలిగిస్తున్నదని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. గురువారం సుందరయ్య పార్క్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలను నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం జరిగింది. ఈ సందర్భంగా మల్లు లక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాపితంగా మహిళలపైన ఒక్క డిసెంబర్ నెలలో 15పైగా అత్యాచారాలు, హత్యలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టడంలో పోలీస్ వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం వైఫల్య చెందిందన్నారు.



రాష్ట్ర వ్యాపితంగా అమ్మాయిలకు, మహిళలకు రక్షణ భద్రత కల్పించాలని, నేరస్తులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుద్వారా విచారణ జరిపి శిక్షలు విధించాలని , నిర్భయ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి. హైమావతి మాట్లాడుతూ స్త్రీ పురుష సమానత్వాన్ని, హక్కులను చాటే విధంగా ప్రచార క్యాంపెయిన్ ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.ఎన్. ఆశాలత, సహాయ కార్యదర్శులు డి. ఇందిర, అరుణజ్యోతి, యం. వినోద, రాష్ట్ర కమిటి సభ్యులు విశాల, సృజన, శశికళ, యం. స్వర్ణ, శ్రామిక మహిళ ఆర్. వాణి తదితరులు పాల్గొన్నారు.

అమల్లోకి ఈ-వే బిల్

వాణిజ్యపన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్

- జీఎస్టీ తరువాత మరో మైలురాయి అని వ్యాఖ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంతోపాటు మరో 12 రాష్ట్రాల్లో ఈ-వే బిల్ విధానం గురువారం నుంచి అమల్లోకి వచ్చిందని రాష్ట్ర వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సోమేశ్‌కుమార్ తెలిపారు. గురువారం సచివాలయంలో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. జీఎస్టీ తరువాత ఇది రెండో మైలురాయి అని అభిప్రాయపడ్డారు. ఈ పద్ధతి మూలంగా సరుకు రవాణా సులభతరం అవుతుందన్నారు. సమాచారం సైతం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ-వే బిల్ మూలంగా సరుకును ఎక్కడా, ఎవరు ఆపరని తెలిపారు. సరుకుల విలువ రూ.50 వేలకు మించి ఉంటే వ్యాపారులు, రవాణాదారులు ఈ-వే బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో డిసెంబరు నెలకు సంబంధించి జనవరి నెలలో బాగా ఆదాయం వచ్చిందని తెలియజేశారు. అది రూ.1656.14 కోట్లుగా ఉందని వివరించారు. ఆదాయం పెరగడానికి, మొబైల్ టీమ్‌లను సైతం ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించడం, మహా చెక్‌లు చేపట్టడం, జీఎస్టీ రిటర్నులు పైల్‌చేయని వాళ్లకు నోటీసులు జారీచేయడం కారణాలని తెలిపారు. జీఎస్టీ పన్ను చెల్లించకుంటే



సరుకు విలువతోపాటు 100 శాతం జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. జీఎస్టీ ద్వారా రూ.1.19 కోట్ల మేర పన్ను వసూలైందని వివరించారు. దాదాపు 14 వేల మందికి నోటీసులు ఇచ్చామని, రాబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లో జీఎస్టీ రిటర్నుల ఫైలింగ్ సరళతరం చేయడం జరుగుతుందన్నారు. కమిషనర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇది సింగిల్ వే బిల్ అని, సరుకుల రవాణాకు లాభం అని చెప్పారు. వ్యాపారులకే కాకుండా ప్రభుత్వానికి కూడా లాభం అని, సరుకుల విలువ రూ.50 వేలు మించి వ్యాపారులంతా ఈ-వే బిల్ తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు 547 కేంద్రాల్లో 46,505 మంది విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాకమిటీ కన్వీనర్, సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు, పరిశీలకులు పర్యవేక్షించారని పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీ వరకు ప్రాక్టికల్ జరుగనున్న విషయం తెలిసిందే.

స్కూల్లోకి దూసుకెళ్లిన కారు

- కరస్పాండెంట్ నిర్లక్ష్యంతో విద్యార్థిని మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఘటన

నవతెలంగాణ-బాలానగర్

కరస్పాండెంట్ కారు పాఠశాలలోకి దూసుకెళ్లడంతో ఓ విద్యార్థిని మృతిచెందింది. మరో ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని అక్షర పాఠశాల విద్యార్థులు ఉదయం ప్రార్థన కోసం మైదానంలోకి వస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాల ముందు పార్కింగ్ చేసి ఉన్న కారును పక్కన పెట్టేందుకు కరస్పాండెంట్ మురళీ యత్నించగా అది అదుపు తప్పి విద్యార్థినులపైకి దూసుకెళ్లింది.

ఈ ప్రమాదంలో పదో తరగతి చదువుతున్న రమ్యశ్రీ (14), గాయత్రితో పాటు మరో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రమ్యశ్రీ మృతిచెందింది. గాయత్రి పరిస్థితి విషమంగా ఉంది. మృతురాలి తండ్రి చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ భాస్కర్‌గౌడ్, జడ్చర్ల సీఐ బాల్‌రాజు తెలిపారు.

ఉద్యోగులకు తీవ్ర నిరాశ : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు తీవ్ర నిరాశ కలిగిందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూ టీఎఫ్) ప్రధాన కార్యదర్శి చావ రవి చెప్పారు. గురు వారం ఆయన నవతెలంగాణతో మాట్లాడు తూ ప్రభుత్వ ఉద్యోగులంతా ఆదాయపు పన్ను చెల్లింపు పరిధిలోకి వచ్చారని అన్నారు. ఆఫీస్ సబార్డినేట్ సైతం పన్ను చెల్లిస్తున్నారని చెప్పారు. ఆదాయపు పన్ను పరిమితిలో, శ్లాబుల్లో మార్పు వస్తుందని ఆశించామన్నారు. బీజేపీ ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక వైఖరికి ఇదే నిదర్శనమని విమర్శి ంచారు. విద్యారంగానికి కేటాయింపులు ప్రభుత్వ విద్యారంగాన్ని బలపరిచేదిగా లేదన్నారు. నామ మాత్రంగా కేటాయించారని చెప్పారు. కేంద్ర ప్రాయోజిత పథకాలైన ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ, మధ్యాహ్న భోజన పథకాలకూ అరకొర నిధులే కేటాయించిందని అన్నారు.

ఉద్యోగులు సంతోషంగా లేరు : సీసీజీఈడబ్ల్యూ

ఈ బడ్జెట్‌లో ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పు వస్తుందని ఆశించినా వేతన జీవులకు నిరాశే కలిగిందని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య (సిసిజీఈడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షుడు అజీజ్ నవతె లంగాణతో చెప్పారు. ఆదాయపు పన్ను పరిమితి రూ.5 లక్షల వరకు పెంచుతారని ఆశించామని అన్నారు. ప్రస్తుతం ఉన్న రూ.2.50 లక్షల ఆదాయపు పన్ను పరిమితిలో మార్పు లేదని ప్రకటించడం నిరాశకు గురిచేసిందని చెప్పారు. ప్రయాణ, వైద్య ఖర్చులకు స్టాండర్డ్ డిడక్షన్ రూ. 40 వేల వరకు వర్తిస్తుందని ప్రకటించినా అందులో స్పష్టత లేదన్నా రు. ఉద్యోగులంతా సంతోషంగా లేదరని, తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు.

ఉద్యోగ వ్యతిరేక ప్రభుత్వం : టీఎన్జీవో

ఎంతో ఆశగా ఎదురుచూసిన ఉద్యోగులకు తీవ్ర నిరాశే ఎదురైందని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి నవతెలంగాణతో అన్నారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని ఉద్యోగులు చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా 2.50 కోట్ల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు పది కోట్ల మంది నిరాశకు లోనయ్యారని చెప్పారు. పెరిగిన ద్రవ్యోల్బణం, ధరలకు అనుగుణంగా జీతాలు పెరగాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతున్నామని అన్నారు. మరోవైపు పెరిగిన జీతాలను కేంద్ర ప్రభుత్వం కేంద్రం పన్నుల రూపంలో వసూలు చేస్తోం దన్నారు. ఉద్యోగులకు ఏం న్యాయం చేయడం లేదన్నారు. ప్రయాణ, వైద్య ఖర్చుల కోసం స్టాండర్డ్ డిడక్షన్ పేరుతో రూ.40 వేల వరకు పన్ను రాయితీ ఇచ్చినా ఉద్యోగులు, పింఛనుదారులకు ఒరిగిందేం లేదని విమర్శి ంచారు. ఆదా యపు పన్ను పరిమితి తాము రూ.5 లక్షల అడి గామని, కనీసం రూ. 3 లక్షలు లేదా రూ.4 లక్షల వరకు కేంద్రం ప్రక టిస్తుందని ఆశించామని అన్నారు.

కెరటం నా ఆదర్శం. లేచిపడుతున్నందుకు కాదు. పడినా లేస్తున్నందుకు. -స్వామి వివేకానంద.


సంపాదకీయం

జైట్లీ మంత్ర

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అట్టహాసంగా గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆసాంతం మాయ బడ్జెట్. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక ఇంతటి అభూత కల్పనల బడ్జెట్ ఎప్పుడూ రాలేదు. బీజేపీ సర్కారుకు భజన చేసే కుహనా ఆర్థిక వేత్తలు, అనుకూల మీడియా మాత్రమే బడ్జెట్‌ను అమోఘమని కీర్తిస్తున్నది. ఇప్పటి వరకు మోడీ ప్రభుత్వం నాలుగు బడ్జెట్లు తీసుకొచ్చింది. ప్రస్తుత 2018-19 బడ్జెట్ ఈ సర్కారు హయాంలో చివరి పూర్తి స్థాయి బడ్జెట్. దీనిలోనైనా వాస్తవ ప్రజా సంక్షేమ కోణం వెలుగు చూస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. పలు సందర్భాల్లో ప్రధాని, విత్త మంత్రి తమ బడ్జెట్‌లో జనాకర్షక పథకాలుండవని సుస్థిర అభివృద్ధి తమ లక్ష్యమని చెబుతూ వచ్చారు. చివరికి ఆ మాటపై కూడా నిలవలేదు.

చమురు ధరలపై ఆర్థిక సర్వేలో ఆందోళన వ్యక్తపర్చగా బడ్జెట్‌లో ఆ విషయాన్ని కప్పెట్టింది. రక్షణ రంగానికి నిధులు పెంచి ఉపఖండంలో ఉద్రిక్తతలకు కారణమవుతోంది. ప్రభుత్వ ఈ చర్యలన్నీ పేద, సాదలను కాల్చుకు తినేవి. ప్రజలపై భారాలు మోపుతూ, కార్పొరేట్లకు రాయితీలు ధారపోసే బడ్జెట్ పౌర

సాహసోపేత సంస్కరణలుగా చెప్పుకునే వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ), పెద్ద నోట్లరద్దు అమలు చేసినా అనుకున్న విధంగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరలేదు. ఈ నిర్ణయాల వలన పారిశ్రామిక, తయారీ, రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలు ఒకటేమిటి అన్ని రంగాలూ కుదేలయ్యాయి. అయినా సరే 'కింద పడ్డా తనదే పైచేయి అన్నట్టు' భారీ అంచనాలతో రూ.21.47 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించి ప్రజలను మోసం చేసింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ప్రజారోగ్యం తదితర కీలక రంగాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు ప్రజలను ఊహల్లో విహరించమంది. ఈ తంత్రం వేసింది అతి సమీపంలో ఉన్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఏడాదిలో ముంచుకొస్తున్న సార్వత్రిక ఎన్నికల కోసమేనని బడ్జెట్ మొత్తాన్ని పరిశీలించిన వారెవరికైనా సులభంగానే బోధ పడుతుంది. ప్రభుత్వానికి జన బాహుళ్యంపై ఏ మాత్రం ప్రేమ లేదనడానికి పన్నుల వ్యవహారమే ఉదాహరణ. ప్రత్యక్ష పన్నుల రాబడి ఈ సంవత్సరం 51.6 శాతం ఉంటే వచ్చే ఏడాది 50.6 శాతంగా అంచనా వేశారు. కార్పొరేట్ ట్యాక్స్‌ను 25 శాతానికి తగ్గించారు. ఇదే సమయంలో పరోక్ష పన్ను ఆదాయాన్ని ఎక్కువ ఆశించారు. ప్రత్యక్ష పన్నులను సంపన్నులు, కార్పొరేట్లు చెల్లిస్తారు. పరోక్ష పన్నులను జనం కడతారు. దొడ్డిదారిలో పన్నులు వడ్డించి ప్రజల నుంచి ఆదాయం పిండుకోవాలని చూస్తూ ప్రజలకు అచ్చే దిన్ అనడం ముమ్మాటికీ దగానే.



వ్యవసాయానికి ఇబ్బడిముబ్బడిగా దోచి పెడుతున్నట్టు జైట్లీ పేర్కొనడం పచ్చి మోసం. పంటలకు పెట్టుబడులపై ఒకటిన్నర రెట్లు మద్దతు ధర అన్నారు. ఇప్పటికే పలు రబీ పంటలకు ప్రకటించామని అబద్ధం చెప్పారు. ధరల స్థిరీకరణ నిధి లేకుండా ఎంఎస్‌పి అమలు ఎలా సాధ్యం? అప్పుల ఊబిలో కూరుకొని ఆత్మహత్యలబాట పట్టిన రైతాంగం తమకు రుణ మాఫీ చేయాలని ఆందోళనలు చేస్తుండగా ఆ అంశం బడ్జెట్‌లో మాట మాత్రం ప్రస్తావించలేదు. రైతులకు బ్యాంకులిచ్చే రుణాలను వాటిని ప్రభుత్వ ఖజానా నుంచి ఇస్తున్నట్టు గొప్పలకు పోవడం పక్కదారి పట్టించే కుట్ర. ప్రభుత్వాల ప్రయివేటీకరణ విధానాలతో వ్యవసాయరంగం పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోగా ప్రభుత్వ పెట్టుబడులు పెంచే బదులు కార్పొరేట్ సాగు వైపు రైతులను మళ్లించేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీవో), ఈ-నామ్, వంటి పథకాలు వల్లించడం దారుణం. గ్రామీణాభివృద్ధిలో ప్రధానమైన ఉపాధి హామీకి నిధులు పెరగలేదు. గ్రామీణ కూలీలకు పనులు కల్పించాలంటే ఆ నిధులు ఏ మూలకూ చాలవు. స్వచ్ఛ భారత్ వంటి ప్రచార పథకాలకు మాత్రం నిధులు ప్రతిపాదించారు. ఆహారభద్రతా చట్టం నిఖార్సుగా అమలు కావాలంటే పంటల ధరలు, ధాన్యాల సేకరణకు నిధులు కావాలి. ప్రభుత్వం ఆ దిశగా బడ్జెట్‌లో కనీసం ఆలోచన చేయలేదు.

ద్రవ్యలోటును తగ్గించే పేరుతో ఎన్‌డీఏ సర్కారు ప్రజల ఉపాధి, సంక్షేమానికి కోతలు పెట్టింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి నిరుడు జీడీపీలో 1.15శాతం కేటాయించగా ఈసారి 1.08శాతానికి తగ్గించారు. విద్య కేటాయింపులు 0.49శాతం నుంచి 0.45శాతానికి కత్తెర పడింది. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు వారి జనాభా దామాషాకు సుదూరంలో కేటాయింపులున్నాయి. ఆరోగ్య బీమాను రూ.5 లక్షలకు పెంచినా అందుకు తగ్గట్టు నిధులు చూపలేదు. ప్రయివేటు బీమా సంస్థలకు ఆయాచిత లబ్ది చేకూర్చేందుకే ఆరోగ్య, పంటల బీమా వగైరాలు. రైల్వే ఆదాయాన్ని బొక్కసంలో వేసుకోవడం తప్ప ఆ శాఖకు సముచిత కేటాయింపుల్లేవు. ప్రయాణీకుల భద్రతను విస్మరించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, పలు రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆహ్వానం వంటివి మరింతగా 'సంస్కరణ'లను పరుగులు పెట్టించనున్నాయి. కార్పొరేట్ పన్ను తగ్గించిన సర్కారు వేతన జీవుల పన్ను శ్లాబులను సవరించలేదు. చమురు ధరలపై ఆర్థిక సర్వేలో ఆందోళన వ్యక్తపర్చగా బడ్జెట్‌లో ఆ విషయాన్ని కప్పెట్టింది. రక్షణ రంగానికి నిధులు పెంచి ఉపఖండంలో ఉద్రిక్తతలకు కారణమవుతోంది. ప్రభుత్వ ఈ చర్యలన్నీ పేద, సాదలను కాల్చుకు తినేవి. ప్రజలపై భారాలు మోపుతూ, కార్పొరేట్లకు రాయితీలు ధారపోసే బడ్జెట్ పౌర సమాజానికి ఆశనిపాతం.

డార్విన్ పరిణామ సిద్ధాంతం కళ్ల ముందే ఉంది



డాక్టర్ దేవరాజు మహారాజు

జీవ పరిణామ సిద్ధాంతం టూకీగా చెప్పేదేమంటే... చేపల నుండి ఉభయచరాలు రూపొందాయి. వాటి నుండి సరీసృపాలు, వాటి నుండి ప్రాథమిక క్షీరదాలు, వాటి నుండి ప్రైమేట్స్, వాటి నుండి ఓల్డ్ వరల్డ్ మంకీస్.. అందులోంచి మనిషి పూర్వీకులు అంటే వానరాలు పరిణామ క్రమంలో రూపొందుతూ వచ్చాయని! జీవ పరిణామ సిద్ధాంతాన్ని చార్లెస్ రాబర్ట్ డార్విన్ (1809-1882) తన యాభైయవ యేట అంటే 1859లో ప్రకటించాడు. కొందరు సమకాలికుల నుండి తీవ్ర విమర్శలు ఎదురైనా.. తర్వాత జరిగిన ఆధునిక పరిశోధనలన్నీ డార్విన్ సిద్ధాంతాన్ని బలపరుస్తూ వచ్చాయి. అందువల్ల డార్విన్ ప్రపంచపుగతిని మార్చే ఆలోచనా విధానాన్ని అందించిన వాడయ్యాడు. ఆ మహనీయునికి మానవజాతి కృతజ్ఞతా భావంతో ఉంటుంది.

ఒక పథకం ప్రకారం తమ ఛాందస భావాలు దేశంలో వ్యాపింపజేయాలని, వైజ్ఞానిక ఆలోచనని, హేతుబద్ధతని నాశనం చేయాలని కుట్ర పూర్వకంగా చేస్తున్న ప్రకటనలివి! ఇప్పటికే దేశంలోని రెండువేల మంది శాస్త్రజ్ఞులు మంత్రి ప్రకటనని తీవ్రంగా ఖండించారు. దేశంలోని దాదాపు అన్ని పత్రికల్లో ఈ విషయం మీద సంపాదకీయాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు వచ్చాయి. ఇవన్నీ జనం గమనిస్తున్నారు. 'తప్పదు.. వారు సహేతుకంగా, సమర్ధవంతంగా తిప్పికొడతారు."


సీతాకోకచిలుకను గమనించండి. అది ఉన్నది ఉన్నట్టుగా పుట్టలేదు. గుడ్డు నుండి ప్యూపా, లార్వా దశలు దాటి క్రమంగా సీతాకోక చిలుక అవుతుంది. మల్బరీ పట్టు పురుగులైనా అంతే. ఈగలు, దోమలు దశలవారీగా మారుతూ పెరుగుతాయి. సాయంత్రం కాగానే మన కాళ్ళ మధ్య గెంతుతూ కనిపించే కప్పల్ని చూడండి. అవేమైనా అలాగే పుట్టాయా లేదు కదా? అవి కూడా లార్వా దశలోంచే పెరిగి పెద్దవయ్యాయి. లార్వా దశలో వాటికి తోక ఉటుంది. మొప్పలుంటాయి. అంటే ఆ దశలో అది పూర్తి చేపలాగే ఈదుతుంది. చూడడానికి కూడా చేపలాగే ఉంటుంది. ఈ దశలో ఉన్న కప్పపిల్లల్ని మనం నీటి గుంటల్లో చూడొచ్చు. పరిణామ క్రమంలో ఈ తరువాత తోక తగ్గిపోతుంది. శ్వాసకోశాలు పెరుగుతాయి. ఆ విధంగా టాడ్‌పోల్ లార్వా పెరిగి, కప్పగా మారిపోతుంది. మరి ఇవన్నీ పరిణామ దశలు కావా? కండ్ల ముందే కనిపిస్తున్నాయి కదా?

"కోతి నుండి మనిషి ఎలా పరిణామం చెందాడు? ఆ పరిణామాన్ని ఎవడు చూశాడూ? డార్విన్ పరిణామ సిద్ధాంతం తప్పు.. పాఠశాల, కళాశాల బోధనా ప్రణాళికల్లోంచి దాన్ని తీసి వేయాలి" అని మన కేంద్ర మానవ వనరుల సహాయ మంత్రి ఒకరు మాట్లాడడం తీవ్రంగా నిరసించాల్సిన విషయం. ఈ విశాల విశ్వమంతా ఆ భగవంతుడి సృష్టి అని భావించేవారు.. భగవంతుడు ఈ జీవరాసుల్ని సృష్టిస్తున్నప్పుడు ఎవరైనా చూశారా? వారి తాతలు, ముత్తాతలు ఎవరైనా చూశారా? చూస్తే ఆ దేవునితో వారు ఓ సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో ఎందుకు పెట్టలేకపోయారూ?

ఏదో మనకున్న కొద్దిపాటి పరిజ్ఞానంతో కండ్లకు కనిపించే పరిణామ దశల్ని అందరితో పంచుకుంటున్నాం. అలాగే మంత్రిగారు వారి 'సృష్టిసిద్ధాంతం' ప్రకారం ఉదాహరణలు ఇస్తూ మాట్లాడితే బావుండేది. జీవితంలో మార్పు సహజం.. అనివార్యం.. అనే ప్రాథమిక అవగాహన లేనివారు ఏ వివరణ ఇవ్వగలరూ? ఇచ్చినా అందులో ఏమైనా పస ఉంటుందా? ఒక వేళ థియరీ ఆఫ్ స్పెషల్ క్రియేషన్ సృష్టి సిద్ధాంతం వారి విశ్వాసం మాత్రమే అయితే, అది వారి వ్యక్తిగత విషయం, భ్రమలతో, కల్పనలతో, వాచిపోయి ఉన్న వారి మెదడులోనే ఆ విషయాన్ని భద్రపరుచుకుని తాళం వేసుకోవడం మంచిది. ఎందుకంటే జనం ఇప్పుడు సహేతుకంగా ఆలోచిస్తున్నారు. ఏ స్థాయి వారైనా సరే.. పిచ్చిమాటలు చెపితే వారు వినడం లేదు. సమాజంలో హేతుబద్ధత పెరిగింది. కనీసం ఆ విషయం గుర్తుంచుకోవాలి. డార్విన్ పరిణామ సిద్ధాంతం తప్పు అనే వారు ఒక విషయం ఆలోచించాలి. పరిణామమే లేకపోతే తమకు బాల్యం, కౌమార్యం, యవ్వనం, వృద్ధాప్యం లాంటి దశలెందుకు ఉన్నాయో చెప్పాలి. వాస్తవాలు మాట్లాడుకోవాలంటే, ఈ భూమి మీద, వాతావరణంలో జీవులలో క్రమంగా మార్పులు రావడానికి కొన్ని మిలియన్ సంవత్సరాలు పట్టింది. మనిషి జీవితం వంద సంవత్సరాలనుకుంటే... ఏ ఒక్కరూ మిలియన్ సంవత్సరాలలో జరిగిన పరిణామ దశల్ని ప్రత్యక్షంగా చూడలేరు. భారతదేశానికి స్వాతంత్య్రం లభించిన తర్వాత పుట్టిన మన తరంవారు గాంధీని చూడలేదు. మనం గాంధీని చూడనంత మాత్రాన గాంధీ లేనట్టా? కాదు గదా? అదే విధంగా కొన్ని ఆధారాలను బట్టి మనం గతంలో జరిగిన సంఘటనల్ని నమ్ముతాం. జీవ పరిణామమూ అంతే, కొన్ని కచ్చితమైన ఆధారాలు మనకు కనిపిస్తూ ఉండడం వల్ల పరిణామ సిద్ధాంతాన్ని అర్థం చేసు కుంటున్నాం. నమ్ముతున్నాం. ఈ మాత్రం కామన్‌సెన్స్ లేనివాళ్లకు అసలు డార్విన్ పరిణామవాదం గూర్చిమాట్లాడే అర్హతే ఉండదు.

క్రీ.పూ. 4004 సంవత్సరం అక్టోబర్ 23న ఉదయం 9 గంటలకు దేవుడు జీవులన్నింటిని యధాతథంగా పుట్టించాడని క్రైస్తవ మత పెద్దలు యూరోప్‌లో ప్రకటించి ప్రచారం చేశారు. ఆ చెప్పిన తేదీకి ఆధారం లేదు. విషయానికీ రుజువులేదు. క్రీ.పూ. నాలుగువేలు, క్రీస్తు తర్వాత రెండువేల సంవత్సరాలు గడిచిపోయినా మత విశ్వాసకులు, మత బోధకులు ఆ విషయం మీద నోరువిప్పరు. నైలునది బురదలోంచి మొసళ్ళు పుట్టుకొస్తాయని, పేడలోంచి పురుగులు పుడతాయని చెప్పారు. అవన్నీ తెలివిలేని ఉదాహరణలు. మొసళ్ళు నది బురదలో కాకుండా గుడ్లు ఎక్కడ పెడతాయీ? చెట్లమీద పెట్టలేవు కదా? బురదలోని గుడ్లు పగిలి, మొసళ్ళు నీటిలో కాక ఎక్కడ పెరుగుతాయి? అలాగే పేడలో గుడ్డు దశలోనో, లార్వా (డింభక) దశలోనో వున్న క్రిములుపెరిగి కీటకాలుగా పేడలోంచి తన్నుకుని బయటికి వస్తాయి. ఇంగిత జ్ఞానం ఉన్న ఏ మనిషికైనా ఈ విషయం అర్థమవుతుంది. మూఢ భక్తులు, ప్రవచన కారులు, పారాయణం చేసుకునే సంస్కృతపండితులు ఈ విషయం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించరు. మట్టిలోంచి చెత్తలోంచి జీవం పుట్టుకొస్తుందని చెబుతారు. ఆ మట్టిలో, ఆ చెత్తలో జీవుల ప్రాథమిక దశలుముందే ఉంటాయన్న విషయం గ్రహించరు. అవే పెరిగి బయటికొస్తున్న విషయం గమనించరు.

అండంలోకి శుక్రకణం జొచ్చుకుపోయి, కణ విభజన జరిగి బ్లాస్టులా, గ్యాస్టులా దశలు దాటి పిండోత్పత్తి జరిగి, పిండంలో మళ్ళీ ఒక్కొక్క అవయవమూ ఏర్పడి, శిశువు తయారై తల్లి గర్భం లోంచి పుడితే దాన్నే పుట్టుక అని అంటారు. తక్కువ స్థాయి కీటకాల్లో, పురుగుల్లో పెరుగుదల దశలవారిగా బాహ్య ప్రపంచంలో జరుగుతుంది. అదే అభివృద్ధి చెందిన ఉన్నతశ్రేణి జంతువుల్లో అయితే పిండాభివృద్ధి తల్లి గర్భంలోనే జరుగుతుంది. పిండం పూర్తి శిశువుగా ఎదిగిన తర్వాతే బాహ్య ప్రపంచంలోకి వస్తుంది. దాన్నే మనం ప్రసవం అంటున్నాం. పాలిచ్చే జంతువుల్లో మాత్రమే ఇలా జరుగుతుంది. చేపల నుండి పక్షుల దాకా అన్నీ గుడ్లు పెడతాయి.తగిన సమయంలో గుడ్లు పగిలి పిల్లలు బయటికి రావడం మనం చూస్తుంటాం. ఇలా అండం నుండి పిండ దశదాకా జరిగే అభివృద్ధి క్రమాన్ని ఆటోజని అని అంటారు. అలాగే ప్రతి జంతువూ దాని మూల జంతువుల నుండి క్రమంగా మారుతూ ఇప్పుడున్న స్థితికి చేరుకోవడాన్ని ఫలోజని



అని అంటాం. (మనం ఇప్పుడు చూస్తున్న గుర్రానికి మూల జంతువు ఒకప్పుడు కుక్క సైజులో ఉండేది) ఈ విషయాలు అధ్యయనం చేసిన ఎర్నెస్ట్ హెకెల్ అనే శాస్త్రవేత్త 1866లో బయోజనటిక్ సూత్రాన్ని ప్రతిపాదించాడు. దాన్నే 'రికాప్చులేషన్ థియరి అని కూడా అంటారు. దీని ప్రకారం ఆంటోజనీ రిపీట్స్ ఫైలోజని / ఫైలోజనీ రిపీట్స్ ఆంటోజనీ.

ఉదాహరణకు సులభంగా చెప్పుకోవాలంటే పరిణామ సిద్ధాంతం ప్రకారం ఏకకణజీవుల నుండి బహుకణజీవులు అందులో నుండి వెన్నెముక లేని జంతువులు అందులో నుండి వెన్నెముక గల జీవులు అభివృద్ధి చెందాయని చెప్పుకుంటాం. అవన్నీ మనకు అండం నుండి పిండాభివృద్ధి దాకా వివిధ దశల్లో స్పష్టంగా కనిపిస్తాయి. స్త్రీ కణం ఏకకణం. పురుష శుక్రకణం ఏకకణమే. ఆ రెండూ కలిసిన తర్వాత, అండం విభజింపబడుతుంది. అంటే బహుకణాలుగా మారడం కదా? ఆ అండం ఏ వర్గానికి చెందిన జీవిదో దాని లక్షణాలు మొదట అభివృద్ధి అవుతాయి. ఉదాహరణకు అది పక్షిగుడ్లు అనుకుంటే మొదట నోటోకార్డ్ ఏర్పడుతుంది. (తొలి వెన్నెముక) తర్వాత ఈక/రెక్క ఏర్పడుతుంది. ఒకవేళ అది పాలిచ్చే జంతువు..క్షీరదానికి సంబంధించిన పిండం అయితే నోటోకార్డ్ తర్వాత వెంట్రుక ఏర్పడుతుంది. అలా క్రమంగా వర్గ లక్షణాలు, తర్వాత జాతి లక్షణాలు ఏర్పడుకుంటూ వస్తాయి. ఇవన్నీ పరిణామ క్రమంలో భాగంగానే శాస్త్రజ్ఞులు అధ్యయనం చేశారు. ఒక వరుస క్రమం ఉంది కాబట్టి, పరిణామం జరుగుతూ వచ్చిందని నమ్ముతున్నాం.

వైజ్ఞానిక నేపథ్యం లేని వాళ్ళు, ఆ సమాచారం అర్థం చేసుకోలేని సామాన్యులు కూడా జీవపరిణామ లక్షణాలు ఒక శిశువు ఎదుగుదలలో కూడా గమనించొచ్చు. ప్రతి జీవి ఎదుగుదల ఏకకణం నుండే ప్రారంభమౌతుందని చెప్పుకున్నాం. తర్వాత మానవ పిండం ఒకదశలో తోకతో సహా తల్లి గర్భంలో చేపలా ఉంటుంది. అభివృద్ధి జరిగి, అవయవాలన్నీ ఏర్పడి తోక కనుమరుగైపోయి భూమిమీద పడుతుంది. ఆ దశలో శిశువును గమనించండి. శిశువు బోర్లా పడి పాకటానికి ప్రయత్నిస్తుంది. అది సరీసృపాల లక్షణం. ఆ తర్వాత కొంత కాలానికి నాలుగు కాళ్ళ జంతువులాగా అంబాడుతుంది. అంటే చేతులూ కాళ్ళూ ముందుకు కదలడానికి ఉపయోగిస్తుంది. తర్వాత కొంత కాలానికి రెండు కాళ్ళమీద లేచి నిలబడి, నడవడం జరుగుతుంది. శిశువు మనిషిదే అయినా చేపల, సరీసృపాల ప్రాథమిక క్షీరదాల లక్షణాల్ని ప్రదర్శిస్తూ ఆయా అవస్థల్ని దాటుకుంటూ రావడం పరిణామ క్రమం కాదా?

జన్యు శాస్త్రవేత్తలు పరిశోధించి చెప్పిందేమంటే చేపలోని జన్యువు ఇంకా మనిషిలో ఉంది. చేప నీటిలో ఉంటుంది. నీరు దాని కంటిలోకి పోకుండా నెక్టిటేటింగ్ పొర ఉంటుంది. ఆ పొర పరిణామ క్రమంలో మనిషి దాకా వచ్చింది. అయితే అది మనిషికి అవసరం లేదు. అందుకే ఆ పొర కుంచించుకుపోయి, ముక్కు దూలానికి ఇటు అటూ ఉన్న కనుకొలుకుల మొదట్లో ముద్దలాగా ఉంటుంది. అలాగే మనిషి వానరంగా ఉన్నప్పుడు ఆకులు, పూలు, కందలు తిన్న దశలో పత్రహరితం జీర్ణం చేసుకోవడానికి అపెండిక్స్ అనే అవయవం అవసరమైంది. ఆధునిక మానవుడికి ఆ అవయం అవసరం లేదు. అయినా అది పరిణామ క్రమంలో వచ్చింది గనుక ఉంది. దానితో ఏదైనా సమస్య ఎదురైతే, వెంటనే సర్జరీ చేసి తొలగించాలి. ఇప్పుడు అవసరం లేకపోయినా, పరిణామ క్రమంలో వచ్చిన అవయవాలు కొన్ని మనిషి శరీరంలో వృధాగా ఉన్నాయి. వీటిని ఉపయోగపడని అవయువాలు అని అంటాం. పరిణామ వాదం తప్పు అనేవారు మనిషి శరీరంలో ఈ అవయవాలు ఎందుకున్నాయో వివరణ ఇవ్వాలి. డార్విన్ పరిణామ వాదం తప్పు.. అనే వారు వారి మెదడే మైనా ఉపయోగపడని అవయవంగా మారిందేమో ఆలోచించు కోవాలి. ఆ సహాయమంత్రి కనీసం ఎవరి సహాయమైనా తీసుకుని దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే బావుండేది. ఒక పథకం ప్రకారం తమ ఛాందస భావాలు దేశంలో వ్యాపింపజేయా లని, వైజ్ఞానిక ఆలోచనని, హేతుబద్ధతని నాశనం చేయాలని కుట్ర పూర్వ కంగా చేస్తున్న ప్రకటనలివి! ఇప్పటికే దేశంలోని రెండువేల మంది శాస్త్రజ్ఞులు మంత్రి ప్రకటనని తీవ్రంగా ఖండించారు. దేశంలోని దాదాపు అన్ని పత్రికల్లో ఈ విషయం మీద సంపాదకీ యాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు వచ్చాయి. ఇవన్నీ జనం గమని స్తున్నారు. 'తప్పదు..వారు సహేతుకంగా, సమర్ధవంతంగా తిప్పికొడతారు."

వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్, సెల్: 9573706806

మెయిల్ @ నవతెలంగాణ

నిరాశపరచిన బడ్జెట్


బెన్‌రెడ్డి అల్వాల్‌రెడ్డి

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన 2018-19 కేంద్ర బడ్జెట్ సమాజంలోని ఏ వర్గాన్ని సంతృప్తి పరచలేకపోయింది. వచ్చే ఏడాది రాబోయే ఎన్నికల దృష్ట్యా అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరేలా పథకాలు ప్రకటిస్తారని ఆశించారు. 11 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలు ఇవ్వాలని బడ్జెట్‌లో పొందుపర్చారు. ఈ రుణాలు బ్యాంకుల ద్వారానే ఇప్పించాలి. ఇప్పటికే లక్షల కోట్ల నిరర్థక ఆస్తులతో కునారిల్లుతున్న బ్యాంకులకు ఇది సాధ్యమేనా. పేరుకు పోయిన నిరర్థక ఆస్తులను ఎలా రాబట్టుకోవాలో, అందుకోసం ఏ చర్యలు తీసుకోవాలో ఎక్కడా ప్రస్తావించకుండా కోట్ల అప్పులు ఇప్పుడు సాధ్యమైన పనేనా?

పంటలకు కనీస మద్దతు ధర ఒకటిన్నర రెట్లు పెంచిన పెరుగుతున్న ఉత్పత్తి వ్యయంతో పోలిస్తే ఏమూలకూ సరిపోదు. కనీస మద్దతు ధర పెంచడంతో పాటు ఎరువుల ధరను తగ్గించడం, ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించడం, ధరల స్థిరీకరణ గురించి ఆలోచిస్తే బాగుండేది. ఈ బడ్జెట్‌లో రెండు తెలుగు రాష్ట్రాల అవసరాలను ఏమాత్రం పట్టించుకోలేదు. లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షల మంది దాహార్తి తీర్చే లక్ష్యంతో చేపట్టిన కాళేశ్వరానికిగాని, డిసెంబర్ 2019 వరకు పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్న పోలవరం ప్రాజెక్టుల ప్రస్తావన లేకపోవడం దారుణం. మన రాష్ట్రంలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల గురించి గాని, ఒకస్మార్ట్ సిటీ ఊసెత్తకపోవడం విచారకరం. సెల్‌ఫోన్ ధర పెంచడం న్యాయం కాదు. డిజిటల్ విద్యను పెంచడం, మరికొన్ని ప్రతిపాదనలు చేసినా అవి అరచేతిలో స్వర్గం చూపించడమే. వేతన జీవుల విషయాని కొస్తే పూర్తిగా నిరాశా, నిస్పృహలే. పెరుగుతున్న ద్రవ్యోల్బణం దృష్ట్యా ఆరునెలల కొకసారి కరువుభత్యం పెంచే ప్రభుత్వాలు ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచకపోవడం ప్రభుత్వాలు ఒక చేత్తో ఇచ్చి ఇంకో చేత్తో లాక్కోవడమే. పోతే చెల్లించేది రాష్ట్ర ప్రభుత్వాలు, తీసుకునేది కేంద్ర ప్రభుత్వం. 40వేలు స్టాండర్డ్ డిడక్షన్ పేర పెంచడం ఏమూలకు? కనీసం గృహ రుణాల చెల్లింపు వాయిదాల పరిమితిని గాని, లేక దానిపై వడ్డీ పరిమితిని గాని పెంచినా బాగుండేది. మొత్తంగా ఈ బడ్జెట్ ఏ వర్గాన్ని సంతృప్తి పరచలేకపోయింది. ఆర్థిక మంత్రి లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగపాఠం చదువుతుండగానే షేర్ మార్కెట్ 400 పాయింట్లు కోల్పోయిందంటేనే తెలుస్తోంది పారిశ్రామికవర్గం కూడా సంతోషంగా లేరని. పెద్దనోట్ల రద్దు వలన నగదు కొరతతో ఇబ్బందులు పడుతున్న ముఖ్యంగా గ్రామీణులకు ఊరట, ఉపశమనం కల్పించే చర్యలేవీ తీసుకోలేదు.

సెల్: 9491466085

రైతుల ఆదాయం రెట్టింపు... నెరవేరని మోడీ సూక్తులు



సారంపల్లి మల్లారెడ్డి


రైతుల ఆదాయాన్ని 2022నాటికి రెట్టింపు చేయాలని ప్రధాని మోడీ ఒక పథకాన్ని ప్రకటించారు. దేశ ప్రజలలో 50శాతం రైతులున్నారు. ఆదాయం రెట్టింపు చేయాలంటే ఉత్పాదక పెంచడం - గిట్టుబాటు ధర - మంచి ఉపకరణాలు - ఇరిగేషన్ సౌకర్యం - విత్తన బదలాయింపు - తగినంత ఎరువు వాడకం-నూతన టెక్నాలజీ వినియోగం చేపట్టాలి. హార్టీకల్చర్-డైరీ, ఫౌల్ట్రీ, పందులు - చేపలు, చిన్న జంతువులు-అడవులు పెంచడం ద్వారా ఆదాయం సంపాదించాలి. మార్కెట్‌లో మధ్యదళారీలను తొలగించాలి. ఇవీ ప్రధాని సూక్తులు.

1997 నుండి మే, 2014 వరకు దేశంలో 3.60 లక్షలమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మోడీ పాలన ప్రారంభమైన మే, 2014 నుండి 2017 డిసెంబర్ నాటికి ఏటా 12,600మంది ఆత్మహత్యలకు పాల్పడినట్టు నేషనల్ క్రైం రిపోర్టు బ్యూరో తెలిపింది. పంటలకు కనీస పెట్టుబడి కూడా రాని స్థితిలో రుణగ్రస్తులై ప్రయివేటు వడ్డీ వ్యాపారుల ఒత్తిడికి గురై రైతులు నిరాశతో ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ రైతుల ఆత్మహత్యలు కానరావు. సరళీకృత విధానాలు ప్రారంభించిన 1997 నుండి ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిలోకి తెస్తానని, ఉత్పత్తి, ఉత్పాదకత రెట్టింపు చేస్తానని గత మూడేండ్లుగా మోడీ ప్రభుత్వం చెపుతూనేఉంది. తాను అధికారంలోకి రాగానే లెవీ బియ్యం, గోధుమల సేకరణ రద్దు చేశారు. మిల్లర్ల నుండి, రైతుల నుండి సేకరించి ఎఫ్‌సీఐకి పంపడం వల్ల నిలువ నష్టాలు, రవాణా నష్టాలు ఏటా రూ.30వేల కోట్లు అవుతున్నాయని, భారత ఆహార సంస్థ నిర్వహణ వ్యయం రూ.70వేలకోట్లు అవుతున్నట్టు మొత్తం లక్ష కోట్ల నిధులు ఎఫ్‌సీఐ నిర్వహణకే ఖర్చయినట్టు ప్రధాని నియమించిన శాంతాకుమార్ కమిటీ నివేదించింది. ఏటా 1.15 లక్షల కోట్లు ఆహార సబ్సిడీ రాష్ట్రానికి ఇస్తున్నాయి. పైగా నిలువ రవాణా నష్టాలు లక్ష కోట్లు కూడా భరిస్తున్నాయి. ఎఫ్‌సీఐ నిర్వహణ ఎత్తివేయడం వలన మిగులు లభ్యత గల లక్ష కోట్లను రాష్ట్రాలకే ఆహార సబ్సిడీ కింద నగదు బదిలీ చేయడం వల్ల కేంద్రానికి లక్ష కోట్లు మిగులుతాయి. ఎఫ్‌సీఐ సేకరణ వల్ల వ్యాపారులు విధిగా కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయాలి. సేకరణ ఎత్తివేయడంతో వ్యాపారులు కనీస మద్దతు ధర చెల్లించవలసిన అవసరం లేదు.

పంట వేసేటప్పుడే ధర నిర్ణయించి, ఆ ధర మార్కెట్‌లో రాక లోటు వస్తే, ఆ లోటు ప్రభుత్వం భర్తీ చేస్తుందని నూతన పథకంలో మోడీ చెప్పారు. కానీ, ఇంతవరకు నిర్ణయిస్తూ వచ్చిన మద్దతుధరను ఇక ముందు రాష్ట్రాలే నిర్ణయించుకోవాలని, వ్యవసాయ రంగం రాష్ట్ర జాబితాలో ఉన్నదని తోసివేస్తున్నారు. మార్కెట్ల సంస్కరణతో పాటు గిట్టుబాటు ధరలకు అనుకూలంగా వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణయం, ఉత్పాదకత పెంపు, తక్కువ భూమి, తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించడానికి వ్యవసాయశాఖను సంస్కరిస్తానని చెపుతున్నారు. 1956, 1960లో

" అరవై ఏండ్లు దాటిన రైతులకు నెలకు రూ.5,000 పెన్షన్ ఇవ్వాలి. దళిత, గిరిజనులకు నూతన టెక్నాలజీని, ఉపకరణాలను ఉచితంగా ఇచ్చి మార్కెట్ సౌకర్యం కల్పించాలి. ప్రతీ 2,500 ఎకరాలకు ఒక ఎఇవోను నియమించాలి. సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా మండం కేంద్రంలో వ్యవసాయ యంత్రాలను అద్దె-కొనుగోలు పద్ధతిలో ఒక సంస్థను ప్రభుత్వం నిర్వహించాలి. ప్రతీ మండల కేంద్రంలో ఒక వ్యవసాయ శిక్షణా కళాశాల ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. "

లాగ కౌలుదారులకు రక్షణ, భూ యజమానుల రక్షణ, రెవెన్యూ రికార్డుల్లో సాగుదారుల నమోదు చేస్తామన్న మోడీ, వ్యవసాయాన్ని రాష్ట్రాలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఏ రాష్ట్రం చూసినా తమ బడ్జెట్‌లో 2 లేదా 2.5శాతం



మాత్రమే వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్నారు. వ్యవసాయానికి వినియోగించే పారిశ్రామిక ఉపకరణాలు, విత్తనాల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. అలా పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయోత్పత్తుల ధరలు నిర్ణయించడం లేదు. ధరల నిర్ణాయక కేంద్ర కమిటీ పత్తి ఉత్పత్తి ధర క్వింటాల్‌కు రూ.4,376 నిర్ణయించి, అమ్మకపు ధర రూ.6,500గా సూచించింది. కానీ, కనీస మద్దతు ధర రూ.4,320 మాత్రమే నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం అమ్మకపు ధరను రూ.7,750గా ఉండాలని సిఫారసు చేసింది. ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,100 ఖర్చు పెట్టుబడి అవుతుందనీ, అమ్మకపు ధర రూ.3,150గా నిర్ణయించాలని రికమండేషన్ చేయగా, కేంద్ర ప్రభుత్వం రూ.1590 మాత్రమే నిర్ణయించింది. రైతులు 130 రకాల పంటలు (హార్టీకల్చర్, కూరగాయలు సహా) పండిస్తుండగా కేంద్ర ప్రభుత్వం 1982 నుండి 23 పంటలకు మాత్రమే "కనీస మద్దతు ధర" నిర్ణయిస్తున్నది. మిగిలిన పంటల ధరలను వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తున్నారు. పైగా దేశంలో ఉత్పత్తి పెరిగినప్పటికీ, "స్వేచ్ఛా మార్కెట్" పేరుతో 20 దేశాల నుండి వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతులు చేస్తున్నారు. ఆ దిగుమతులపై సుంకాలు ఎత్తివేశారు. ఈ దేశానికి ఎగుమతి చేస్తున్న వ్యాపారులకు ఆ దేశాలు ఎగుమతి సబ్సిడీ వేల కోట్లలో ఇస్తున్నాయి. మన ఉత్పత్తి వ్యయం కన్నా తక్కువ ధరకు దిగుమతి సరుకులు అమ్ముతున్నారు. ఫలితంగా, దేశీయ ఉత్పత్తి పూర్తిగా దెబ్బతిన్నది.


నేడు పంచదార, వంటనూనెలు, పత్తి, పప్పులు పెద్దఎత్తున దిగుమతి చేసుకుంటున్నాం. ఎగుమతి, దిగుమతుల లోటు పరిశీలించినప్పుడు భారత దేశం 2.5 లక్షల కోట్ల లోటు వ్యాపారంలో ఉన్నది. ఆ విధంగా దేశీయ ఉత్పత్తులపై ఈ ధరల ప్రభావంతో మన ఉత్పత్తి విస్తీర్ణం తగ్గింది. సాగుభూమి 43 కోట్ల ఎకరాలుండగా, 8 కోట్ల ఎకరాలు బీళ్ళుగా మారాయి. కేంద్ర ప్రభుత్వం కూడా దిగుమతులపైనే పూర్తిగా ఆధారపడుతున్నది. క్రమంగా రైతులు ఏటా వ్యవసాయ రంగం నుండి ఇతర రంగాలకు తరలిపోతున్నారు. ఈ స్థితిలో కేంద్ర ప్రభుత్వం 1. కాంట్రాక్టు వ్యవసాయ బిల్లు, 2. ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ బిల్లు తెచ్చింది. ఈ రెండు చట్టాలతో కార్పొరేట్ సంస్థలు వేల ఎకరాల భూములు సాగు చేయడానికి అవకాశం కల్పించింది. ఒకవైపున కార్పొరేట్ సంస్థలకు వ్యవసాయాన్ని అప్పగిస్తూ, మరోవైపున రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనడం పరస్పరం విరుద్ధంగా వున్నది. విదేశాలలో అన్ని ప్రభుత్వాలు వ్యవసాయానికి పెద్దఎత్తున పెట్టుబడి రాయితీలు ఇస్తున్నారు. అమెరికాలో 8 రకాల రాయితీలు నగదుగా యిస్తున్నారు. టర్కీ, పాకిస్థాన్, బంగ్లాదేశ్, జపాన్ దేశాల వ్యవసాయాలను పరిశీలిస్తే 6-8 శాతం రాయితీలు ఇస్తున్నారు. ఎగుమతి సబ్సిడీలు ఇస్తున్నారు. ఈ మధ్య వాణిజ్యశాఖామంత్రి నిర్మలాసీతారామన్ పత్తికి ఎగుమతి సబ్సిడీలు యివ్వకూడదని డబ్ల్యూటీఓ సంస్థలో సంతకం చేశారు. చివరికి వ్యవసాయ అనుబంధంగా వున్న హార్టీకల్చర్, డైరీ, పౌల్ట్రీ, పందులు, గొర్రెపిల్లలు, చేపలు, అడవులు, సుగంధ ద్రవ్యాలు పెంచిన రైతులకు కూడా గిట్టుబాటు ధర లభించలేదు. ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి నిలువ సౌకర్యం వుంది. పండిన పంటలకు 25-30 శాతం పంట నష్టపోతున్నట్టు గణాంకాలే చెపుతున్నాయి. ఇన్ని లోప భూయిష్టమైన విధానాలు అనుసరిస్తున్న కేంద్రం, రాష్ట్రాలు తమ విధానాలను మార్చుకుంటాయా? వామపక్ష పాలక రాష్ట్రాలు మినహా, మిగిలిన రాష్ట్రాలు కార్పొరేట్ల చుట్టూ తిరుగుతున్నాయి. రైతుల ఆదాయం రెట్టింపు కావాలంటే ఈ దిగువ చర్యలు చేపట్టాలి. వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయాలి. వారికి ఉపకరణాలు, సాగునీరు ఉచితంగా, వడ్డీలేని రుణాలు సకాలంలో, తగిన మొత్తంలో ఇవ్వాలి. బహుళజాతి సంస్థలు వ్యవసాయ రంగంలో ఎలాంటి జోక్యం ఉండరాదు. మధ్యదళారీలను పూర్తిగా తొలగించాలి. వాతావరణానికి అనుకూలంగా కొత్త విత్తనాలను ఆవిష్కరించి రైతులకు ఉచితంగా సరఫరా చేయాలి. ప్రస్తుతం హెక్టారుకు 8టన్నులు అమెరికా, చైనాలో పండుతుండగా భారత్‌లో 2.5టన్నులు మాత్రమే ఆహార ధాన్యాల దిగుబడి వస్తున్నది. అన్ని పంటలకు ఉత్పాదకత పెంచాలి. ఉత్పత్తి ఖర్చులు తగ్గించాలి. పంటల బీమా ప్రీమియం, అధికోత్పత్తి వంగడాలు, ప్రకృతి వైపరీత్యాల పరిహారం రైతులకు సకాలంలో ఇవ్వాలి. పంట వేసేటప్పుడే ధర నిర్ణయించి మార్కెట్లో తక్కువకు అమ్మినప్పుడు ఆ నష్టాన్ని ప్రభుత్వం భరించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన నష్టానికి పూర్తి పరిహారం ప్రభుత్వం చెల్లించాలి. బావులు, లిఫ్టు పథకాలను రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి శాఖ నిర్వహించాలి. తగినన్ని నిల్వ గోదాములను నిర్మించాలి.

అరవై ఏండ్లు దాటిన రైతులకు నెలకు రూ.5,000 పెన్షన్ ఇవ్వాలి. దళిత, గిరిజనులకు నూతన టెక్నాలజీని, ఉపకరణాలను ఉచితంగా ఇచ్చి మార్కెట్ సౌకర్యం కల్పించాలి. ప్రతీ 2,500 ఎకరాలకు ఒక ఎఇవోను నియమించాలి. సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా మండం కేంద్రంలో వ్యవసాయ యంత్రాలను అద్దె-కొనుగోలు పద్ధతిలో ఒక సంస్థను ప్రభుత్వం నిర్వహించాలి. ప్రతీ మండల కేంద్రంలో ఒక వ్యవసాయ శిక్షణా కళాశాల ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

సెల్: 9490098666

https://play.google.com/store/apps/details?id=com.newseveryday&hl=en

మానవి
నవతెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 2-2-2018
5
manavi@navatelangana.com



మనకూ ఉందో మార్గం

ఒకవైపు ఆదాయం పెరగకపోవడం, మరొకవైపు ఖర్చులు పెరగటం వలన ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ దృష్ట్యా ఎక్కువ ఆదాయం పొందటమెలా? అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మదిని కలచివేస్తోంది. ఒంటరిగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్న మహిళల పరిస్థితి మరీ దారుణం. చాలా సందర్భాలలో ఎంత కష్టపడి పనిచేశాశం అనే దాని కంటే చేసే పనిని ఎంత సమర్థవంతంగా చేశాం అనేదానిపై డబ్బు సంపాదన ఆధారపడుతోంది. శక్తిసామర్థ్యాలను సరైన దిశలో ఉపయోగించి ఒక అంచనాతో పనిని పూర్తిచేస్తే అద్భుతమైన ఫలితాలు పొందొచ్చు. అప్పుడు వచ్చే ఆర్థిక సమస్యల నుంచి బయటపడేందుకు మనకూ ఓ మార్గం తప్పక దొరుకుతుంది. అదెలాగో తెలుసుకుందాం...

మొమోస్ అమ్మకం

మన దగ్గర ఫాస్ట్ ఫుడ్స్‌పై మక్కువ ఎక్కువ. దీనికోసం చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమయ్యే పెట్టుబడి కూడా తక్కువ. ఫాస్ట్ ఫుడ్ స్టాల్స్ ద్వారా రోజుకి రూ. 1,000 సులభంగా సంపాదించుకోవచ్చు. అటువంటి ఫాస్ట్ ఫుడ్ డిష్‌లలో మొమోస్‌ది ప్రత్యేకమైన స్థానం. గత కొన్నేండ్లుగా ఈ వంటకం అనేకమంది ప్రజల ఆదరాభిమానాలను పొందుతూనే ఉంది. సౌత్ ఆసియన్ డంప్లింగ్ రకానికి చెందిన ఈ వంటకాన్ని తిన్నా పొట్టలో తేలికగానే ఉంటుంది. అయితే, పెరుగుతున్న పోటీని దృష్టిలో పెట్టుకుని మొమోస్లను అత్యంత నాణ్యతతో తయారుచేస్తే విజయం మీదే. మంచి నాణ్యతను, పరిశుభ్రతను పాటిస్తూ ఈ వంటకాన్ని కస్టమర్లకు నచ్చే విధంగా అందచేస్తే రోజువారీ ఖర్చులతో పాటు లేబర్ కాస్ట్ కూడా సులభంగా అధిగమిస్తారు.

లీగల్ ఫార్మాలిటీస్

మీరు ఎక్కడైతే షాప్‌ని తెరవాలని అనుకుంటున్నారో ఆ ప్రాంతానికి చెందిన మున్సిపల్ లేదా పంచాయతీ ఆఫీస్ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రాతపూర్వకంగా అప్లికేషన్‌ను రాసి అందులో మీ అవుట్లెట్ పేరుని అలాగే బిజినెస్ పేరుని పేర్కొనాలి. కుదిరితేలే అవుట్ ప్లాన్‌ను కూడా జోడించాలి. అలాగే, ల్యాండ్ ఓనర్ దగ్గర నుంచి నో అబ్జెక్షన్ లెటర్‌ను కూడా జతచేయాలి.

కంటెంట్ రైటింగ్ అండ్ ఎడిటింగ్

ఈ మధ్యకాలంలో కంటెంట్ రైటింగ్‌తో పాటు ఎడిటింగ్ జాబ్స్‌కి విశేష ఆధరణ లభిస్తోంది. ఆయా వెబ్సైట్ల రిక్వయిర్మెంట్‌లకు తగినట్టుగా కంటెంట్‌లను అందించడానికి ప్రత్యేక ప్రావీణ్యం



అవసరమవుతుంది. అలాగే, మీరు అందించే కంటెంట్ ఉపయోగపడే విధంగా ఉండాలి. కంటెంట్ యూనిక్‌గా కూడా ఉండాలి. కంటెంట్‌ని చదవడం ప్రారంభించగానే పూర్తిగా చదవాలనిపించేలా యూజర్ ఫ్రెండ్లీ అప్రోచ్ కలిగి ఉండాలి. ఇటువంటి స్కిల్స్ మీకున్నట్టయితే ఈ విధమైన జాబ్‌కి మీరు అర్హులైనట్లే. ఇటువంటి జాబ్‌కి ప్రస్తుత సినారియోని అర్థం చేసుకుని ఇంటర్నెట్‌తో పాటు సోషల్ మీడియా ట్రెండ్స్‌ని విశ్లేషించగల సామర్థ్యం ముఖ్యం. ఒక టాపిక్‌ను సరైన విధంగా రాసి ఆ తరువాత ఎడిటింగ్‌లో అవసరమైన సవరణలు చేసి అత్యుత్తమమైన కంటెంట్ ను క్లయింట్లకు అందించాలి. ఆ విధంగా చేస్తే మీరు రీడర్‌కు నాణ్యతతో కూడిన ఉపయోగకరమైన ఇన్ఫర్మేటివ్ ఆర్టికల్స్‌ను అందించగలరు. ఫ్రెషర్లకు ఆర్టికల్‌కి రూ. 200 వరకు ఇస్తారు. అనుభవజ్ఞులకి రూ. 10,000 వరకు కూడా ఇస్తారు. ఇలా నిబద్దతతో పనిచేస్తే మీదైన రీతిలో మీరు ముందుంటారు.

ప్రొడక్ట్ రివ్యూస్

ఈ మధ్య కాలంలో రివ్యూస్‌పై ప్రజలు అనేక విధాలుగా ఆధారపడుతున్నారు. ఏదైనా సినిమా చూడాలన్నా, ప్రోడెక్ట కొన్నాలన్నా రివ్యూ చదువుతున్నారు. కాబట్టి రివ్యూలకి మార్కెట్‌ని శాసించే సామర్థ్యం ఉందనడంలో అతిశయోక్తి లేదు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కొన్ని సైట్లతో పాటు కంపెనీలు తమ ప్రొడక్ట్ పై నిష్పాక్షికమైన రివ్యూని అందచేయమని ప్రజలను ప్రోత్సహిస్తున్నాయి. అందుకు తగిన పారితోషికాన్ని అందిస్తున్నాయి. ఆ విధంగా ప్రకటనలతో పాటు కొన్ని మిగతా అంశాల వల్ల తమ ప్రాడక్ట్‌ల అమ్మకం దెబ్బతినకుండా జాగ్రత్తపడుతున్నాయి. వారి సోషల్ మీడియా, బ్లాగ్స్, యూట్యూబ్‌లో రివ్యూస్‌ని పోస్ట్ చేయవచ్చు. అమెజాన్, టైడ్ అలాగే లోరియల్ వంటి కొన్ని కంపెనీలు తమ ప్రోడక్ట్స్‌ని రివ్యూల కోసం ఉచితంగా ఇస్తాయి. అలాగే, తమ ప్రోడక్ట్స్ ని పరీక్షించినందుకు ప్రోడక్ట్ పై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు కూడా పే చేస్తాయి.

ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో నిలకడగా ఉండాలంటే, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మరిన్ని విషయాలపై సరైన అవగాహన ఉండాలి. సృజనాత్మకంగా ఒక అడుగు ముందుండే వారిని ప్రోత్సహించడానికి ఈ ప్రపంచం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. మీలోని ఆలోచనలకు చేయూతనిచ్చి ప్రపంచానికి తెలియచేయండి. అప్పుడు, మనకి సాధారణంగా కనిపించే కొన్ని విషయాలే ఆదాయాన్ని పెంపొందించే అంశాలుగా కనిపిస్తాయి. *

ఇంకెంత కాలం ఈ కథలు!?

'పద్మావత్/పద్మావతి' ఈ మధ్య కాలంలో దేశంలో అత్యంత చర్చనీయాంశమైన సినిమా. వివాదాలు, విమర్శలు, ఆమోదాలు, అభ్యంతరాలు, వాయిదాలు, బెదిరింపులు... ఏ సినిమాకు జరగనంత ప్రచారమూ జరిగింది. ఈ నేపథ్యంలో ఈ కథ నిజమేనా లేక కల్పనా అన్న వాదన ఇంకా ఉంది. ఇవన్నీ పక్కన పెడితే... సినిమా వినోదం కోసమే అయినా దానికి కాస్త సామాజిక ప్రయోజనం ఉండాలి. మరి ఈ సినిమా ఆ సామాజిక ప్రయోజనాన్ని నెరవేర్చిందా? నిజంగానే రాణి పద్మావతి కథనో కాదో అన్న విషయాన్ని పక్కన పెడితే మహిళల పాత్రలను చిత్రించే విషయంలో ఈ సినిమా ఏమాత్రం న్యాయం చేయగలిగింది? ఇవి మాత్రమే ఇక్కడ చర్చించాలనుకున్న విషయాలు.


రాణీ పద్మావతి చరిత్రకు సంబంధించి చాలా రకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. రాణీ పద్మావతి 13వ శతాబ్దానికి చెందినదిగా చెబుతుండగా, ఆమె తరువాత 250 సంవత్సరాలకు గానీ ఆమె కథ జనాలకు తెలియలేదు. అయితే ఒక సూఫీ కథ ఆధారంగా సినిమా తెరకెక్కుతోందని గతంలోనే దర్శకుడు భన్సాలీనే ప్రకటించాడు. అయినా సినిమాకు ముందు ఎన్నో వివాదాలు...'రాజపుత్రులను కించపరుస్తున్నారంటూ.. రాణి పద్మావతి చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ' నిజానికి సినిమాలో ఎక్కడా రాజపుత్రులను తక్కువ చేసినట్లుగా లేదు. 'ఆందోళనలను ఖడ్గం కొనపై ఉంచేవాడు రాజపుత్రుడు', 'ఇసుక నావను తీసుకోని సముద్రాన్ని సవాలు చేసేవాడే రాజపుత్రుడు', 'తల తెగిపడినా మొండెంతో శత్రువుతో యుద్ధం చేస్తుండే వాడు రాజపుత్రుడు', 'రాజపుత్రుల ఖడ్గానికి ఉన్న శక్తి రాజపుత్రుల గాజులలోనూ ఉంటుంది' వంటి డైలాగులతో వారి కీర్తిని మరింత ఇనుమడింపజేసే ప్రయత్నమే చేశాడు దర్శకుడు భన్సాలీ.

కథ..

ఇక కథ విషయానికి వస్తే సింహళ రాజు కుమార్తె పద్మావతి. అందగత్తె. యుద్ధ విద్యల్లోనూ ఆరితేరిన మహిళ. ధీరవనిత అయిన ఆమె వేటలో ఉండగానే బాణం కాస్తా మేవాడ్ రాజపుత్ర రాజు మహారావల్ రతన్‌సింగ్‌కు తగులుతుంది. ఆ తరువాత నిజంగానే అతని గుండెకు గాయం చేసి రాజు మనసులో స్థానం సంపాదించుకుంటుంది. అది పెండ్లికి దారి తీస్తుంది. అప్పటికే వివాహం చేసుకుని ఉన్న మహారాజు, పద్మావతిని రెండో భార్యగా తీసుకు వెళ్తాడు. అప్పటిదాకా అన్ని విద్యల్లో ఆరితేరిన యువరాణి కాస్తా... మేవాడ్‌లో చిన్నరాణిగా మారిపోతుంది. అమ్మగారింట్లో(తన రాజ్యంలో యువరాణిగా) దేనికీ వెరవని ఆమె ధైర్యం కాస్తా... మేవాడ్‌లో అంత:పురానికి, రాజును ఆనంద పరిచే ఆటపాటలకే పరిమితమవుతుంది. ఆమె అందం గురించి విన్న అల్లావుద్దీన్ ఖిల్జీ... ఆమెను దక్కించుకోవడానికి రకరకాల ఎత్తులు వేస్తాడు. మేవాడ్ రాజును ఎత్తుకుపోతాడు. చివరకు యుద్ధం అనివార్యమవుతుంది. ఆ యుద్ధంలో మేవాడ్ రాజు చనిపోతాడు. రాజు చనిపోయిన తరువాత అల్లావుద్దీన్ ఖిల్జీ చేతికి చిక్కడం ఇష్టం లేక రాణి పద్మావతి ఆత్మాహుతి చేసుకుంటుంది.

స్వరభాస్కర్ విమర్శలు...

21వ శతాబ్దంలో కూడా ఇలాంటి సినిమా తీసి ఎవరికి సందేశం ఇవ్వాలని అనుకుంటున్నాంటూ నటి, గాయని స్వర భాస్కర్ ప్రశ్నించింది. 'అత్యాచారానికి గురైన మహిళలకు ఈ సమాజంలో జీవించే హక్కు ఉంది. భర్త చనిపోయిన మహిళలకూ బతికే హక్కు ఉంది. మహిళ జీవితం పూర్తిగా శీలంపైనే ఆధారపడి ఉండదు. దాన్ని రక్షించుకుని, స్వేచ్ఛగాఉండటమే వాళ్ల జీవిత లక్ష్యం కాదు. ఇవన్నీ 13వ శతాబ్దంలో మాటలు. కానీ మనం ఇప్పుడు 21వ శతాబ్దంలో ఉన్నాం. ఈ సినిమా ద్వారా మీరు ఎటువంటి సందేశం ఇవ్వాలనుకున్నారు?' అంటూ వైర్‌లో ఒక బహిరంగ లేఖ రాసింది. దానికి సినిమా టీమ్ సమాధానం ఇచ్చింది. 'మేం సతీసహగమనాన్ని కీర్తించడం లేదు ఆ కాలంలో ఉన్న ఆచారాలను ఉన్నవి ఉన్నట్టుగా మాత్రమే చూపాం. భర్త చనిపోయిన తరువాత మహారాణి మరో వ్యక్తికి బలి కాలేక... ఆ కాలంనాటి బలమైన నిరసన ఆత్మాహుతిని ఎంచుకుంది. అందులో ఎక్కడా ఆమెకు తాను తప్పు చేసిన భావన కనిపించదు. చనిపోయిన తన భర్త దగ్గరకు వెళ్తున్నా నన్న ఆనందం ఆమెలో ఉంటుంది' అని వివరణ ఇచ్చింది.



అందం-హింస-మరణం...

ఆమె ఆనందంగానే ఆహుతి కావచ్చు... కానీ సినిమాల్లో మహిళల పాత్ర చిత్రణపై తప్పక చర్చ జరగాలి. కానీ కర్ణిసేన చెప్పిన 'రాణి పద్మిని చరిత్రను వక్రీకరిస్తున్నారు' అన్న ప్రాతిపదికన కాదు. మహిళలను ఇంకెంతకాలం సినిమాల్లో కేవలం అందమైన ఆటబొమ్మల్లాగే చూస్తారనే విషయంపై చర్చ జరగాలి. సినిమాల్లో ఆమెకు అస్తిత్వమే ఉండదు. ఆమె జీవితం పూర్తిగా తన భర్త చుట్టూ, ఆమె లేక అతని కుల గౌరవం చుట్టూతానే తిరుగుతూ ఉంటుంది. సినిమా అడుగడుగునా మూఢత్వమే. యుద్ధానికి కారణమే నీవని మొదటి రాణితో రెండోరాణిని చెప్పిస్తాడు డైరెక్టర్. యుద్ధంలో గెలిచి రాణి పద్మావతిని బహుమానంగా తీసుకోవాలనుకుంటాడో మరో రాజు. ఆ యుద్ధానికి మూల్యం చెల్లించాల్సింది తానే అని.. చివరకు అగ్నిపాలవుతుంది మహారాణి. సిల్వర్ స్క్రీన్ మీద సినిమా కథలను దృశ్యకావ్యంలా రూపొందించడంలో దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దిట్ట అనడం ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఎందుకంటే ఆయన మొదటి సినిమా నుంచి బ్లాక్, రామ్‌లీలా, బాజీరావుమస్తానీ చిత్రాలు అందుకు సాక్ష్యాలు. అయితే ఈ సినిమాలన్నింటిలో అన్ని చోట్లా ఓ మ్యాజిక్ ఉంటుంది. విజువల్స్‌ను అత్యద్భుతంగా చిత్రీకరించడంలోనూ, స్క్రీన్‌ను రంగుల మయం చేసి... ప్రేక్షకులను కనుతిప్పుకోనీయకుండా చేయడంలో భన్సాలీని మించినవాళ్లు లేరు. అయితే అందం-హింస-మరణం ఈ పరిధిని ఆయన చాలా సినిమాల్లో దాటలేదు. ఈ పద్మావత్‌లోనూ అంతే... విజువల్స్‌ను అందంగా చూపించాడు. రాణిపద్మావతిని అత్యద్భుతంగా చిత్రించాడు. కాస్ట్యూమ్స్, సెట్స్ వరకు ప్రతి సీన్ అందంగా మలిచాడు. కానీ హింసను, మరణాన్ని వదలలేదు. మహిళను కేవలం మగవారికి అవసరమయ్యే వస్తువుగానే చిత్రించాడు.

ఈ తరానికి అవసరమైనదేనా?

సినిమా చివరి పదిపదిహేను నిమిషాల పూర్తిగా రాణి పద్మావతితోపాటు వందలాది మంది రాజపుత్ర మహిళలు సామూహికంగా ఆత్మాహుతి చేసుకోవడానికి వెళ్తుంటారు. ఎరుపు రంగు చీరలు, ఒంటి నిండా మెరిసిపోయే నగలు ధరించిన మహిళలు మంటల వైపు నడుస్తుండటం.. వారిలో రకరకాల మహిళలు ఉండటం, వారి వెనుక ఆకలిగొన్న కామపు చూపులతో అలావుద్దీన్ ఖిల్జీ వెంటాడటం. కుల గౌరవం కోసం, భర్త పరువు-ప్రతిష్టల కోసం నిప్పుల గుండంలోకి నడుస్తున్న రాణి పద్మావతి సీన్ చూడటం... నిజంగా మనచుట్టూ మంటలు రేగుతున్నట్టుగా ఉంటుంది. కేవలం చూపించడమే కాదు... రాజపుత్ర మహిళలు అగ్నికి ఆహుతి అవ్వడం ఎంత గౌరవమో ఆమెతో ప్రసంగం ఇప్పిస్తాడు. థియేటర్‌లో ఉన్న ప్రతి వ్యక్తిని ఆ మంటల్లోకి వెళ్లేలా నిజంగా... ఆ సమయంలో అది తప్ప వేరేమార్గం లేదని ప్రేరేపించేవిధంగా చిత్రీకరించాడు. అది మాత్రమే కాదు... రాణి పద్మావతి చనిపోవడానికి కూడా భర్త దగ్గర అనుమతి తీసుకుంటుంది. 'మీరు యుద్ధంలో మరణిస్తే... నేను అగ్నికి ఆహుతి అవుతాను' అని అడుగుతుంది. సినిమా మొత్తంగా అప్పటిదాకా యుద్ధవిద్యల్లో ఆరితేరిన యువరాణి, అంతపురానికి పరిమితమైపోవడం నుంచి, చివరకు మంటల్లో కలిసిపోవడం వరకు.. అదో మూఢనమ్మకం అనిగానీ, సంప్రదాయాల పేరిట మహిళలను బలి చేయడం అనిగానీ, మహిళలను చేతగాని వ్యక్తిగా చూపడం అనిగానీ ఎక్కడా అనిపించలేదు దర్శకుడికి. పైగా ఆమె ఆత్మత్యాగాన్ని కీర్తించారు కూడా. నిజంగా ఇప్పుడు సమాజానికి ఈ చిత్రం అవసరమేనా?

ఆధారపడే వ్యక్తిగానే...

టాలీవుడ్ అయినా, బాలీవుడ్ అయినా పెద్దగా మార్పేమీ లేదు. ఇక్కడ అవంతిక దేవసేనలైనా... అక్కడ రాణి పద్మావతి అయినా పేర్లు మారాయి. పాత్రల చిత్రణ మాత్రం సేమ్. నిజానికి బాహుబలిలో యుద్ధవిద్యల్లో ఆరితేరి, మాహిష్మతి సామ్రాజ్య వారసుడు అయినా అమరేంద్ర బాహుబలితో కలిసి యుద్ధం చేసిన దేవసేన... పెండ్లి కాగానే అతని మీద ఆధారపడుతుంది. అతడు చనిపోగానే కొడుకు మీద ఆధారపడుతుంది. తన మీద కన్నేసిన వ్యక్తితో కొడుకు పోరాడుతుంటే ఆ యుద్ధంలో కొడుకు గెలవడం కోసం పూజ చేస్తుంది. అగ్నిని మోస్తుంది. నిజానికి యుద్ధం చేయాల్సిన చేతులు.. కేవలం అది విజయవంతం కావాలని మొక్కుకోవడానికి, బొట్లు పెట్టడానికే పరిమితమవుతాయి. పురాణగాథలనుంచి కూడా కథానాయకుడిని దెబ్బతీయడానికి... అతడి చెల్లినో, కథానాయకినో అవమానపరచడం. కేవలం ఆడవాళ్ల శీలాల్లోనే కుటుంబ గౌరవాన్ని పెట్టి కాపాడటం అనేది అనాదిగా వస్తున్నది. ఇప్పటికీ సినిమాలు మోస్తున్నది అదే.

ప్రేమించిన మగవారికోసం ప్రాణాలను సైతం లెక్క చేయకూడదు. నిజమే కానీ అది బతికించుకోవడం కోసం కదా! అప్పటికే చనిపోయిన మహారాజుకోసం ఆమె మంటల్లో కాలిపోవడం ఎందుకు? ఆమెకు జీవితం లేదా? వేరే మగవాడి చూపు సోకితే చనిపోవాలని త్రేతాయుగం నాటి సీత, ద్రౌపది పాత్రల నుంచి... ఇప్పటికీ చెబుతూనే ఉన్నారు. ఇంకా ఎంతకాలం ఈ కథలనే చెబుతారు?

కట్ట కవిత

నాల్గుసార్లు ఎంపీగా..

మహిళల్లో రాజకీయ పరిజ్ఞానం అంతగా లేని కాలంలోనే ఆమె వరుసగా నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికై రికార్డు సృష్టించారు. సింగరేణి కాలరీస్‌లో కుటుంబ నియంత్రణ కార్యకర్తగా పదేండ్ల పాటు పనిచేసి.. ప్రజాసంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆమే భద్రాచలం నియోజక వర్గం నుంచి నాలుగు సార్లు లోక్‌సభకు ఎన్నికైన పార్లమెంటు సభ్యురాలు బి. రాధాబాయి ఆనందరావు.

ఖమ్మం జిల్లా వెంకటాపురం గ్రామంలో జన్మించారు రాధాబాయి. రాజమండ్రి ట్యుటోరియల్ కళాశాలలోనూ, ఉపాధ్యాయుల శిక్షణా పాఠశాలలోనూ విద్యాభ్యాసం పూర్తి చేశారు. 1952 సంవత్సరం బి.కె.ఆనందరావును వివాహం చేసుకున్నారు. సామాజిక కార్యకలాపాల్లో భర్తతో కలిసి చురుగ్గా పాల్గొనేవారు. సింగరేణి కాలరీస్, గిరిజన ప్రాంతాల్లో కుటుంబ ప్రణాళిక పథకాలు ప్రచారం చేయడంలో కీలకపాత్ర పోషించారు. గిరిజన ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. మహిళాసంక్షేమం, కుటుంబ సంక్షేమంపై ప్రత్యేకశ్రద్ధ చూపిస్తూ.. ఇంటింటికి తిరిగేవారు. కొత్తగూడెం లేడీస్ క్లబ్ సభ్యురాలిగా ఉన్నారు.

రాధాబాయి 4, 5, 6, 7వ లోక్‌సభ లకు వరుసగా నాలుగుసార్లు భద్రాచలం నియోజకవర్గం నుండి భారత జాతీయ కాంగ్రెసు సభ్యురాలిగా ఎన్నికై 1967 నుండి 1984 వరకు లోక్‌సభలో భద్రాచలానికి ప్రాతినిధ్యం వహించారు. పార్లమెంట్ సభ్యురాలిగా జెకోస్లోవేకియా, వెస్ట్ జర్మనీ తదితర దేశాల్లో పర్యటించారు. ఎన్నో కమిటీల్లో ఆమె చురుకైన పాత్రపోషించారు. 1977లో జరిగిన ఎన్నికల్లో భారతీయ లోక్ దళ్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన తన సోదరి పి.వాణీ రమణారావుపై విజయం సాధించిన ఆమె 1984 ఎన్నికల్లో సి.పి.ఐ అభ్యర్థి సోడే రామయ్య చేతిలో ఓడిపోయారు. *



బి. రాధాబాయి ఆనందరావు (2 ఫిబ్రవరి 1930)

Women of the day

మసాజ్‌తో మృదువుగా...

ఫేషియల్ మసాజ్.. చర్మ సౌందర్యాన్ని పెంపొందించుకునేందుకు ఇదొక చక్కని మార్గం. ఈ పురాతన పద్ధతి ఇప్పటికీ ప్రాచుర్యంలోనే ఉంది. మసాజ్ మీ చర్మానికి ప్రశాంతతను అందించడంతో పాటు చర్మ సౌందర్యాన్ని పెంపొందిస్తుంది.

- చర్మానికి రక్తప్రసరణని మెరుగుపరచడం ద్వారా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. సరైన రక్తప్రసరణ వలన చర్మకణాలకి తగినంత పోషణ లభించి అవి ఉత్తేజంగా మారతాయి. తద్వారా, యవ్వనం ఉట్టిపడే చర్మం మీ సొంతమవుతుంది.
- ఫేషియల్ మసాజ్ చేయడం వల్ల ముడతలు, ఫైన్ లైన్స్ వంటివి కనిపించవు. ఫైన్ లైన్స్‌ని తగ్గించి ముడతలని అరికడుతుంది. కళ్లచుట్టూ అలాగే నోటి చుట్టూ చర్మంపై ముడతలు, ఫైన్ లైన్స్ కనిపించవు.



- చర్మంలోని కొలాజెన్ శాతం తగ్గిపోతే చర్మం అనేక సమస్యలతో సతమతమవుతుంది. అయితే, క్రమపద్ధతిలో ఫేషియల్ మసాజ్ ను అందించడం వలన కొలాజెన్ నష్టాన్ని నివారించవచ్చు. తద్వారా, చర్మ సమస్యలకు చెక్ పెట్టవచ్చు.
- చర్మంలోని ఎలాస్టిసిటీని ఫేషియల్ మసాజ్ మెరుగుపరుస్తుంది. ఈ సహజసిద్ధమైన పద్దతి వలన చర్మంలోని ఎలాస్టిసిటీ పుంజుకుంటుంది. తద్వారా, చర్మం బిగుతుగా అలాగే యవ్వనంగా కనిపిస్తుంది.
- కళ్లకింద బ్యాగ్స్‌తో పాటు నల్లటి వలయాలు చర్మంలోని వాటర్ రిటెన్షన్ వలన ఏర్పడతాయి. వాటర్ రిటెన్షన్‌ని అరికట్టే అద్భుతమైన ప్రక్రియ మసాజ్. సరైన ఫేషియల్ మసాజ్ ద్వారా కంటి కింద ఫ్లూయిడ్ రిటెన్షన్‌ని అరికట్టి కళ్లకింద బ్యాగ్స్‌ని, నల్లటి వలయాలను తగ్గించుకోవచ్చు.
- ప్రతిరోజూ చర్మరంధ్రాలలో ఎంతో కొంత టాక్సిన్స్ పేరుకుపోతాయి. చర్మం కాలుష్యానికి గురికావటంతో ఇలా జరుగుతుంది. దీంతో మొటిమల సమస్య వేధిస్తుంది. అందువలన, చర్మాన్ని తరచూ డిటాక్సిఫై చేసుకోవడం ఎంతో ముఖ్యం. చర్మాన్ని మసాజ్ చేయడం ద్వారా చర్మాన్ని శుభ్రపరచుకోవచ్చు. చర్మరంధ్రాలలో పేరుకుపోయిన దుమ్మూ ధూళిని, టాక్సిన్స్ ని తొలగించుకుని మొటిమల సమస్యను నివారించవచ్చు.
- ఫేసియల్ మసాజ్ వలన చర్మంలోని కాంతి ఉట్టిపడుతుంది. అందువలన చర్మం నిస్తేజంగా మారినప్పుడు ఈ టెక్నిక్ చర్మాన్ని లోపల నుంచి ఉత్తేజపరిచి కాంతివంతం చేస్తుంది. *

'క్రీడలకు రూ.700కోట్లు కేటాయించండి'

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.700కోట్లు కేటాయించాలని సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సచివాలయంలో గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని కలిసి వినతిపత్రం అందించారు. స్పోర్ట్స్ అకాడమీలు, హాస్టల్స్, ప్రత్యేకశిక్షణ శిబిరాల ఏర్పాటుకు బడ్జెట్‌ను పెంచాలని ఆయన కోరారు.

12 మందికి తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు భాషా సాహిత్యాలు, సంస్కృతి, కళా ప్రక్రియల్లో విశిష్ట సేవలందించిన 12 మంది ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతనగల ఎంపిక సంఘం వివిధ రంగాల్లో చేసిన సేవలను పరిశీలించి వారి ప్రతిభను పరిగణనలోకి తీసుకొని పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈ మేరకు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అలేఖ్య పుంజాల గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కె శ్రీనివాసరెడ్డి (పత్రికారంగం), వసంతరావు దేశ్‌పాండే (కథ/నవల), వేణు సంకోజు (కవిత్వం), నియోగి (విమర్శ), మాసురామ్ రవికాంత్ (చిత్రకళ), శివరామాచారి (శిల్పకళ), వనజా ఉదయ్ (నృత్యం), కెఎస్ఆర్ బాలకృష్ణశాస్త్రి (సంగీతం), అయ్యదేవర పురుషోత్తమరావు (నాటకరంగం), అంగళకుర్తి రామమూర్తి (జానపద కళారంగం), జిఎం రామశర్మ (అవధానం), అయినపూడి శ్రీలక్ష్మి (ఉత్తమ రచయిత్రి) పురస్కారాలకు ఎంపికయ్యారని తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వారికి రూ.20,116 నగదు, పురస్కారపత్రం, శాలువాతో సత్కరిస్తామని పేర్కొన్నారు.

48 కల్లాల్లో తునికాకు సేకర్య ై నిషేధం ఎత్తేయాలి

రాష్ట్రంలోని 48 కల్లాల్లో తునికాకు సేకరణపై నిషేధం విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం(టీవ్యకాస) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. ప్రసాద్, ఆర్.వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. నిషేధాన్ని ఎత్తేయాలని కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. కట్ట ధరను ప్రభుత్వమే నిర్ణయించి ప్రకటించాలన్నారు.

వేరుశనగ కొనుగోలుకు కేంద్రం అంగీకారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో వేరుశనగ కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు గురువారం కేంద్రం టి.ఎస్.ప్రభుతానికి లేఖ రాసింది. రాష్ట్రంలో రైతులు లక్షా 28 హెక్టార్లలో వేరుశనగ పంట వేశారని, 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, వేరుశనగ కొనుగోలుకు సహకరించాలని కేంద్రానికి మార్కెటింగ్ మంత్రి హరీశ్‌రావు గత నెల జనవరి 9 న లేఖ రాశారు. తెలంగాణలో పండిన వేరుశనగను 96000 మెట్రిక్ టన్నుల మేరకు సేకరిస్తామని కేంద్ర ప్రభుత్వం గురువారం తెలిపింది. కేంద్రం నిర్ణయం పట్ల మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు.

కార్పొరేట్ శక్తుల అనుకూలం : సీపీఐ

హైదరాబాద్ : కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తుల అనుకూల బడ్జెట్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం మాటలు వట్టి మాటలేనని తేలిపోయిందన్నారు. తెలంగాణలో ఒక్క సాగునీటి ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని,. ప్రత్యేకంగా రైల్వేకోచ్‌లకు కేటాయింపులు లేవన్నారు.

అన్ని వర్గాలకు మోసం : ఏఐటీయూసీ

కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నదని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజల ఆశలు నిరాశచేసి పరోక్ష పన్నులతో భారంమోపే విధంగా ఉందన్నారు.

ఉప్పల్‌లో దారుణం

- **పాప తల నరికి బిల్డింగ్‌పై పడేసిన కిరాతకులు**

నవతెలంగాణ - ఉప్పల్

మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకానగర్‌లో దారుణం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు చిన్నారి తల నరికి బిల్డింగ్‌పై పడేశారు. బుధవారం చంద్రగ్రహణం కావడంతో పాపను బలిచ్చారా..? అనే అనుమానం స్థానికుల్లో వ్యక్తమవుతుంది. ఈ హృదయ విదారక ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం...గుర్తు తెలియని చిన్నారి (మూడు నెలలు) తలను దుండగులు నరికి చిలుకానగర్‌లో నివాసముంటున్న క్యాబ్ డ్రైవర్ రాజశేఖర్ ఇంటిపై పడేశారు. రాజశేఖర్ కుటుంబ సభ్యులు గురువారం ఉదయం ఇంటి భవనం పైకెక్కి చూడగా చిన్నారి తల కనిపించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలాన్ని జాయింట్ సీపీ తరుణ్‌జోషి, మల్కాజ్‌గిరి డీసీపీ ఉమామహేశ్వర్‌శర్మ డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంలతో పరిశీలించారు. భవనంపై తల మాత్రమే ఉందని, మిగతా శరీర భాగాలు కనిపించలేదని పోలీసులు తెలిపారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అక్షయ పాత్ర' వద్దంటూ కార్మికుల ఆందోళన

- **పోలీసులకు, మధ్యాహ్నభోజన కార్మికులకు మధ్య తోపులాట ,పలువురు నాయకుల అరెస్టు**

నవతెలంగాణ-కొత్తగూడెం

పాఠశాలలకు అక్షయపాత్ర పథకం పేరుతో భోజనాన్ని సరఫరా చేస్తూ తమ పొట్టగొట్టొద్దంటూ మధ్యాహ్నభోజన కార్మికులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి వ్యవసాయ మార్కెట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఆందోళనకు దిగారు. అక్కడే బైటాయించారు. పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట జరిగింది. మహిళా కార్మికులను, కార్మిక సంఘాల నాయకులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లారు. అరెస్టు చేసి లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కార్మికులు పోలీస్‌స్టేషన్ వరకు ప్రదర్శనగా వెళ్లారు. అక్కడ నినాదాలు చేశారు.

ఆందోళనుద్దేశించి మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ మాట్లాడారు. కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అక్షయపాత్ర డైరెక్టర్ రహస్యంగా ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు మధ్యాహ్న భోజనం అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకే అప్పగిస్తున్నట్టు ఉత్తర్వులు ఇచ్చారని, ఇది కార్మికుల పొట్టగొట్టడేమనని అన్నారు. 20ఏండ్లుగా పిల్లలకు భోజనం వడ్డిస్తున్న కార్మికులను రోడ్డున పడేసే విధంగా చేయడం సరిగాదన్నారు. అక్షయ పాత్ర పథకం వారు ఉదయం నాలుగు గంటలకు ఆవిరి యంత్రాలతో వండిన భోజనాన్ని దూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం పిల్లలకు భోజనం వడ్డించడం వల్ల అన్నం మెత్తబడిపోయి పిల్లలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు వారంలో మూడు రోజులు కోడి గుడ్డు ఇచ్చారని, అక్షయపాత్ర వారు గుడ్డులేకుండా భోజనం పెడుతున్నారని విమర్శించారు. ఈ విషయంలో తల్లిదండ్రులు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి జి.పద్మ అధ్యక్షతన జరిగింది. అరెస్టయిన వారిలో సీఐటీయూ జిల్లా నాయకులు కొండపల్లి శ్రీధర్, కె. బ్రహ్మాచారి, తాటిపర్తి అనిల్, గూడెపూడి రాజు, నలమల సత్యనారాయణ, జైతున్నిబి, చిలుకమ్మ, పద్మ, భూక్యా రమేష్, స్వరూపా, రాములమ్మలు ఉన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంవీ అప్పారావు, పట్టణ ఉపాధ్యక్షులు జైతున్నిబి, రాధమ్మ, చిట్టెమ్మ, లక్ష్మి, ధనలక్ష్మి, భాగ్య, మాలతి ఉన్నారు.

ఏపీకి మళ్లీ అన్యాయం


- అరకొర విదిలింపులు
- కొన్నిటికి కేటాయింపులే లేవు
- రైల్వే జోన్ ఊసే లేదు
- ప్రాజెక్టుల ఊసెత్తని కేంద్రం
- కేంద్ర పన్నుల నుంచి ఏపీ వాటాలో రూ.849 కోట్లు 'లోటు'



ఫైల్‌ఫొటో


అమరావతి : ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న తెలుగు రాష్ట్రాలకు నిరాశే ఎదురైంది. విభజన హామీలు, రాజధానికి నిధుల వంటి అంశాలపై మాట మాత్రంగానైనా ప్రస్తావించ కపోవడం తీవ్ర అసంతప్తి మిగిల్చింది. విభజన సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్రానికి ఈ బడ్జెట్లోనైనా కొంత ఊరట లభిస్తుందని ఆశించినప్పటికీ ఫలితం లేకపోయింది. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కనీస ప్రస్తావన లేదు. రాజధాని నిర్మాణానికి నిధులు, ఆర్థిక సంఘం నిధులు, ద్రవ్య లోటును భర్తీ చేసేందుకు సాయం, ప్రాజెక్టుల ఊసెత్తలేదు. కొన్ని యూనివర్సిటీలు, ఒకటి, రెండు సంస్థలకు సాధారణ కేటాయింపుల్లో భాగంగా నిధులు విదిల్చారు. విజయవాడ, విశాఖ మెట్రో ప్రస్తావనే చేయలేదు. వాణిజ్య రంగాలకు ఎటువంటి ప్రోత్సాహకాలూ ప్రకటించలేదు. అంతకుమించి పెద్దగా కేటాయింపులూ ఏమీ లేదు. రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల మాట్లాడుతూ ఈ బడ్జెట్ ముమ్మాటికీ ఎన్నికల బడ్జెట్టేనని వ్యాఖ్యానించారు. ఆదాయ పరిమితిని పెంచకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. రూ.21.51లక్షల కోట్ల అంచనాలతో 2018-19 బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగం మొత్తంలో ఎక్కడా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఒక్క అంశం కూడా ప్రస్తావన లేదు. మెగా ప్రాజెక్టులకు బడ్జెట్‌లో చోటూ కల్పించ లేదు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి మొండి చెయ్యి చూపడంపై ఏపీ ఎంపీ శివప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మౌన ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్‌లకు రూ. 3018 కోట్లు కేటాయించగా, అందులో ఏపీ ఎయిమ్స్‌కు కొంత వచ్చే అవకాశముంది. కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీకి రూ.4 కోట్లు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డుకు రూ.5 కోట్లు, ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్‌కు రూ.632.61 కోట్లు కేటాయించారు.

ఆవేదనతో ఉన్నాం




బడ్జెట్ కేటాయింపులపై ఆవేదనతో ఉన్నాం. మిత్రపక్షంగా ఉన్నందున బహిరంగంగా వ్యాఖ్యలు చేయలేం. మన అసంతృప్తిని కేంద్రానికి తెలిసేలా వ్యవహరించండి. **-టీడీపీ ఎంపీలతో చంద్రబాబు**

రాష్ట్రానికి ద్రోహం : సీపీఐ(ఎం)



అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మోడీ ప్రభుత్వం ద్రోహం చేసిందని సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ విమర్శించింది. ప్రజలకు తీవ్ర నిరాశను కలిగించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న రైల్వేజోన్, కడప ఉక్కుఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ వంటి వాటిని ప్రకటించలేదని వివరించారు. పోలవరం ప్రాజెక్టు పెండింగ్ బిల్లులకు, అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించలేదని తెలిపారు. గతంలో ఎంతో గొప్పగా ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ అమలుకు ఎటువంటి కేటాయింపులూ లేవని పేర్కొన్నారు. విభజన వల్ల కలిగిన ఆర్థిక లోటును పూడ్చేందుకు కేంద్రం చెల్లించాల్సిన రూ.12,500కోట్లు లేవని తెలిపారు.

'బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం'



అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని పీసీసీ అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా ఓట్ల గారడీ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని ప్రధాన హామీలకు కేటాయింపులు లేవన్నారు. రాజధాని, రెవెన్యూ లోటు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, కడప ఉక్కు పరిశ్రమ, దుగరాజపట్నం పోర్టు తదితరాలు వేటికీ నిధులు కేటాయించలేదని విమర్శించారు. విశాఖ, చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ రైల్వే జోన్ హామీలపై రాష్ట్ర ప్రజలకు నిరాశే ఎదురయ్యిందన్నారు.

ఉపాధి హామీ చట్టం ప్రస్తావన ఏదీ?

- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత
- ప్రజాసంఘాల విమర్శ



ఫైల్‌ఫొటో

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

2018-19 బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగా పల్లెల్లో మౌలిక సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. గ్రామీణాభివద్ధికి ప్రాధాన్యత ఉంటుందని తెలియజేశారు. పల్లెల్లో రోడ్లు, మౌలిక వసతుల కల్పన, గ్రామీణ పారిశుద్ధ్య పథకం, విద్యారంగంలో మౌలిక సౌకర్యాలు, ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన పథకం పథకాలను నిధులు చూపించారు. 2022 నాటికి అన్ని గ్రామాల్లో పక్కా రోడ్ల నిర్మాణం చేపడతామని, ఉజ్వల యోజనలో భాగంగా 8 కోట్ల మంది గ్రామీణ మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని తెలియజేశారు. గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు, సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు ఇస్తామని తెలియజేశారు. ఇదిలావుండగా దేశంలో అత్యధికంగా ఉన్న వ్యవసాయ కార్మికులు, కూలీల జీవనాధారమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కనీస ప్రస్తావన కూడా చేయకపోవడం గమనార్హం. దేశంలో 12 కోట కుటుంబాలకు ఈ పథకం ద్వారా పని అందుతున్నది.రాష్ట్రంలో సుమారు 56 లక్షల మంది జాబ్‌కార్డులు ఇవ్వగా, ప్రతిరోజూ దాదాపు 40 లక్షల మంది కూలీలు పనికి వెళుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఇంత ప్రాధాన్యత ఉన్న చట్టం గురించి చెప్పకపోవడం దారుణమని ప్రజాసంఘాలు అంటున్నాయి. వ్యవసాయ కార్మికుఉ, చిన్న, సన్నకారు రైతాంగం పట ఉన్న కపట ప్రేమను తెలియజేస్తున్నదని అభిప్రాయపడుతతున్నాయి. పేదలకు మాటలు చెప్పి, కార్పొరేట్లకు మాత్రం మూటలు పంచిబెడుఉన్నదని విమర్శిస్తున్నాయి. గత బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టం పథకానికి రూ. 48 వేల కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ సారి ఒక్కపైసా చూపకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఫుడ్ ప్రాజెసింగ్ కార్పొరేట్ కంపెనీలకు 30 పన్ను రాయితీలు కల్పించిన ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం చౌకదుకాణా ద్వారా అందించే బియ్యం, చక్కెర, కిరోసిన్, గోదుమలకు రాయితీలు బడ్జెట్‌ఓ ఎక్కడా కనిపించలేదు.

పౌష్టికాహార లోపం ఉన్న నిరుపేదలకు ఆదుకోవం కోసం ఎంచేస్తారనే సంగతి స్పష్టంగా చెప్పకపోడం గమనార్హం. ప్రతిపేదవాడికి జన్‌ధన్ ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని చెప్పి, అమలు చేయడంలో విఫలమైందనే ఆరోపణలు వస్తున్నాయి. ఎనిమిది కోట్ల మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇస్తామన్న కేంద్రం, గ్యాస్ సబ్సీడీ కోతపై నోరుమెదపకపోవడం చర్చనీయాంశమవుతున్నది. 2022 నాటికి ప్రతిపౌరునికి సొంత ఇంటి కల నేరవేరుస్తాం, ఉచిత కరెంటు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ప్రజాసంఘాల నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. రెండు కోట వ్యక్తిగత మరుగుదొడ్లు, 51 లోల ఇండ్లు నిర్మిస్తామంటూనే బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమని అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ పేదల విద్య, వైద్యం, రోడ్లు, తాగునీరు తదితర కనీస మౌలిక సదుపాయాల కల్పన మాటలకే పరిమితమవుతుందన్నారు. ఆచరణలో కార్పొరేట్లను ప్రసన్నంచేసుకునే పనిలో ఉందని విమర్శించారు.

ప్రజలకు నిరాశ...కార్పొరేట్లకు భరోసా

కేంద్ర బడ్జెట్‌పై పట్నం రాష్ట్ర కమిటి విమర్శ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన చివరి బడ్జెట్ కూడా ప్రజలకు నిరాశే మిగిల్చిందని పట్నం రాష్ట్ర కమిటి పేర్కొంది. ఈ బడ్జెట్ కార్పొరేట్లకు మాత్రం భరోసా కల్పించిందని విమర్శించింది. దేశ ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూసినా బడ్జెట్‌లో ఎటువంటి ఊరట కలిగించే ప్రతిపాదనలు లేవని పేర్కొంది. ఈమేరకు గురువారం పట్నం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి డి జి నర్సింహారావు ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా నిరాశకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతాంగానికి గిట్టుబాటు ధరగానీ, వ్యవసాయోత్పత్తుల స్టోరేజీలకుగానీ, రుణాల మాఫీపై కూడా నిరాశ పరిచిందన్నారు. బడ్జెట్‌లో పట్టణ ప్రజలకు ప్రయోజనం కలిగించే పథకాలు లేవన్నారు. 99 స్మార్ట్ సిటీలకు కేవలం రూ 2 లక్షల 9కోట్లు మాత్రమే కేటాయించి, అమృత్ కింద వచ్చిన పట్టణాలకు మరో రూ 14 వేల కోట్లు కేటాయించిందన్నారు. వీటి వలన పట్టణాలలో మౌళిక సదుపాయాల కల్పన ఏ మేరకు జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అత్యధిక సంఖ్యలో నిరుద్యోగులుగా ఉన్న యువతకి ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి ప్రకటించలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లోనే 10 లక్షల ఉద్యోగ ఖాళీలున్నాయని ఏడవ పే కమిషన్ పేర్కొనట్టు తెలిపారు. ఆశగా ఎదురు చూసిన వేతన జీవులకు ఆదాయ పన్ను స్లాబులలో ఎటువంటి మార్పు చేయలేదన్నారు. రెండో వైపు కార్పొరేట్లకు మాత్రం పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించిందన్నారు. బడ్జెట్ లోటు పూరించుకోవడానికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాలను అమ్మి లక్ష కోట్లు సేకరించాలని నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ మహానగరంలో ఎంఎంటీఎస్, మెట్రో రైల్‌కు బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌ల ప్రయోజనాలను నెరవేర్చే దిశగానే ఉందన్నారు. కార్మికులు, ఉద్యోగులు, పేద ప్రజలకు ప్రయోజనం కలిగించే విధంగా లేదన్నారు. ఆరోగ్య భీమా పది కోట్ల కుటుంబాలకు వర్తించినా అది కార్పొరేట్ ఆస్పత్రులకు ప్రయోజనం తప్ప ప్రజలకు ఆరోగ్యం అందించేది కాదన్నారు. బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికలలో లబ్దిపొందే దిశగా హామీలు తప్ప ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు లేవని ఆయన నిరసన వ్యక్తం చేశారు.

మేడారంలో బందోబస్తుపై డీజీపీ సమీక్ష

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

మేడారంలో సమ్మక్క సారక్క జాతరకు లక్షలాదిగా తరలి వస్తున్న భక్త జనంతో ట్రాఫిక్ రద్దీ పెరగడం, కొన్ని ప్రాంతాలలో క్యూలైన్లలో రద్దీ పెరగడంతో ఏర్పడుతున్న సమస్యలపై రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి గురువారం సీనియర్ పోలీసు అధికారులతో సమీక్ష జరిపారు. ఇప్పటి వరకు దాదాపు 15 వేల మంది పోలీసులే గాక ఇతర స్వచ్ఛంద సంస్థలు, హోంగార్డులతో బందోబస్తు తో పాటు ట్రాఫిక్ నియంత్రణపై తగిన చర్యలను తీసుకుటున్నామని బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీనియర్ అధికారులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. అయితే అనుకున్న దానికంటే కూడా ఈ మారు జాతరకు ఇరవై నుంచి ముప్పై శాతం ఎక్కువగా జనం తరలివచ్చే అవకాశాలు ఉన్నాయని కూడా అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడ కూడా తొక్కి సలాట జరగకుండా చూడటానికి ప్రత్యేకంగా బృందాలను తయారు చేసి ఆయా ప్రదేశాలలో మోహరించాలని డీజీపీ వారికి సూచించారని తెలిసింది. జనం ఏ వైపునుంచి ఎక్కువగా తరలి వస్తున్నది ముందుగానే సమాచారాన్ని సేకరించి తగిన డైవర్షన్‌లను కూడా సూచించాలని ఆయన కోరారు.

గూగుల్ కోడ్ ఇన్‌లో ఆకట్టుకున్న నారాయణ విద్యార్థి మెహంత్

హైదరాబాద్: ప్రపంచ ప్రఖ్యాత సంస్థ గూగుల్ నిర్వహించిన గూగుల్ కోడ్ ఇన్-2017లో నారాయణ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ ఘనత సాధించిన ఒకే ఒక్కడు మెహంత్ కావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ పి. శరణి నారాయణ పేర్కొన్నారు. ఘన విజయం సాధించిన మెహంత్‌ను నారాయణ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ వివి ఎల్ శేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

మంచిర్యాల థర్మల్ ప్లాంట్‌లో 826 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి



ఫైల్‌ఫొటో

హైదరాబాద్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లో ఉన్న సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంటులో జనవరి నెలలో 826.61 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్టు సంస్థ వెల్లడించింది. దీనిలో 779.62 మిలియన్ యూనిట్లను గజ్వేల్‌లోని పవర్ గ్రిడ్‌కు సరఫరా చేసినట్టు తెలిపింది. మొత్తంగా ఎస్‌టీపీసీ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 12,219.37 మిలియన్ టన్నుల యూనిట్‌ను ఉత్పత్తి చేసినట్టు వివరించింది. ఈ సందర్భంగా సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఉద్యోగులు, అధికారులకు సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేడు మేడారానికి ఉపరాష్ట్రపతి, సీఎం రాక

నవతెలంగాణ-మేడారం(ములుగు)

తెలంగాణ కుంభమేళగా ప్రసిద్ధిగాంచిన మేడారం మహాజాతరకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి జ్యూయల్ ఓరం, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుక్రవారం రానున్నారు. ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కేంద్ర గిరిజన శాఖ మంత్రి జ్యుయల్ ఓరంతో కలిసి హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో ఉదయం 11 గంటలకు మేడారం చేరుకుంటారు. అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతిలో కొంత సేపు విశ్రాంతి తీసుకుని సమ్మక్క- సారలమ్మను దర్శించుకోనున్నారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి 12:30 గంటలకు హెలీకాప్టర్‌లో బయలు దేరి 1:15 గంటల కు మేడారంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ స్థలంలో దిగి కాన్వాయి ద్వారా 1:25 గంటలకు గద్దెల ప్రాంగణానికి చేరుకుంటారు. కొంత సమయం విశ్రాంతి తీసుకుని 1:45 నుంచి 2:10 గంటలకు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. 2:10 నుంచి 3:00గంటలకు పోలీసు క్యాంపులో భోజనం చేయనున్నారు. 3:10ంటలకు తిరిగి హెలీకాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లనున్నారు.

మేడారం సందర్శనలో ఛత్తీస్‌గఢ్ సీఎం

మేడారం మహాజాతరను ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ సందర్శించారు. గురువారం మధ్యాహ్నం ఆయన నేరుగా హెలీకాప్టర్ ద్వారా మేడారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్, జాతర ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎస్పీ భాస్కరన్, జాయింట్ కలెక్టర్ అమయ్ కుమార్, ములుగు సబ్ కలెక్టర్ వీపీ.గౌతం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సీఎం రమణ్‌సింగ్ నేరుగా తులాభారం వద్దకు చేరుకుని 90 కిలోల బంగారం(బెల్లం) సమర్పించారు. సీఎం వెంట ఛత్తీస్‌గఢ్ విద్యాశాఖ మంత్రి కేదార్ కష్యప్, అటవీశాఖ మంత్రి మహేష్ గగ్ధ వచ్చారు. సీఎం రాకతో ముందస్తు జాగ్రత్తగా ఛత్తీస్‌గఢ్ ఐజీ వివేకానంద్ శ్రీనాథ్, ఎస్పీ ఎంఆర్.ఐరీ తన బలగాలతో జాతరకు చేరుకొని భద్రతను కట్టుదిట్టం చేశారు.

జాతరకు తరలొచ్చిన వీవీఐపీలు

మేడారానికి వీవీఐపీలు భారీగా తరలివచ్చారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, మండలి చైర్మెన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, క్రిష్ణారావు, తాటి వెంకటేశ్వర్లు, హన్మంతరావు, వివేకానంద, సాయన్న, ఎంపీ మల్లారెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ ఎస్పీ సింగ్, ఎన్‌సీసీ ఐజీ కన్నన్, ఎమ్మెల్సీ ఎస్.రాజు, సినీనటుడు శివారెడ్డి దంపతులు సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రి మాణిక్యరావు తన నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) సమర్పించారు.

మేడారంలో సందర్శకుల పరేషాన్

- విరేచనాలతో సతమతం...పెరుగుతున్న రోగులు
- తాగునీటి కోసం తిప్పలు

నవతెలంగాణ-వరంగల్/వెంకటాపురం/వాజేడు

మేడారం జాతరలో 60 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నా సందర్శకులు అత్యధికంగా విరేచనాలతో అస్వస్తతకు గురికావడంతో అధికారుల్లో ఆందోళన కలిగిస్తోంది. మేడారం జాతరలో ఇప్పటికే లక్షా31వేల42 అవుట్ పేషంట్ కేసులు నమోదైనట్టు క్యాంపు ఇన్‌చార్జి వైద్యులు తెలిపారు. జనవరి 28వ తేదీన 9 వేలా 542 మంది, 29న 13 వేలా 674, 30వ తేదీన 20 వేలా 956, 31వ తేదీన 28 వేలా 729 మంది అస్వస్తతకు గురయ్యారు. ఇందులో ఎక్కువ మంది విరేచనాలు, కడుపునొప్పి, శ్వాసకోశ సంబంధిత అస్వస్తతకు గురై వైద్య సేవలందుకున్నారు. 31,300మందిని ఇన్‌పేషంట్స్‌గా చేర్చుకొని వైద్యసేవలందించారు. తీవ్ర అస్వస్తతకు గురైన 15మందిని అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

60 వైద్య శిబిరాలు.. 1,040 మంది సిబ్బంది

జాతర పరిసర ప్రాంతాల్లో 16 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. 150 మంది వైద్యాధికారులు, 1,040 మంది సిబ్బంది 24 గంటలపాటు వైద్యసేవలందిస్తున్నారు. జాతర పరిసరాల్లో 108 అంబులెన్స్‌లు 20, 104 వాహనాలు 5, 5 బైక్ వాహనాలను వినియోగిస్తున్నారు. జాతరలో గద్దెల సమీపంలోనే 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. జాతర పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా సందర్శకులు అస్వస్థతకు గురైతే వారిని వెంటనే ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్య సేవలందిస్తున్నారు.ా

తప్పని తాగునీటి కష్టాలు

మేడారం మహాజాతరలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సందర్శకుల తాగునీటి కోసం ప్రభుత్వం రూ.కోట్లల్లో నిధులు కేటాయించింది. పనులన్నీ పూరైనట్టు



ప్రకటించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తీరా తాగునీటి సరఫరా ప్రారంభించగానే లోపాలు బయట పడ్డాయి. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌లకు నీటిని పంపిణీ చేసేందుకు కాంట్రాక్టర్లు ఎక్కువ సామర్థ్యం గల విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశారు. మోటార్లు ఆన్‌చేయగానే విద్యుత్ ఓవర్‌లోడుకు ట్రిప్పవుతున్నది. దీంతో పలు చోట్ల బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ద్వారా నీరు రాక ఇబ్బందులు పడ్డారు. ట్రాన్స్‌కో అధికారులు ఏ మేరకు విద్యుత్ అవసరముంటుందనేది పట్టించుకోలేదు. గిరిజన మ్యూజియం, ఊరట్టం, జంపన్నవాగు, రెడ్డిగుడెం, బస్టాండ్, బోరింగులు, మోటార్ల వద్ద తాగునీటి కోసం సందర్శకులు ఘర్షణలకు దిగుతున్నారు.



అసంతృప్తి.. అయోమయం

కేంద్ర బడ్జెట్‌పై టీఆర్ఎస్ ఎంపీల్లో మిశ్రమ స్పందన

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

2018-19 కేంద్ర వార్షిక బడ్జెట్‌పై టీఆర్ఎస్ ఎంపీల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అయ్యింది. ఈ బడ్జెట్‌పై కొంతమంది ఎంపీలు అసంతృప్తిగా.. మరికొంత మంది అయోమయంగా ఉన్నారు. ఏ రాష్ట్రానికి, ఏ ప్రాంతానికి ఎన్ని నిధులు కేటాయించారో బడ్జెట్‌లో స్పష్టతలేదని ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించడం సానుకూల అంశమని ఎంపీ కవిత తెలిపారు. బడ్జెట్‌పై పూర్తిగా కసరత్తు చేయకుండానే హెల్త్‌స్కీం లాంటి వాటిని కేంద్రం ప్రకటించిందని ఎంపీ వినోద్‌కుమార్ విమర్శించారు.

స్పష్టత రావాలి : ఎంపీ జితేందర్‌రెడ్డి



'కేంద్ర బడ్జెట్‌పై స్పష్టతరావాల్సి ఉంది. ఏ రాష్ట్రానికి, ఏ ప్రాంతానికి ఎన్ని నిధులు కేటాయించారో స్పష్టత లేదు. బడ్జెట్‌ను రాష్ట్రాల వారిగా కాకుండా మంత్రిత్వశాఖలవారిగా కేటాయించారు. గత సంవత్సరం నుంచి ఈ కొత్త విధానాన్ని కేంద్రం అవలంబిస్తోంది. ఇంటింటికి మంచినీరు, రైతుల ఆదాయం రెట్టింపు, మౌలిక వసతులకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. రాష్ట్రాల అవసరాలను బట్టి మంత్రిత్వశాఖలు బడ్జెట్ కేటాయింపులు జరుపుతాయి. తెలంగాణ అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం. రాష్ట్ర అభివృద్ధికి రావాల్సిన నిధులను సాధిస్తాం' అని జితేందర్‌రెడ్డి చెప్పారు.

మద్దతు ధర ఏలా ఇస్తారో చెప్పలేదు : ఎంపీ కవిత




'విద్యా, ఆరోగ్యంపై ఎక్కువ దృష్టి పెట్టామని లోక్‌సభలో జైట్లీ చెప్పారు. కానీ విద్యాభివృద్ధికి సరిపడా కేటాయింపులు చేయలేదు. అన్ని వర్గాలను కాకుండా కొన్నింటినే ఎంపిక చేశారు. రైతులకు కనీస మద్దతు ధర బడ్జెట్‌లో సానుకూల అంశం. అయితే ఈ మద్దతు ధర సైతం అన్ని పంటలకా లేక కొన్నింటికే పరిమితమా అన్న విషయంలో స్పష్టత లేదు. 2014లో హామీనిచ్చి చివరి సంవత్సరంలో కనీస మద్దతు ధర గురించి ఆలోచించారు. మొదటి బడ్జెట్‌లోనే ఈ ప్రతిపాదన చేస్తే మూడేండ్లుగా రైతులు లబ్ధి పొందేవారు. అయితే రైతులకు ఏ విధంగా మద్దతు ధర కల్పిస్తారో చెప్పలేదు. వ్యాపారసులభతరంలో రాష్ట్రాల పనితీరును జైట్లీ ప్రస్తావించకపోవడం బాధాకరం' అని ఎంపీ కవిత అన్నారు. ఇక మహిళా శిశుసంక్షేమానికి సంబంధించి బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించకపోవడం శోచనీయమని అన్నారు. ఢిల్లీలో కూర్చొని గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీల ఖాతాల్లో డబ్బులు వేస్తామనడం సరైంది కాదని చెప్పారు. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు.

కసరత్తు లేకుండా బడ్జెట్ : ఎంపీ వినోద్



'కేంద్ర బడ్జెట్‌పై అరుణ్‌జైట్లీ పూర్తిగా కసరత్తు చేయలేదు. ఒబామా కేర్‌లాగా మోడీ కేర్ అంటూ బీజేపీ మంత్రులు అభివర్ణిస్తున్న హెల్త్‌స్కీంకు తగిన కేటాయింపులు చేయలేదు. 50 కోట్ల మందికి రూ. 5 లక్షల వరకు హెల్త్‌స్కీం అని జైట్లీ ప్రకటించారు. ఈ పథకం అమలుకావాలంటే సుమారు రెండు లక్షల కోట్లు ఖర్చువుతుంది. కానీ బడ్జెట్‌లో కేవలం రూ. రెండు వేల కోట్లు మాత్రమే కేటాయించారు. మిగతా డబ్బులు ఎలా అన్న విషయం దాచారు. సాయంత్రం ఆర్థికశాఖ కార్యదర్శి మీడియాతో మాట్లాడుతూ... కేంద్రం 60శాతం, రాష్ట్రం 40 శాతం భరిస్తుందని చెప్పారు. కసరత్తు లేకుండా ప్రకటన చేశారు. రాష్ట్రాల ఆర్థిక సామర్థ్యాలు పరిగణనలోకి తీసుకోకుండా బద్నాం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు' అని ఎంపీ వినోద్‌కుమార్ విమర్శించారు. ఈ బడ్జెట్‌లో జైట్లీ సుదీర్ఘ ప్రసంగం తప్ప ఏమీ లేదని అన్నారు.

ఎన్నికల ఆకర్షణీయ బడ్జెట్ : కొండా విశ్వేశ్వరరెడ్డి



'ఎన్నికల ఆకర్షణీయ బడ్జెట్‌గా భావించాలి. గ్రామీణాభివృద్ధికి, రైతాంగానికి పెద్దపీట వేశారు. అయితే కొన్ని అంశాలను విస్మరించారు. పశుసంవర్ధక శాఖకు కేవలం రూ.11 వేల కోట్లు, ఉద్యానవన రంగానికి రూ. రెండు వేల కోట్లే ఇచ్చారు. కేంద్ర బడ్జెట్‌తో పోలిస్తే తెలంగాణ రాష్ట్రమే ముందుంది. గొర్రెల పెంప కానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. నాలుగు వేల కోట్లు కేటాయించింది. గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు నెలకొల్పే ఆలోచన స్వాగతించదగినది. గిరిజన బిడ్డలు అధికంగా ఉన్న తాండూరు, పరిగిలో ఏకలవ్య పాఠశాలలు వస్తాయని ఆశిస్తున్నా' అని కొండా విశ్వేశ్వరరెడ్డి చెప్పారు.

2018 - 19 వార్షిక బడ్జెట్ - ముఖ్యాంశాలు

- వ్యక్తిగత ఆదాయపన్ను పరిమితిలో మార్పు లేదు
- వ్యవస్థీకృత సంస్కరణలు వేగవంతం. 8 శాతం వృద్ధి సాధన లక్ష్యంగా అన్ని కీలక రంగాల్లో గొలుసుకట్టు సంస్కరణల అమలు
- ప్రభుత్వ రంగ సంస్థల్లో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడుల ఉపసంహరణ
- 14 ప్రభుత్వ రంగ సంస్థలను స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని నిర్ణయం
- ఆయుధాల తయారీ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రోత్సాహం
- మొబైల్ ఫోన్లు, టీవీలు, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ 15 నుంచి 20 శాతానికి పెంపు
- వైద్య, విద్యా సెస్సు 4 శాతానికి పెంపు
- గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.55 వేల కోట్లు
- చిన్న, మధ్య తరగతి రైతుల కోసం దేశ వ్యాప్తంగా 22 వేల రూరల్ హాట్స్ నిర్మించి, గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా అభివృద్ధి.
- ఆలూ, టమోటా, ఉల్లి రైతుల, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం 'ఆపరేషన్ గ్రీన్స్'
- సహకార సంఘాల ద్వారా వందకోట్ల రూపాయల వార్షిక టర్నోవర్ ఉండే వ్యవసాయ ఉత్పాదక సంస్థలకు నూరు శాతం పన్ను రాయితీ
- స్వయం సహాయక బృందాల రుణాల మొత్తం రూ. 42,500 కోట్ల రూ. 75 వేల కోట్లకు పెంపు
- గిరిజన ఆవాస ప్రాంతాల్లో 2022 నాటికి ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలు



2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన దేశ బడ్జెట్ ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అన్న మాటలు..

- 10 కోట్ల పేద కుటుంబాల ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రీయ సమాజ్ బీమా యోజన పథకం. కుటుంబానికి ఏడాదికి 5 లక్షల రూపాయల పరిమితి.
- 2018-19 ఆర్థిక సంవత్సరాంతానికి ద్రవ్యలోటు 3.5 శాతం నుండి 3.3 శాతం తగ్గుదల లక్ష్యం.
- మౌలిక వసతుల రంగానికి రూ.5.97 లక్షల కోట్లు కేటాయింపు
- పర్యాటక రంగంలో ఐకానిక్ కేంద్రాలుగా పది ప్రాంతాల అభివృద్ధి
- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ), రోబోటిక్స్‌పై ప్రత్యేక దృష్టి. ఎఐ కోసం నిటి ఆయోగ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కార్యక్రమం
- వయో వృద్ధుల ఎఫ్‌డి. పోస్టాఫీసు డిపాజిట్లపై 50 వేల వరకు టిడిఎస్ రద్దు వేతన ఉద్యోగులకు 40 వేల రూపాయల వరకు ప్రయాణ, వైద్య ఖర్చులకు స్టాండర్డ్ డిడక్షన్ వర్తింపు
- చిన్న తరహా పాదరక్షలు. తోలు ఉత్పత్తుల తయారీ సంస్థల లాభాలపై ఆదాయపన్ను రాయితీ
- అమృత్ పథకం కింద రూ.19,428 కోట్ల 494 ప్రాజెక్టులు
- జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక పైలట్ ప్రాజెక్టు. 115 జిల్లాలు
- రాష్ట్రపతి. ఉపరాష్ట్రపతి, గవర్నర్ల వేతనాల పెంపు
- 2020 నాటికి 50 లక్షల మంది యువతకు ఉద్యోగ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ
- రోడ్లు, మౌలిక వసతులకు రూ. 9.64 లక్షల కోట్లు
- రైల్వేలకు 1.48 లక్షల కోట్లు
- కొత్త ఉద్యోగాలు కల్పించే రంగాల్లో ప్రభుత్వ ఇపిఎఫ్ 8.33 శాతం నుండి 12 శాతానికి పెంపు. మూడు సంవత్సరాల పాటు అమలు.
- ముద్ర యోజన రుణాల్లో 75 శాతం మహిళలకు కేటాయింపు.
- దళిత సంక్షేమానికి 56 వేల కోట్లు, ఆదివాసీల సంక్షేమానికి 32,508 కోట్లు.

ఎగుమతుల ప్రస్తావనేది..?

ప్రముఖ ఆర్థిక నిపుణులు డి.నర్సింహారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఎగుమతుల గురించి ప్రస్తావించకపోవటం శోచనీయమని ప్రముఖ ఆర్థిక నిపుణులు డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి వ్యాఖ్యానించారు. ఇటీవల విడుదలైన ఆర్థిక సర్వేలో ఎగుమతుల్లో తెలంగాణ ఐదో స్థానంలో నిలిచిందంటూ పేర్కొన్నారని గుర్తుచేశారు. మన రాష్ట్రం నుంచి పసుపు, ఫార్మా, పత్తి తదితర ఎగుమతులు ఎక్కువగా ఉంటాయని వివరించారు. ఈ ఎగుమతులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, గ్రేడింగ్ చేసేందుకు వీలుగా యంత్రాల కొనుగోళ్లకు నిధుల కేటాయింపులు, ప్రోత్సాహకాల్లేవని తెలిపారు.

బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు మొండిచేయి

టీడీపీ అధ్యక్షులు రమణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో తెలుగు రాష్ట్రాలకు మొండి చేయి చూపించడం బాధాకరమని తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు ఎల్ రమణ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు బి.ఎన్.రెడ్డి, పార్టీ కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జి.బుచ్చిలింగంతో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్రం నుంచి బడ్జెట్ కేటాయింపులను రాబట్టడంలో టీఆర్ఎస్ ఎంపీలు విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను బడ్జెట్లో కేటాయించే విధంగా ఎంపీలు ఎలాంటి ప్రయత్నం చేయలేదని వ్యాఖ్యానించారు.

సింగరేణి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని, ఐదు నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా టీఎన్‌టీయూసీ దాని అనుబంధ సంఘాలు ఈ నెల 5వ తేదీన 72 గంటలపాటు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు ప్రకటించారు. దీక్షకు సంబంధించిన గోడపత్రిక, కరపత్రాలను విడుదల చేశారు.గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు ఈబడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడాన్ని స్వాగతించారు. తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, రైల్వే కోచ్, రైల్వే జోన్ తదితర హామీలను పూర్తిగా విస్మరించారని చెప్పారు.

తెలంగాణకు శఠగోపం

విభజన హామీల విస్మరణ

- ఎయిమ్స్‌కు కేటాయింపులు శూన్యం
- భగీరథ, కాకతీయకు మొండిచేయి
- కాళేశ్వరం ఊసెత్తని జైట్లీ..



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారు మరోసారి తెలంగాణకు శఠగోపం పెట్టింది. 2019 సాధారణ ఎన్నికలకు ముందు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2018-19 కేంద్ర వార్షిక బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేసింది. విభజన చట్టంలో హామీలను విస్మరించడమే కాకుండా గతేడాది బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన ఎయిమ్స్‌కు సైతం ఒక్క రూపాయి కేటాయించలేదు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు ఆర్థిక సాయం చేయాలన్న రాష్ట్ర విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు వెయ్యి కోట్లు కేటాయించాలన్న విన్నపాన్ని సైతం విస్మరించింది. రైల్వేరంగంలోనూ తీరని అన్యాయం జరిగింది. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు కేవలం రూ.19,207 కోట్లు కేటాయింపులు చేశారు. మొత్తం బడ్జెట్‌తో పోల్చితే ఇది కేవలం 2.43 శాతం మాత్రమే.

2018-19 వార్షిక బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న తెలంగాణ రాష్ట్ర సర్కారుకు కేంద్రం మరోసారి మొండిచేయి చూపింది. కేంద్ర బడ్జెట్‌లో ఈ యేడాది తెలంగాణకు రూ.19,207 కోట్ల బడ్జెట్ అంచనాలు రూపొందించారు. ఇందులో కార్పొరేషన్ ట్యాక్స్ రూ. 5392.78 కోట్లు, ఆదాయం పన్ను రూ.4772.31 కోట్లు, కేంద్ర జీఎస్టీ రూ.6181 కోట్లు, సమీకృత జీఎస్టీ రూ.511.77 కోట్లు, కస్టమ్స్ రూ.946.26, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.922.11 కోట్లు చొప్పున మొత్తం రూ.18,726 కోట్లుగా పేర్కొన్నారు. గత బడ్జెట్ కింద సవరించిన అంచనాల కింద మరో రూ.481.21 కోట్లు జత చేశారు. గత మూడేండ్లుగా పరిశీలిస్తే గణాంకాల పరంగా నిధుల మొత్తం పెరుగుతున్నప్పటికీ.. బడ్జెట్‌లో రాష్ట్ర వాటాను మాత్రం 2.43 శాతానికే పరిమితం చేశారు.

ఈ మొత్తంలో హైదరాబాద్ ఐఐటీకి రూ. 75 కోట్లు, ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓసియెన్ ఇన్‌ఫర్మేషన్ సర్వీస్‌కు రూ. నాలుగు కోట్లు కేటాయించారు. గిరిజన విశ్వవిద్యాలయానికి రెండు కోట్లు కేటాయింపులు జరిపారు. ఇక రోడ్డు ట్రాన్స్‌పోర్టు విభాగంలో ఇన్‌స్పెక్షన్, సర్టిఫికేషన్ కేంద్రానికి రూ.3.5 కోట్లు కేటాయించారు.

కాల్వలో పడి 33 గొర్రెలు మృత్యువాత

నవతెలంగాణ-శాయంపేట

మేత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి 33 గొర్రెలు మృతి చెందిన ఘటన వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలో గురువారం జరిగింది. 9 మంది గొల్లకురుమలకు చెందిన 800 గొర్లను మేతకోసం కాపరులు ముదిగిరి రవి, కూరబోయిన ఐలయ్య, కొమ్ము సాంబయ్య, బుట్టి చేరాలు, కొమ్ము సైదయ్యలు సమీపంలోని గుట్టలకు తీసుకెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో గొర్రెలు కాల్వలోకి దిగబోయి ఒకదాని మీద మరొకటి పడిపోయి 33 గొర్రెలు మృతిచెందాయి.

విజయానందంలో భాగమతి



అశోక్, ప్రమోద్, వంశీ, అనుష్క, విక్కీ, థమన్


అనుష్క ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకుడు. యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు సంయుక్తంగా నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తున్న నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా అతిథిగా విచ్చేసిన దిల్‌రాజు మాట్లాడుతూ, 'అనుష్క కథానాయికగా కమర్షియల్ సినిమాలతో విజయాలను అందుకుంటూ ఇలా లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు చేయడం గొప్ప విషయం. ఈ సినిమాకు ఆమె బ్యాక్ బోన్. అశోక్ ఈ చిత్రంతో ఓ కొత్త అనుభూతినిచ్చారు. కొన్ని సినిమాల విజయంలో టెక్నీషియన్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. ఈ చిత్రానికి సాంకేతిక నిపుణులు ఎంతో ఎఫర్ట్ పెట్టారు. ఆర్ట్ వర్క్ అద్భుతం. వారికి అభినందనలు. తెలుగు ప్రేక్షకులు మంచి సినిమాల్ని ఎప్పుడూ ఆదరిస్తారు. అందులో భాగంగానే ఈ సినిమాను పెద్ద హిట్ చేశారు. ఇటీవల కాలంలో సోమవారం థియేటర్స్ ఫుల్ కావడం మామూలు విషయం కాదు. సోమవారం కోటి 80 లక్షల గ్రాస్‌ను వసూలు చేసింది. అది గొప్ప విషయం. నేను పరిశ్రమకి వచ్చిన ఆరేండ్లలో ఐదు హిట్లు కొట్టా. ఇప్పుడు యువి క్రియేషన్స్ కూడా అలానే హిట్స్ కొడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

'సినిమాకు రెస్పాన్స్ సూపర్‌గా ఉంది. పాటిజివ్ మౌత్‌టాక్‌తో రన్ అవుతుంది. ఫ్యామిలీ ఆడియెన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రిపీట్ ఆడియెన్స్ ఎక్కువగా వస్తున్నారు. మంచి టెక్నీషియన్లు లేకపోతే లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు చేయడం సాధ్యం కాదు. థమన్ అద్భుతమైన రీ-రికార్డింగ్‌తో అదరగొట్టారు. ఇంత మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు, మంచి సినిమాను తీసిన దర్శకుడు అశోక్, నిర్మాతలకు ధన్యవాదాలు' అనుష్క తెలిపారు. దర్శకుడు అశోక్ చెబుతూ, 'ఇది సక్సెస్ మీట్ కాదు, సక్సెస్‌ఫుల్ జర్నీ. 2012లో ఇది ప్రారంభమైంది. ఇన్ని రోజులు దాన్ని కొనసాగించి ఇక్కడ వరకు తీసుకొచ్చిన అందరికీ ధన్యవాదాలు. సినిమాను నమ్మి నటించడంతో గట్స్ చూపించిన అనుష్కకు థ్యాంక్స్. ఈ సక్సెస్ క్రెడిట్ అంతా స్వీటీకే చెందుతుంది. కొత్తగా చేసిన ప్రయత్నాన్ని ఆదరించిన ఆడియెన్స్‌కు థ్యాంక్స్' అని చెప్పారు. 'సినిమాకు భారీ ఓపెనింగ్స్ రావడం ఆనందంగా ఉంది. అయితే ఈ చిత్రానికి సీనియర్ టెక్నీషియన్లతో పనిచేసేటప్పుడు భయంగా అనిపించింది. వారి సపోర్ట్‌తో మంచి మ్యూజిక్ ఇవ్వగలిగాను. అశోక్ స్వీట్ పర్సన్. స్వీటికి నేను పెద్ద అభిమానిని. సినిమాలో చాలా బాగా నటించింది' అని థమన్ తెలిపారు. 'సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మంచి సినిమాలను ముఖ్యంగా కంటెంట్ బేస్డ్ సినిమాలను ఆదరించడంలో మన ప్రేక్షకులెప్పుడూ ముందే ఉంటారు. మేం ఊహించిన రీతిలో సినిమాకు ఆదరణ లభిస్తోంది' అని నిర్మాతలు తెలిపారు.

నవచిత్రం

ఇద్దరా.. ముగ్గురా..?



రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఎన్టీఆర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో రాజమౌళి తెరకెక్కించబోయే భారీ మల్టీస్టారర్‌లో మరో కథానాయకుడు కూడా నటించబోతున్నాడనే వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఆ కథానాయకుడు ఎవరనే విషయంలో క్లారిటీ లేనప్పటికీ అల్లు అర్జున్ పేరు మాత్రం బాగా వినిపిస్తోంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లుఅర్జున్ కాంబినేషన్‌లో సినిమా అంటే దానికి ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇదే నిజమైతే టాలీవుడ్‌లో వండర్ జరిగినట్టే. ఈ చిత్ర షూటింగ్ కార్యక్రమాలను అక్టోబర్‌లో ప్రారంభించడానికి రాజమౌళి ప్లాన్ చేస్తున్నారట. ఎన్టీఆర్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న 'రంగస్థలం' చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం ఆయన బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఇటీవల ప్రారంభమై ఫస్ట్ షెడ్యూల్‌ని కూడా ఈ చిత్రం పూర్తి చేసుకుంది. ఇందులో ఓ అగ్ర కథానాయికతో స్పెషల్ సాంగ్‌ను పెట్టేందుకు దర్శకుడు బోయపాటి ప్లాన్ చేస్తున్నారని సమాచారం. అల్లుఅర్జున్, వక్కంతం వంశీ దర్శకత్వంలో 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' చిత్రంలో నటిస్తున్నారు. ఎన్టీఆర్, చరణ్, బన్నీ ప్రస్తుతం చేస్తున్న ఈ సినిమాలు పూర్తయిన తర్వాత రాజమౌళి దర్శకత్వంలో నటించనున్నారు.

పవర్‌ఫుల్ గాయత్రి..

మోహన్‌బాబు ప్రధాన పాత్రలో 'గాయత్రి' చిత్రం తెరకెక్కుతుంది. మదన్ రామిగాని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మంచు విష్ణు, శ్రియా, నిఖిలా విమల్, అనసూయ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పతాకంపై అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో మోహన్‌బాబు నిర్మిస్తున్న చిత్రమిది. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుని 'యు/ఎ' సర్టిఫికెట్ పొందింది. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రమిది. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో సాగుతుంది. మోహన్‌బాబు ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. మోహన్‌బాబు ఇంటెన్స్ లుక్, శక్తివంతమైన సంభాషణలతో కూడిన ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇందులో మంచు విష్ణు మరో పవర్‌ఫుల్ రోల్ పోషిస్తున్నారు. ఆయనకు జోడీగా శ్రియా కనిపించనుంది. థమన్ సంగీతం అందించిన పాటలు శ్రోతలను అలరిస్తున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 9న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం' అని తెలిపింది. బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సర్వేష్ మురారి, ఎడిటర్: ఎం.ఆర్.వర్మ, ఆర్ట్: చిన్న.



మోహన్‌బాబు

కళ కళామందిర్ చీరే కట్టి...



సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి

సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లి పతాకంపై సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. ఎస్.ఎస్.థమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని మూడు పాటలు ఇప్పటికే విడుదలయ్యాయి. 'కళ కళ కళామందిర్ చీరే కట్టి' అనే నాలుగవ పాటను బుధవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కళామందిర్ షోరూమ్‌లో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వినాయక్ మాట్లాడుతూ, "కళ కళ కళామందిర్ చీరే కట్టి' అనే పల్లవి అనుకోకుండా వచ్చింది. కళామందిర్ షోరూమ్ ప్రసాద్, కళ్యాణ్ ఈ పాట విని చాలా సంతోష పడ్డారు. థమన్ మంచి ట్యూన్ కంపోజ్ చేశాడు. భాస్కరభట్ల ఫెంటాస్టిక్‌గా రాశాడు. పాట చాలా క్యాచీగా ఉంది. కచ్చితంగా సూపర్‌హిట్ అవుతుంది' అని అన్నారు. నిర్మాత సి.కళ్యాణ్ చెబుతూ, "చమక్ చమక్', 'లెట్స్ డు', 'నా సెల్‌ఫోన్' పాటలు చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. ఈ కళ కళ కళామందిర్ సాంగ్ లాస్ట్‌లో వస్తుంది. యూత్ అంతా డ్యాన్స్‌లు చేసేవిధంగా మంచి ఫాస్ట్‌బీట్‌తో సాగే పాట ఇది. ఎంతో ఖర్చుపెట్టి చాలా గ్రాండియర్‌గా చిత్రీకరించాం. కళామందిర్ షాపులో చీరలు ఎంత క్వాలిటీగా, రిచ్‌గా ఉంటాయో ఈ పాట కూడా అంతే క్వాలిటీతో ఉంటుంది. ఈనెల 4న రాజమండ్రిలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను జరుపనున్నాం. యదార్థ సంఘటనల ఆధారంగా పూర్తి స్థాయి వినోదాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఈ నెల 9న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నాం' అని చెప్పారు.



పూజా హెగ్డే

మహేష్‌కి జోడీగా..

పూజా హెగ్డే జాక్ పాట్ కొట్టింది. మహేష్‌బాబు సరసన నటించే లక్కీ ఛాన్స్‌ను సొంతం చేసుకుంది. వంశీపైడిపల్లి దర్శకత్వంలో మహేష్ నటించబోయే తదుపరి చిత్రంలో పూజా హెగ్డేను కథానాయికగా ఎంపిక చేసినట్టు దర్శకుడు వంశీపైడిపల్లి ట్వీట్ ద్వారా తెలియజేశారు. 'పూజాతో కలిసి వర్క్ చేయడం ఆనందంగా ఉంది' అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు. మహేష్ సరసన నటించే ఛాన్స్ రావడం పట్ల పూజా స్పందిస్తూ, 'నా తదుపరి తెలుగు చిత్రం మహేష్‌బాబు, వంశీపైడిపల్లి కాంబినేషన్‌లో చేస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. అందరం కలిసి ఓ అందమైన సినిమాను ప్రేక్షకులకు అందించేందుకు ఎదురు చూస్తున్నాం' అని ట్వీట్‌లో తన ఆనందాన్ని పంచుకుంది. మహేష్ ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'భరత్ అనే నేను' చిత్రంలో నటిస్తున్నారు. అనంతరం వంశీపైడిపల్లి దర్శకత్వంలో ఈ సినిమా చేయనున్నారు. పూజా హెగ్డే ప్రస్తుతం 'సాక్ష్యం', 'రేస్ 3'లో కథానాయికగా నటిస్తోంది. అలాగే 'రంగస్థలం' చిత్రంలోని ఓ ప్రత్యేక పాటలో మెరవనుంది.

బంధాలు ముఖ్యమని చెప్పే చిత్రం



జితన్ రమేష్, శృతి యుగల్

జితన్ రమేష్, శృతి యుగల్ హీరోహీరోయిన్లుగా ఎం.వెంకట్ దర్శకత్వంలో లార్డ్ వెంకటేశ్వర ఫిల్మ్స్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మిస్తున్న చిత్రం 'ఒక్కటే లైఫ్'. 'హ్యాండిల్ విత్ కేర్' అనేది ట్యాగ్‌లైన్. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ, 'సూపర్ గుడ్ అధినేత ఆర్.బి. చౌదరి తనయుడు జితన్ రమేష్ ఇందులో హీరోగా నటిస్తున్నారు. ఈ టైటిల్ చూడగానే సినిమా కాన్సెప్ట్ ఏంటో అర్థమవుతుంది. టెక్నాలజీ పేరుతో పరుగులెడుతోన్న నేటితరం హ్యూమన్ రిలేషన్స్‌కు ఎమోషన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్న కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న చిత్రమిది. సినిమాలోని ప్రతి పాత్రకు ఓ పర్పస్ ఉంటుంది. ప్రేక్షకుడికి ఓ మంచి సినిమా చూశామన్న ఫీలింగ్ కలుగుతుంది' అని అన్నారు. 'చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. మా టీమ్‌కు మంచి పేరును తీసుకొచ్చే చిత్రమవుతుంది.

అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని నిర్మాత నారాయణ్ రామ్ తెలిపారు. సుమన్ కీలక పాత్రలో, నల్లవేణు, జబర్దస్త్ రామ్, బాబి, రిషి, శ్యామ్, దిశ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు.

మన తిక్కను సంతృప్తి పరిచే సినిమా..

- 'అ' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకలో నాని



ఈషా, అనుష్క, నిత్యామీనన్, కీరవాణి, రాజమౌళి, ప్రశాంత్, నాని, కాజల్, ప్రియదర్శి, రెజీనా తదితరులు

"అ!' ట్రైలర్ చూడగానే సినిమా చూడాలనే ఆసక్తి ఏర్పడింది. తీసిన విధానం, ఆర్టిస్టులను చూస్తుంటే ఇదొక ట్రెండ్ సెట్టర్ సినిమా అవుతుందనిపిస్తుంది' అని రాజమౌళి అన్నారు. హీరో నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి త్రిపిరినేని నిర్మిస్తున్న చిత్రం 'అ!'. కాజల్, రెజీనా, నిత్యా మీనన్, ఈషా రెబ్బా, శ్రీనివాస్ అవసరాల, మురళీశర్మ, ప్రియదర్శి ప్రధాన పాత్రలు పోషించారు. ప్రశాంత్ వర్మ దర్శకుడు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక బుధవారం హైదరాబాద్‌లో జరిగింది.

గెస్ట్‌గా విచ్చేసిన రాజమౌళి మాట్లాడుతూ, 'ట్రైలర్ చూడగానే సినిమా సూపర్ హిట్ అవుతుందనిపిస్తుంది. నాని వరుసగా హిట్స్ కొడుతున్నాడు. ఆయన సినిమా అంటే కచ్చితంగా హిట్టే అన్న ఫీలింగ్ అందరికీ కలుగుతుంది. దీన్ని దాటి మరో స్టెప్‌కి వెళ్ళాలని కోరుకుంటున్నా. రెజీనా అందం, ఆకర్షణ, బోల్డ్‌నెస్‌తో ఆకట్టుకుంటుంది. ఈ సినిమాలో నటించిన అందరిని చూస్తుంటే చాలా ఆసక్తికరంగా ఉంది' అని అన్నారు. 'ఇందులోని పదకొండు పాత్రలు సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి. కచ్చితంగా అందరికి నచ్చే చిత్రమవుతుంది' అని అనుష్క చెప్పారు. నాని మాట్లాడుతూ, 'ఇదొక తిక్క సినిమా. మన అందరిలో ఉన్న తిక్కను సంతృప్తి పరిచే చిత్రం. ఈ సినిమాను నిర్మించడం వల్ల నిర్మాతలపై గౌరవం పెరిగింది. ప్రశాంత్ చెప్పిన కథ నాకు కొత్తగా అనిపించింది. ఈ కథను సరిగ్గా హ్యాండిల్ చేసే నిర్మాత కావాలనిపించి నేనే ప్రొడ్యూస్ చేయడానికి సిద్ధమయ్యా. ఇప్పటి వరకు నేను సంపాదించినదంతా సినిమాల వల్లే. ఈ డబ్బుని సినిమాలపై పెట్టేందుకు నేను సిద్ధంగా ఉన్నా. ఇలాంటి ఐడియాను నేను సపోర్ట్ చేయకపోతే మంచి కథలు రావనిపించి నిర్మాతగా మారా. దీనికి వర్కింగ్ టైటిల్ 'అ!' అనుకున్నాం. అక్షరాలు దిద్దించడానికి ముందు అ అక్షరాన్ని రాయిస్తారు. ప్రశాంత్‌కి దర్శకుడిగా, నాకు నిర్మాతగా మొదటి సినిమా. అందుకే ఈ టైటిల్‌నే ఫిక్స్ చేశాం. ఇందులో నిత్యా మీనన్ పాత్ర సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. అలాంటి పాత్రను ఎవరూ చేయరనిపించింది. ప్రియదర్శి దేనికైనా సెట్ అవుతాడు, అందుకే చెఫ్‌గా పెట్టాం. రెజీనా తన పాత్ర కోసం హెయిర్ స్టయిల్‌నే మార్చేసింది. ముందు చేయదేమో అనుకున్నా. ఇలాంటి లుక్‌తో ఓ ఫొటో పంపిస్తే నేనే షాక్ అయ్యా. ఈషాది బ్యూటిఫుల్ రోల్. రవితేజ అన్న కథ విని వాయిస్ ఓవర్ ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. దర్శకుడు ప్రశాంత్ కథ రాసుకున్నప్పుడు కాజల్‌ను అనుకున్నాడు. ఆమె బిజీగా ఉన్నప్పటికీ తను నటించిన పాత్రను తానే చేస్తానని చెప్పి చేసింది. అవసరాల శ్రీనివాస్, మురళీ శర్మ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. ప్రశాంత్ సినిమాను తీసే విధానం చూస్తే ఇది తన తొలి చిత్రమంటే ఎవరూ నమ్మరు. ఇలాంటి టాలెంటెడ్ డైరెక్టర్‌ను నేను పరిచయం చేయడం గర్వంగా ఉంది. సినిమా చూశా. గర్వించేలా ఉంది' అని తెలిపారు.

'నేను చేసిన లఘు చిత్రం చూసి ఇలాంటి కాన్సెప్ట్ ఉంటే నాకే చెప్పు అని నాని అన్నారు. ఈ చిత్రంలో చేపకు వాయిస్ ఓవర్ కోసం తిరుగుతున్నప్పుడు కథ విని నిర్మించడానికి ముందుకు వచ్చారు. నాని రావడంతో పెద్ద సినిమా అయిపోయింది. నాని నా వర్క్‌లో ఇన్‌వాల్వ్ కాలేదు. బెటర్‌మెంట్ కోసం కొన్ని సలహాలిచ్చారు. మేం అనుకున్న దానికంటే బడ్జెట్ ఎక్కువే అయ్యింది. ఇదొక గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. నిజాయితీతో సిన్సియర్‌గా చేసిన ప్రయత్నమిది. ఫిబ్రవరి 16న సినిమా విడుదలకానుంది. ఈ ప్రయత్నాన్ని ఆదరిస్తే మరిన్ని ఒరిజినల్ కాన్సెప్ట్ చిత్రాలు చేయడానికి ట్రై చేస్తా' అని దర్శకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజల్, నిత్యామీనన్, రెజీనా, ఈషా, కీరవాణి, ప్రియదర్శి, మురళీశర్మ తదితరులు పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు.



ఆశాభోంస్లే

మరో అరుదైన పురస్కారం..

ప్రముఖ నేపథ్య గాయని ఆశాభోంస్లేకు మరో అరుదైన గౌరవం లభించింది. ప్రతి ఏటా టి.సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ అందజేసే ప్రతిష్టాత్మక నేషనల్ యశ్‌చోప్రా మెమోరియల్ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. బోనీకపూర్, మధుర్ భండార్కర్, హనీ ఇరానీ, పద్మినీ కొల్హాపురి, సుబ్బరామిరెడ్డి వంటి తదితర ఫౌండేషన్ జ్యూరీ సభ్యులు ఆశాభోంస్లేను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. గతంలో లతామంగేష్కర్, అమితాబ్ బచ్చన్, రేఖ, షారూఖ్‌ఖాన్ వంటి హేమా హేమీలు ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారు. ఫిబ్రవరి 16వ తేదీన ముంబయిలో జరిగే అవార్డు ప్రదానోత్సవంలో మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు, లతా మంగేష్కర్ సంయుక్తంగా ఈ అవార్డును ఆశాభోంస్లేకు అందజేయనున్నారు. అమితాబ్ బచ్చన్, అమీర్‌ఖాన్, షారూఖ్‌ఖాన్, శ్రీదేవి, జయప్రద వంటి తదితర బాలీవుడ్ అతిరథ మహారథులందరూ ఈ వేడుకలో పాల్గొనబోతున్నారు.

డిటెక్టివ్ థ్రిల్లర్‌లో..

నూతన దర్శకుడు వర్మిక్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కుట్రాప్పయిర్చి' చిత్రంలో త్రిష, ప్రియమణి నటిస్తున్నారు. 1980లో జరిగిన ఓ మర్డర్ మిస్టరీ నేపథ్యంలో డిటెక్టివ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ కేసును డీల్ చేసిన ఇండియన్ ఫస్ట్ లేడీ డిటెక్టివ్ రజని పండిట్ పాత్రలో త్రిష నటిస్తోంది. ఇందులో ప్రియమణి పాత్ర ఏంటనేది ఆసక్తికరం. త్రిష ప్రస్తుతం 'మోహిని', 'గర్జనై', 'సతురంగ వెట్టై 2', '1818', 'హే జుడే', '96', 'పరమపథం విలయట్టు' చిత్రాల్లో నటిస్తుండగా, ప్రియమణి 'దశరథ', 'వ్యూహ', 'నన్నా ప్రకార', 'ధ్వజ' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



ప్రియమణి, త్రిష

కార్పొరేట్లకు వరం.. ప్రజలకు అదనపు భారం

న్యూఢిల్లీ: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి పూర్తిస్థాయి బడ్జెట్ మరలా విదేశీ, స్వదేశీ బడా కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేర్చేలాగే ఉందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ బడ్జెట్ దేశంలోని అధిక సంఖ్యలో ప్రజలపై అదనపు భారం మోపేవిధంగా ఉందని తెలిపింది. అయితే ఈ భారాన్ని మసిపూసి మారేడు కాయ చేసినట్టుగా ప్రజలకేదో మంచి జరుగుతుందన్నట్టుప్రచారం చేస్తున్నారని పేర్కొంది. 2017లో సృష్టించబడ్డ అదనపు సంపదలో 73 శాతం దేశంలోని ఒక్క శాతం ధనవంతుల దగ్గరే పోగుపడ్డదన్న వాస్తవం ఉన్నప్పటికీ బడ్జెట్‌లో ఈ ధనవంతులపై ప్రత్యక్ష పన్నులు వేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని భావించలేదని, అందుకు విరుద్ధంగా సామాన్య ప్రజలకు భారంగా పరిణమించే పరోక్ష పన్నులపై ప్రభుత్వం మరింత ఆధారపడిందని పేర్కొంది. వాస్తవానికి కేంద్ర పన్నుల వాటాలో ప్రత్యక్ష పన్నుల వాటా 51.6 శాతం నుంచి 50.6 శాతానికి తగ్గిపోయిందని తెలిపింది. ఈ బడ్జెట్ పేదలకు అనుకూలమని, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి అధిక నిధులు కేటాయించిందని, జాతీయ ఆరోగ్య పథకం కింద ఏడాదికి ఐదు లక్షల చొప్పున పది కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా కల్పిస్తున్నదంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. అయితే ఆరోగ్య పథకం కొత్తదేమీ కాదని, అదనంగా ఒక్కపైసా కూడా దీనికి కేటాయింపులు చేయలేదని సీపీఐ(ఎం) తెలిపింది. ఈ పథకం కూడా బీమా కంపెనీలకు అధిక లాభాలను చేకూర్చేదేనని చెప్పింది. అనుభవాలను పరిశీలిస్తే ఆరోగ్య బీమా కానీ, పంటల బీమా కానీ కార్పొరేట్లకే లాభాలను పంచాయి తప్ప సామాన్యులకు కాదని తెలిపింది.

ఈ బడ్జెట్ ఉపాధి అవకాశాలను, సంక్షేమ కార్యక్రమాలపైన ఖర్చును మరింత తగ్గిస్తుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పేర్కొంది. జాతీయ స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో ప్రభుత్వ వ్యయం 13.2 శాతం నుంచి 13 శాతానికి తగ్గిపోయిందని తెలిపింది. గత ఏడాది కేంద్ర సామాజిక పథకాలపై పెట్టుబడి వ్యయం బడ్జెట్‌లో పెట్టుకున్న లక్ష్యాల కన్నా తక్కువగా ఉందని, దీనివల్ల ద్రవ్యలోటు తగ్గింపు లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రజాసంక్షేమంపై పెట్టే ఖర్చులో కోత విధించారని తెలిపింది. లక్ష్యాల కన్నా పన్నుల ఆదాయం వసూళ్లు తక్కువగా ఉండటంతో ప్రభుత్వ ఖర్చులను తగ్గించుకుందని, దీంతో ప్రజా జీవనంపై చెడు ప్రభావం పడిందని తెలిపింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిపై ఖర్చు జీడీపీలో 1.15 శాతం నుంచి 1.08 శాతానికి తగ్గిపోయిందని, మొత్తం ఆరోగ్య రంగం వ్యయం జీడీపీలో 0.32 శాతం నుంచి 0.29 శాతానికి పడిపోయిందని, విద్యపై కేంద్ర ఖర్చు 0.49 శాతం నుంచి 0.45 శాతానికి తగ్గిపోయిందని, మహిళా సంక్షేమ బడ్జెట్ జీడీపీలో 0.68 శాతం నుంచి 0.65 శాతానికి పడిపోయిందని, ఎస్సీ సంక్షేమానికి కేటాయింపులు 1.6 శాతం కాగా, ఎస్టీలకు కేటాయింపు 2.32 శాతం మాత్రమేనని, వీరి జనాభాతో పోల్చుకుంటే కేటాయింపులు చాలా అత్యల్పమని పేర్కొంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేటాయింపుల్లో ఏ మార్పు లేదని, పైగా గత ఏడాది బకాయిలు రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించాల్సి ఉందని తెలిపింది.

పంట రుణాల పెంపు లాంటి ఇతర అంశాలకు కూడా బడ్జెట్‌లో నిర్దిష్టమైన కేటాయింపులు లేవని పేర్కొంది. రైతులకు మద్దతు నిచ్చేట్టుగా గానీ, ఆహార భద్రత చట్టాన్ని అమలు చేసేట్టుగా గానీ ఆహార సబ్సీడీకి, ధాన్యం సేకరణకు కేటాయింపులు లేవని పేర్కొంది. అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు ఉపశమనం కల్గించే రుణ మాఫీ గురించి బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేదని అన్నారు. మధ్య తరగతి ప్రజలకు నేరుగా ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని, కానీ వారి ఆదాయాలను గండిపడే అవకాశాలు కనిపిస్తున్నాయని తెలిపింది. పెట్రోల్, డీజిల్ పైన రెండు రూపాయలు తగ్గించినప్పటికీ సెస్ పెంచడం వల్ల లీటర్‌కు ఆరు నుంచి ఎనిమిది రూపాయల అదనపు భారం పడుతోందని తెలిపింది. మొత్తంగా ప్రజలను మభ్య పెట్టేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రచార జిమ్మిక్కు ఈ బడ్జెట్ అని పేర్కొంది. వ్యయాల్లో ఉన్న వైరుధ్యాలు, ప్రభుత్వ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ, అంతర్జాతీయ ఫైనాన్స్‌ను సంతృప్తి పరిచేందుకు ద్రవ్యలోటును తగ్గించేందుకేనని, ఈ కారణంగా భారత ప్రజలపై అధిక భారాలు పడనున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ కారణంగా అసలే కష్టాల్లో ఉన్న ప్రజలను మరింత కష్టాల్లోకి నెట్టేట్లుగా ఉన్న ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ తమ పార్టీ అన్ని శాఖలు దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది.

సామాజిక న్యాయాన్ని చేకూర్చే బడ్జెట్: మోడీ

మా ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని మాటల్లో కాదు చేతల్లో చూపెడుతుందనేదానికి నిదర్శనమే ఈ బడ్జెట్. ఈ బడ్జెట్ పేదలు, రైతుల పక్షాన ఉన్నది. ఉపాధి పెంచేందుకు తోడ్పడేలా రూపొందించామన్నారు. ఆరోగ్య బీమా పథకాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక భద్రతను కల్పించే కార్యక్రమంగా అభివర్ణించారు. ఈ బడ్జెట్ తమ ప్రభుత్వానికి పండుగని తెలిపారు.

నాలుగేండ్లు గడిచినా...: రాహుల్ గాంధీ

నాలుగేండ్లు గడిచాయి... రైతులకు మద్దతు ధర పై వాగ్దానాలు ఇస్తూనే ఉన్నారు. బడ్జెట్‌తో సంబంధం లేని భ్రమలు కలిగించే పథకాలు ప్రవేశపెడుతూనే ఉన్నారు. యువతకు ఉద్యోగాలు లేవు. అదృష్టవశాత్తు ఇంకా ఒక్క ఏడాదే ఉంది.

రైల్వే చెవిలో పువ్వు

నవతెలంగాణ-సిటీబ్యూరో

దక్షిణమధ్య రైల్వేకు కేంద్రం మళ్లీ మొండిచేయే చూపింది. కొత్త మార్గాలు, కొత్త రైళ్ల కేటాయింపులు, కొత్త ప్రాజెక్టుల ఊసే ఎత్తలేదు. కాజీపేటలో ఏర్పాటు చేయదలచిన కోచ్‌ఫ్యాక్టరీ, కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేయదలచిన వ్యాగన్ ఫ్యాక్టరీల గురించి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు. పైగా, సికింద్రాబాద్‌కు రైల్వే యూనివర్సిటీని ప్రధాని నరేంద్రమోడీ స్వరాష్ట్రంలోని వడోదరకు తన్నుకుపోయారు. నిధుల కొరతతో మందకొడిగా సాగుతున్న ఎంఎంటీఎస్- ఫేస్ 2కు కేటాయింపులే లేవు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోకి వచ్చే తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన ప్రజా ప్రతినిధులు ఇటీవల తమ తమ ప్రాంతాల్లో కొత్త రైల్వే లైన్లు, ప్రాజెక్టులు, వంతెనలు, కొత్త రైళ్ల కేటాయింపుల విషయంలో జనరల్ మేనేజర్‌కు లేఖలు అందించినప్పటికీ కేంద్రం వారి విజ్ఞప్తులను పట్టించు కోలేదు. ప్రజా ప్రతినిధులు ఇచ్చిన విజ్ఞప్తులను కేంద్రం బుట్టదాఖలు చేసింది. దీంతో ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రజా ప్రతినిధులు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని రైల్వేకు కేటాయింపులపై పెదవి విరిచారు. ప్రజా ప్రతినిధులే కాకుండా దక్షిణ మధ్య రైల్వే అధికారులు కూడా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. బడ్జెట్‌లో మాచర్ల-రాయిచూర్ కొత్త రైల్వే మార్గం ఊసే ఎత్తలేదు. ఈ రైల్వే లైన్ సర్వే జరిగి దాదాపు ఇరవై ఏండ్లు గడుస్తున్నా నిధుల కేటాయింపులు మాత్రం జరగలేదు. హైదరాబాద్-శ్రీశైలం మార్గం గురించి ప్రస్తావించలేదు. కాచిగూడ-మహబూబ్‌నగర్ మధ్య నత్తనడకన సాగుతున్న డబ్లింగ్ పనులకు నిధుల కొరత ఏర్పడి పనులు ఆలస్యం జరుగుతున్నా లైన్ నిర్మాణం పూర్తిచేసేంత వరకు నిధులు మాత్రం కేటాయించలేదు. ఇంటర్‌సిటీ, జనసాధారణ్ రైళ్లు, హైస్పీడ్, సెమీ బుల్లెట్ రైళ్ల ప్రస్తావన రాకుండా చేశారు. సికింద్రాబాద్, తిరుపతి, విజయవాడ రైల్వే స్టేషన్లను వరల్డ్‌క్లాస్ రైల్వే స్టేషన్లుగా మార్చేందుకు నిర్ణయించిన ప్రతిపాదనల గురించి అసలు ప్రస్తావించనేలేదు. బెంగుళూరు-సికింద్రాబాద్, తిరుపతి-కాచిగూడ మార్గాల్లో డబ్లింగ్ ఊసే ఎత్తలేదు. అనేక మార్గాల్లో మూడోలైన్ నిర్మాణాల గురించి పట్టించుకోలేదు. ఈ ఏడాది చివరి నాటికల్లా తెలుగు రాష్ట్రాలు, కర్నాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న అన్ని లెవెల్ క్రాసింగ్‌లను తొలిగించి వాటి స్థానంలో వంతెనల నిర్మాణం చేపట్టనున్నట్టు మాత్రం ప్రకటించి నిధులు కేటాయించారు. కరీంనగర్ జిల్లాపెద్దపల్లి- లింగంపేట మార్గంలో 83 కిలోమీటర్లు, నల్లగొండ-లింగంగుంట మార్గంలో 129 కిలోమీటర్లు, గుంతకల్-కల్లూరు మార్గంలో 40 కిలోమీటర్లు, మేరకు విద్యుదీకరణ చేయనున్నట్టు కేంద్రం ప్రకటించింది. రద్దీ ఎక్కువగా ఉండే రైల్వే స్టేషన్లలో పాదచారుల వంతెనలకు బదులుగా ఎస్కలేటర్లను నిర్మించాలని నిర్ణయించారు. తుని రైల్వే క్రాసింగ్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి నిధులు కేటాయించింది. అలాగే కోటిపల్లి-నరసాపుం రైల్వే లైన్‌కు ఇప్పటి వరకు రూ.1080 కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో రూ.430 కోట్లు కేటాయింపులు జరిగాయి. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వేలైన్‌కు రూ.450 కోట్లు, విజయవాడ-కాజీపేట మూడోలైన్‌కు వంద కోట్లు కేటాయించారు. దువ్వాడ- రాజమహేంద్ర వరం-ఒంగోలు-విజయవాడ రైల్వే స్టేషన్ల ఆధునీకరించాలని ఈ బడ్జెట్‌లో సంకల్పించారు. ఓబులవారిపల్లె-వెంకటాచలం మధ్య 95 కిలోమీటర్ల మేరకు కొత్త రైలు మార్గం ఏర్పాటు, దేవరపల్లి-పెనుగొండ మార్గంలో 49 కిలోమీటర్ల మేరకు డబ్లింగ్ పనులకు కేంద్రం పచ్చజెండా ఊపింది.

రైల్వే వర్సిటీని వడోదరకు తన్నుకుపోయిన మోడీ

- కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ ఊసే లేదు
- డబ్లింగ్, మూడోలైన్ల ప్రస్తావనేలేదు
- కొత్త రైలు మార్గాలు, రైళ్ల కేటాయింపులు లేవు
- కేంద్ర నిర్ణయంపై ప్రజాప్రతినిధుల పెదవి విరుపు

ఆశలు ఆవిరి...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరుసగా ఐదోసారి తెలంగాణ సర్కారు ఆశలు ఆవిరయ్యాయి. గత నాలుగేండ్లుగా రాష్ట్రానికి మొండి చేయి చూపిన మోడీ ప్రభుత్వం.. ఈసారి కూడా అదే విధంగా వ్యవహరించింది. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయతోపాటు ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆర్థిక సాయం చేయాలంటూ కేసీఆర్ ప్రభుత్వం మొరపెట్టుకున్నప్పటికీ కేంద్ర విత్తమంత్రి అరుణ్‌జైట్లీ పట్టించుకోలేదు. తెలంగాణలో పరిశ్రమల స్థాపన, మౌలిక వసతుల కల్పనతోపాటు కీలకమైన విద్యారంగానికి చేయూతనిచ్చేందుకు అవసరమైన నిధులను కూడా కేంద్రం ప్రతిపాదించలేదు. జీఎస్టీ అమలు తర్వాత కేంద్ర పన్నుల్లోంచి రాష్ట్ర వాటాగా రావాల్సిన రూ.19,207 కోట్లు మాత్రమే మనకు దక్కనున్నాయి. ఇవిగాకుండా ఇతర సాయాల (గ్రాంట్స్ ఇన్ ఎయిడ్స్) రూపంలో మరో రూ.2 వేల కోట్ల వరకు రావచ్చన్నది ఆర్థికశాఖ వర్గాల అంచనా. మొత్తంగా చూస్తే 2018-19 ఆర్థిక సంవత్సరానికి అరుణ్‌జైట్లీ ప్రతిపాదించిన బడ్జెట్.. తెలంగాణ ఆశించింది కొండంత.. కేంద్రం విదిల్చింది గోరంత అన్న చందంగా తయారైందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కేంద్ర బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ ప్రజలపై ఎలాంటి ముద్రా వేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.19 వేల కోట్లు, మిషన్ భగీరథకు రూ.5 వేల కోట్లు, మిషన్ కాకతీయకు రూ.10 వేల కోట్ల మేర ఆర్థిక సాయం చేయాలంటూ నిటి అయోగ్ కేంద్రానికి సూచించిందని గుర్తుచేశారు. వీటిని కూడా పెడచెవిన పెట్టటం దారుణమన్నారు. వ్యవసాయం, విద్య, పేదల వైద్య బీమా తదితర అంశాలు తప్ప మిగతా వాటిపై కేంద్రం దృష్టి సారించకపోవటం బాధాకరమని అన్నారు.

తెలంగాణకు కేంద్రం నుంచి వచ్చే నిధులు (2018-19) (రూ.కోట్లలో)

కేంద్ర పన్నుల వాటా	19,207
కేంద్ర ప్రాయోజిత పథకాలు	8,333
14వ ఆర్థిక సంఘం నిధులు	2,768
మొత్తం	30,308

కార్పొరేట్ గారడీ

నవతెలంగాణ, వాణిజ్య విభాగం:

కార్పొరేట్ల ఛాయలో సామాన్య ప్రజలకు మేలు చేస్తున్నమన్న భ్రమ కలిగించేలా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 1, 2018 నుంచి ప్రారంభంకానున్న ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ఆయన గురువారం ఉదయం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సాహోసోపేత సంస్కరణలుగా చెప్పుకునే వస్తు సేవల పన్ను (జీఎస్టీ), పెద్ద నోట్ల రద్దు అమలు చేసినా అనుకున్న విధంగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడరలేదు. ఈ నిర్ణయాల వలన పారిశ్రామిక, తయారీ, రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలు ఒకటేమిటి అన్ని రంగాలూ కుదేలయ్యాయి. అయినా సరే 'కింద పడ్డా తనదే పైచేయి అన్నట్టు' భారీ అంచనాలతో రూ.21.47 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించి ప్రజలను మోసం చేసింది. దాదాపు రూ.17,25,738 కోట్ల రెవెన్యూ వసూళ్లు.. రూ.7,16,475 కోట్ల మూలధన వసూళ్లను కలుపుకొని మొత్తం రూ.24,42,213 కోట్ల ఆదాయపు పద్దుతో జైట్లీ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం విడ్డూరం. బీజేపీ సర్కారుకు భజన చేసే కుహనా ఆర్థిక వేత్తలు, అనుకూల మీడియా మాత్రమే బడ్జెట్‌ను అమోఘమని కీర్తిస్తున్నది. ఇప్పటి వరకు మోడీ ప్రభుత్వం నాలుగు బడ్జెట్లు తీసుకొచ్చింది. ప్రస్తుత 2018-19 బడ్జెట్ ఈ సర్కారు హయాంలో చివరి పూర్తి స్థాయి బడ్జెట్. దీనిలోనైనా వాస్తవ ప్రజా సంక్షేమ కోణం వెలుగు చూస్తుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. పలు సందర్భాల్లో ప్రధాని, విత్త మంత్రి తమ బడ్జెట్‌లో జనాకర్షక పథకాలుండవని సుస్థిర అభివృద్ధి తమ లక్ష్యమని చెబుతూ వచ్చారు. చివరికి ఆ మాటపై కూడా నిలవలేదు. అనుకూల అంశాలను భూతద్దంలో చూపుతూ.. ప్రతికూల అంశాలను అంతగా టచ్ చేయకుండా ఆర్థిక మంత్రి చాలా తెలివిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్టే ఇట్టే అర్థమవుతోంది. గత నాలుగేండ్లుగా ఆర్థిక సంస్కరణలు, పన్నుల తగ్గింపులు, మధ్య తరగతికి రాయితీల చుట్టూ తిరిగిన బడ్జెట్ ఒక్కసారిగా ఈ ఏడాది తన దిశను మార్చుకొని సామాన్యుడి సంక్షేమానికి భారీ చర్యలు తీసుకునే దిశగా అడుగులేయడం విశేషం. అయితే ఇందులోనూ అత్యధిక కేటాయింపులు పేదల మాటున పెద్దలకే లబ్ధి చేకూర్చేలా ఉండడం విశేషం. మరోవైపు గతంతో పోలిస్తే వ్యవసాయం, ఆరోగ్యం, సంక్షేమం తదితర అన్ని కీలక రంగాలకు భారీగా కేటాయింపులు జరిపినట్టుగా చెబుతున్నా.. మొత్తం బడ్జెట్‌తో పోలిస్తే గతంలో కంటే ఆయా రంగాలకు తక్కువ మొత్తంలోనే నిధుల కేటాయింపులు జరిగినట్టుగా గణాంకాలు వివరిస్తున్నాయి. ద్రవ్యలోటును తగ్గించే పేరుతో ఎన్‌డిఎ సర్కారు ప్రజల ఉపాధి, సంక్షేమానికి కోతలు పెట్టింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి నిరుడు జీడీపీలో 1.15 శాతం కేటాయించగా ఈసారి 1.08 శాతానికి తగ్గించారు. విద్య కేటాయింపుల్లో 0.49 శాతం నుంచి 0.45 శాతానికి కత్తెర పడింది. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు వారి జనాభా దామాషాకు సుదూరంలో కేటాయింపులున్నాయి. ఆరోగ్య బీమాను రూ.5 లక్షలకు పెంచినా అందుకు తగ్గట్టు నిధులు చూపలేదు. ప్రైవేటు బీమా సంస్థలకు ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకే ఆరోగ్య, పంటల బీమా వగైరాలు. రైల్వే ఆదాయాన్ని బొక్కసంలో వేసుకోవడం తప్ప ఆ శాఖకు సముచిత కేటాయింపుల్లేవు. ప్రయాణీకుల భద్రతను విస్మరించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, పలు రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆహ్వానం వంటివి మరింతగా 'సంస్కరణ'లను పరుగులు పెట్టించనున్నాయి. కార్పొరేట్ పన్ను తగ్గించిన సర్కారు వేతన జీవుల పన్ను శ్లాబులను సవరించలేదు. చమురు ధరలపై ఆర్థిక సర్వేలో ఆందోళన వ్యక్తపర్చగా బడ్జెట్‌లో ఆ విషయాన్ని కప్పిపెట్టింది

అత్యధికం లబ్ధి బడాబాబులకే..

కార్పొరేట్ రంగానికి పరోక్షంగా మేలు చేస్తూనే రైతులు మెచ్చేలా.. సామాన్యులకు నచ్చేలా ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, గ్రామీణ భారతానికి అధిక ప్రాధాన్యమిచ్చామని జైట్లీ చెప్పుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.14.34 లక్షల కోట్లు కేటాయించారు. దీని ద్వారా ప్రజలతో పెద్దపెద్ద నిర్మాణ సంస్థలకు మౌలిక రంగలోని కార్పొరేట్ సంస్థలకు భారీగా లబ్ధి కలుగనుంది. అదనపు బడ్జెట్, బడ్జెటేతర వనరులతో కలిపి ఈ కేటాయింపులు చేసినట్టు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే లక్ష్యంగా ఈ ప్రణాళికలు రచించారు. గ్రామీణ సడక్ యోజన కింద 3.17 లక్షల కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో పాటు 51 లక్షల కొత్త ఇండ్లు, 1.88 కోట్ల మరుగుదొడ్లు నిర్మించనున్నారు.

పథకాల ప్రకటన సరే వాటికి పైసలేవీ..

2018-19 బడ్జెట్‌లో వ్యవసాయం, గ్రామీణ అభివద్ధికి మోడీ పెద్దపీట వేసినట్టుగా జైట్లీ అంకెల గారడి చేశారు. అంతేగాక.. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) పథకం కోసం ఈ బడ్జెట్‌లో రూ.5,750కోట్లు కేటాయించారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు స్వయం సహకార సంఘాలకిచ్చే రుణాలను వచ్చే ఏడాది మార్చి కల్లా రూ. 75వేల కోట్లకు పెంచనున్నట్టు తెలిపారు. ఉజ్వల యోజన కింద 8 కోట్ల మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్లు అందిస్తామని ప్రకటించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 5లక్షల వైఫై హాట్‌స్పాట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ ప్రాంతాల్లో 51 లక్షల ఇండ్లను, గ్రామీణ పారిశుద్ధ్యానికి రూ.16,713 కోట్లు, విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి రూ.1.38 లక్షల కోట్లు, ఇంటింటికి తాగు నీటి పథకానికి రూ.77,500 కోట్లు, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా రూ.1200 కోట్లతో పేదల కోసం ఆరోగ్య కేంద్రాలు, నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీమ్ కింద 50 కోట్ల మందికి ఆరోగ్య భద్రత కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమాను వర్తింప చేస్తున్నట్టుగా జైట్లీ బడ్జెట్‌లో వెల్లడించారు. అయితే ఇవన్నీ మాటల మూటలనే చెప్పొచ్చు, ఎందుకంటే ఇప్పటికీ ఆదాయం కంటే వ్యయం పెరిగిపోయి ఇబ్బందుల్లో ఉన్న సర్కారు భారీగా ప్రకటించిన ఈ పథకాలకు నిధులను ఎక్కడి నుంచి తెస్తుందన్నది ప్రశ్నార్థకం. బడ్జెట్‌లో వాటికి సరిపడా కేటాయింపులు లేకపోవడంతో ఆయా పథకాల అమలు ప్రశ్నార్థకమేనని తెలుస్తోంది. ఇప్పటికే ఆర్థిక స్థిరీకరణలో విఫలమైన ప్రభుత్వం ప్రజల బాగు కోసం మరింత ధైర్యం చేసి ఈ పథకాలను అమలులో చేసేందుకు రుణాలుగా డబ్బులు తెచ్చే అవకాశం లేదు.

ఎన్నికల కోసమే అన్నదాత స్మరణా..

ఊహించినట్టుగానే ఈ సారి కేంద్ర ప్రభుత్వం రైతులకు వరాల జల్లు కురిపించింది. ఉత్పత్తి ధరకంటే 1.5 రెట్లు అధికంగా కనీస మద్దతు ధర లభించేలా చర్యలు చేపడుతున్నట్టుగా జైట్లీ ప్రకటించారు. వ్యవసాయ ఉత్పత్తులకు మరింత ఊతమిచ్చేందుకు రూ.500 కోట్లతో హరిత ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. మార్కెట్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ కనీస మద్దతు ధరపై పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు, నిటి అయోగ్ మధ్య సంప్రదింపుల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. 2022 నాటికల్లా రైతుల ఆదాయం రెట్టింపు అయ్యే విధంగా ప్రభుత్వం దష్టి పెట్టనున్నట్టు ప్రకటించారు. ఫుడ్ ప్రాసెసింగ్ కోసం నిధులను రూ.700 కోట్ల నుంచి రూ.1400 కోట్లకు పెంచినట్టు ప్రకటించారు. దీనికి తెర వెనుక అసలు కారణాలు వేరేగా ఉన్నాయి. ఈ ఏడాది రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్నాటక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ జాబితాలో మొదటి మూడు రాష్ట్రాల్లో భాజపా అధికారంలో ఉంది. దీంతో పాటు మూడు రాష్ట్రాల్లో వ్యవసాయమే ప్రధాన వత్తి. ఈ అంశాలను దష్టిలో పెట్టకున్న భాజపా రైతు భారతంపై మొగ్గుచూపి వుండవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 1.5 రెట్ల మేర అధిక మద్దతు ధరకు చర్యలు చేపట్టనున్నట్టుగా ఎన్నికల ప్రచారం మొదలు కొని అధికారంలోకి వచ్చాక చాలా సారు జైట్లీ ప్రకటించారు. అది ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అమలు కాలేదు. దేశంలో రైతుల ఆత్మహత్యలు ఏటా 12,600లకు చేరడమే ప్రత్యక్ష నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు.

ఎగుమతలు సరే.. దిగుమతుల మాటేమిటి..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల్లో 15% వృద్ధిని ఆశిస్తున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించిన జైట్లీ.. ఇదే కాలంలో పెరిగిన దిగుమతుల విషయాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం గమనార్హం. ఇదే సమయంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలో భారత్ 42 ర్యాంకులు ముందుకు సాగి మొదటి 100 ర్యాంకింగ్‌లలో స్థానం సంపాదించుకున్నట్టుగా జైట్లీ వెల్లడించారు. అయితే ఇదే సమయంలో ప్రజల జీవన ప్రమాణాలకు అద్దం పట్టే ఆకలి, పేదరికంతో వంటి అంశాల్లో భారత ర్యాంకింగ్ మరింత దిగజారడాన్ని జైట్లీ బడ్జెట్‌లో ప్రకటించకపోవడం గమనార్హం. ఇదే సమయంలో ఆర్థిక మంత్రి జైట్లీ సామాన్యులను కూడా బడ్జెట్‌లో నిరుత్సాహ పరిచారు. ఆదాయపు పన్ను మినహాయింపులతో మెప్పిస్తారని ఆశించిన వేతన జీవులకు ఈ బడ్జెట్‌లో నిరాశే ఎదురైంది. పన్ను శ్లాబ్‌లలో ఎలాంటి మార్పును జైట్లీ ప్రతిపాదించలేదు. కేవలం రూ.40వేల స్టాండర్డ్ డిడక్షన్‌తోనే ఈ పద్దును ముగించారు. కార్పొరేట్‌లకు మేలు చేసేందుకు అంతర్గతంగా తీవ్ర కసరత్తు చేసిన సర్కారు సామాన్యులకు వేతన జీవులకు ఇప్పటికిప్పుడు మేలు కలిగించేలా ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం విశేషం.

కాగితం మీద లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద 2019నాటికి కోటీ గృహాల్ని నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంలో సగం కూడా సాధించలేదు. మిగతా సగం మార్చి, 2019నాటికి పూర్తవుతుందని కేంద్రం తెలపటం హాస్యాస్పదం.

గ్రామీణాభివృద్ధికి కేటాయింపులు ఈ రకంగా ఉన్నాయి

- పల్లెల్లో జీవనోపాధి, రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.9.64 లక్షల కోట్లు
- మహాత్మా గాంధీ ఉపాధి హామీ కింద రూ.55 వేల కోట్లు.
- గ్రామీణ పారిశుద్ధ్య పథకానికి రూ.16,713 కోట్లు
- విద్యారంగంలో మౌలిక సౌకర్యాలకు రూ.లక్ష కోట్లు
- గ్రామసడక్ యోజన కింద 2022 నాటికి అన్ని గ్రామాల్లో పక్కా రోడ్ల నిర్మాణం
- ఉజ్వల యోజనలో భాగంగా 8 కోట్ల మంది గ్రామీణ మహిళలకు గ్యాస్ కనెక్షన్లు
- గ్రామీణ వ్యవసాయ మార్కెట్లకు రూ.2000 కోట్లు. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం.
- సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లకు కార్పస్ ఫండ్‌ను రూ.75 వేల కోట్లకు పెంచారు.
- కరువుతో బాధపడుతున్న 96 జిల్లాల్లో నీటిపారుదల కోసం రూ.2,600 కోట్లు.

హెచ్‌సీయూలో ఏబీవీపీ నేతపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. గతేడాది నవంబర్ 25న హిస్టరీ విభాగం పరిశోధక విద్యార్థి పల్సానియా "బాస్టర్డ్ లక్ష్మీనారాయణ.."తో మొదలుపెట్టి ప్రొఫెసర్ వ్యక్తిత్వంపై, బోధనపై తీవ్ర అసభ్యకర పదాలతో ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేశారు. దీనిపై అదే నెల30న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ..వీసీ అప్పారావుకు ఫిర్యాదు చేశారు. రెండునెలలకు పైగా ఈ ఘటనపై విచారణ జరిపిన వర్సిటీ అధికారులు ఏబీవీపీ జాతీయ నేతగా ఉన్న పల్సానియా బూతులతో కూడిన పోస్టింగ్ చేయడాన్ని తప్పుబడుతూ చర్యలు తీసుకున్నారు. కాగా పల్సానియా శిక్ష తగ్గించాలనీ ప్రొక్టోరల్‌బోర్డుకు అప్పీల్‌కు వెళ్లే అవకాశమున్నది. అయితే వార్డెన్లను తిట్టారనే సాకుతో ఎలాంటి ఆధారం లేకుండా రెండేండ్ల పాటు ఇద్దరు విద్యార్థులను సస్పెండ్ చేసిన వర్సిటీ, ప్రొఫెసర్‌ను తీవ్ర పదజాలంతో దూషించినట్టు ఆధారాలు ఉన్నా కేవలం ఏడాది మాత్రమే సస్పెండ్ చేయడం పట్ల విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. తక్కువ శిక్ష వేయడం వెనుక జాతీయ స్థాయి బీజేపీ శక్తుల హస్తం ఉందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రొఫెసర్‌పై బూతుల వర్షం కురిపించిన విషయాన్ని నవతెలంగాణ 'లెఫ్ట్ అంబేద్కరిస్ట్ ప్రొఫెసర్లే టార్గెట్' శీర్షికతో జనవరి 9న వెలుగులోకి తీసుకొచ్చింది. ఆతర్వాత విచారణలో ఆలస్యాన్ని ఎత్తిచూపింది. దీంతో అధికారుల్లో చలనం మొదలై, చర్యలకు తీసుకున్నారు.

గద్దెకు చేరుకున్న సమ్మక్క

నవతెలంగాణ-వరంగల్

సమ్మక్క గద్దెనెక్కింది. జయశంకర్ భూపాల పల్లి జిల్లా చిలుకలగుట్ట నుంచి గురువారం సాయంత్రం గిరిజన పూజారులు సమ్మక్కను తోడ్కొని వచ్చి 8.31గంటలకు గద్దె మీదకు చేర్చారు. తల్లీకూతురు గద్దెలకు చేరుకోవటంతో సందర్శకులతో మేడారం కిక్కిరిసిపోయింది. జంపన్నవాగులో, స్నానఘట్టాల వద్ద వేలాది మంది స్నానాలాచంచి సమ్మక్క సారలమ్మలను దర్శించుకుంటున్నారు. నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) సమర్పించుకుంటు న్నారు. మేడారం చుట్టుపక్కల ఎటూ 10 కిలోమీటర్ల మేర జనసంద్రంగా మారింది. వేలసంఖ్యలో గుడారాలు వెలిశాయి. తాడ్వాయి దారిలో సుమారు 6 కిలోమీటర్ల పొడవుగా యాత్రికులు గుడారాలు వేసుకొని సేద తీరుతున్నారు. మన రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సందర్శకులు పెద్దఎత్తున తరలి వస్తున్నారు.సమ్మక్క, సారలమ్మలు గద్దెలకు చేరుకోగా శుక్రవారం సందర్శకులు మొక్కుల్ని చెల్లించుకోను న్నారు. మొక్కుల చెల్లింపు సందర్భంగా జనంతో మేడారం కిక్కిరిసిపోయే అవకాశం ఉంది. అయితే సందర్శకులు ఇబ్బందులకు గురి కాకుండా మొక్కుల్ని చెల్లించుకోవడం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. మొక్కులు పూరైన తరువాత శనివారం సమ్మక్క, సారలమ్మల వన ప్రవేశం జరుగుతుంది.

కేటీఆర్ సవాల్‌కు సై



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

2019 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాకుంటే నేను, నా కుటుంబం రాజకీయాల నుంచి తప్పుకుంటామని, టీఆర్ఎస్ ఓడిపోతే మీ కుటుంబ సభ్యులు కట్టుబడి ఉంటారా? టీపీసీసీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. గద్వాల సభలో కేటీఆర్ చేసిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, టీఆర్ఎస్ ఓడిపోతే మీ కుటుంబం రాజకీయ సన్యాసం తీసుకుంటుందా? అని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన సవాల్ విసిరారు. కేటీఆర్ సవాల్‌కు స్పందించిన ఉత్తమ్‌పై విధంగా ప్రతి సవాల్ విసిరారు. గురువారం గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ విసిరిన సవాల్‌ను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఓ బచ్చా. అందుకే నేను కేసీఆర్‌కే సవాల్ విసురుతున్నానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 70 పై చిలుకు సీట్లు వస్తాయని, అధికారంలోకి రాకుంటే నేను, నా భార్య ఇద్దరమూ రాజకీయాల నుంచి తప్పుకుంటామని చెప్పారు. మాకు పిల్లలు కూడా లేనందున ఇంకెవరూ రాజకీయాల్లోకి రారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి రాకుంటే కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావు రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని సవాల్ విసిరారు. ముందుస్తు ఎన్నికలొచ్చినా, సాధారణ ఎన్నికలొచ్చినా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమేనని పునరుద్ఘాటించారు. ప్రజలను మోసం చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పదే పదే వంద సీట్లు వస్తాయని గొప్పలు చెబుతున్నారని, వంద సీట్లు రాకుంటే ఏం చేస్తారో చెప్పాలని నిలదీశారు. రాజకీయాల్లో బచ్చాగా ఉన్న కేటీఆర్ దేశం కోసం త్యాగాలు చేసి, ఆస్తులు రాసిచ్చిన గాంధీ కుటుంబంపై కమీషన్ ఏజెంట్లుగా ఉన్న మీకు వారిపై మాట్లాడడానికి సిగ్గుండాలన్నారు. అధికారంలోకి వచ్చామని కండ్లు నెత్తికెక్కి అడ్డగోలుగా మాట్లాడుతున్న కేటీఆర్, అధికారం శాశ్వతం కాదన్న సంగతి గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. తనపై కేటీఆర్ చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ 'తాను సైనికుడిగా పాకిస్థాన్, చైనా బోర్డర్‌లో సేవ చేసిన వాడిని. నీలా దోచుకునే వాడిని కాను' అని మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబానికి 6 శాతం కమీషన్ ఇస్తేనే...ప్రాజెక్టులు ముందుకు సాగుతాయని ఆరోపించారు. అవినీతి, అక్రమాలు, దోపిడీలకు అడ్డగా మారిన కేసీఆర్ సర్కారును తరిమికొట్టడానికి ప్రజల్లో నిశ్శబ్ద విప్లవం వస్తుందన్నారు. ముఖ్యమంత్రి చేతిలో పోలీసులు ఉన్నారన్న ఉద్దేశంతో ఇష్టమొచ్చినట్టుగా చట్టాలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. టీఆర్ఎస్ పాలన బ్రహ్మాండగా ఉంటే...విమర్శలకు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. సెక్షన్ 506, 507 ను ఎందుకు సవరించారని ప్రశ్నించారు. ఉద్యమ కాలంలో మేము ఈ సెక్షన్లను ఉపయోగిస్తే...జైల్లో ఉండేవాడివన్నారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాలలో కాంగ్రెస్ నేతలను హత్యలు చేసిన వారిని ఈ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. ఖమ్మం హత్య కేసులో నిందితుడైన వ్యక్తి హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి పక్కనే ఉంటున్నారని చెప్పారు. ఇకపై ఇలాంటి ఆటలు సాగవని, ఇంతకంటే తీస్‌మార్‌ఖాన్‌లను ఎంతోమందిని చూశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధైర్యముంటే తన సవాల్‌ను స్వీకరించాలని కోరారు.

గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన

ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు గాంధీభవన్ వద్ద ఆందోళనకు దిగారు. తమ నియోజకవర్గం నుంచి టికెట్‌ను పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కేటాయించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పార్టీ సమావేశంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం టికెట్ క్యామ మల్లేశ్‌కు టికెట్ ఇస్తున్నట్టు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో మల్‌రెడ్డితోపాటు ఆయన వర్గీయులు ఆందోళన చేశారు. దీంతో ఉత్తమ్‌కుమారరెడ్డి బయటకు వచ్చి సర్వే నిర్వహించిన తర్వాత దాని ఫలితాల ఆధారంగా ఎవరికీ బలముంటే వారికే టికెట్ కేటాయిస్తామని చెప్పడంతో కార్యకర్తలు శాంతించారు.

టీఆర్ఎస్ పరాజయయాత్ర మొదలైంది : డికె అరుణ

గద్వాల నుంచి టీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలు కాలేదని, గులాబీ పరాజయయాత్ర మొదలైందని ఎమ్మెల్యే డికె అరుణ చెప్పారు. కేటీఆర్ మాట్లాడితే స్పందించాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ మాట్లాడితే సమాధానమిస్తామన్నారు. గద్వాల సభ నిర్వహించడంతోనే కేటీఆర్‌కు రాజకీయ అనుభవం లేదన్న విషయం తేలిపోయిందన్నారు. గురువారం సీఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే మహబూబ్‌నగర్‌లో ప్రాజెక్టులు ప్రారంభించామన్నారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ తలకిందులుగా తపస్సు చేసినా గెలవదన్నారు.

అభ్యర్థులకు ఎంపికకు కాంగ్రెస్ ఎలక్షన్ కమిటి ఉంటుంది: మల్లు భట్టి విక్రమార్క

అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులు ప్రకటించేందుకు కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ ఉంటుందని, ఎవరికి తోచిన విధంగా వారు అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించడం సరైంది కాదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు భట్టి విక్రమార్క అన్నారు. ఓబీసీ సాధికారిక కమిటీ ఏర్పడిన విషయం తమకు తెలియదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

వేతన జీవులకు దొరకని ఊరట!



న్యూఢిల్లీ: వేతన జీవులను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తాజా బడ్జెట్ ఊరించి ఉసూరుమనిపించారు. గురువారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయపు పన్ను శ్లాబ్‌ల్లో ఎలాంటి మార్పులు లేవని ప్రకటించారు. అయితే మధ్యతరగతి వారికి కొంత ఊరటనిచ్చేలా ప్రయాణ ఖర్చులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు గాను రూ.40,000 స్టాండర్డ్ డిడక్షన్ వెసులుబాటు కలిగిస్తున్నట్టుగా ప్రకటించారు. పన్ను పరిధిలోని వేతన జీవులకు ఊరటనిచ్చే దిశగా తన ప్రతిపాదన ఉన్నట్టుగా ఆయన తెలిపారు. జైట్లీ ప్రకటనతో కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలతో ఉన్న వేతన జీవులు ఈ సారి బడ్జెట్‌లో పన్ను మినహాయింపును మరో రూ.50,000ల మేర పెంచి ప్రస్తుతం ఉన్న రూ.2,50,000 నుంచి రూ.3,00,000లకు చేర్చుతారని అంతా భావించారు. అయితే జైట్లీ నిర్ణయంతో ఉద్యోగ సమాజం ఒక్కసారిగా ఉసూరుమంది. ఎన్‌డీఏ సర్కారు చివరి పూర్తి బడ్జెట్‌లో ఉద్యోగులను ప్రసన్నం చేసుకొనేలా జైట్లీ తప్పక చర్యలు తీసుకుంటారని అంతా భావించినా.. అది జరగకపోవడం విశేషం. గత బడ్జెట్‌లో జైట్లీ రూ.2.5-రూ.5 లక్షల ఆదాయం కలిగి ఉన్న వారికి ఆదాయపు పన్నును 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిన సంగతి తెలిసింది. రూ.50 నుంచి రూ.కోటి మధ్య ఆదాయంపై 10 శాతం సర్‌చార్జీని విధించారు. దీనికి తోడు రూ.1 కోటకి పైగా వచ్చే ఆదాయంపై 15% సర్‌ఛార్జీ కొనసాగనుంది.

డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా లక్ష కోట్లు

- యథేచ్ఛగా పీఎస్‌యూల విక్రయం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం జరపనున్నట్టుగా ఆర్థిక మంత్రి అరుణ్ జైటీ తెలిపారు. గురువారం ఆయన పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ సమర్పిస్తూ ఈ ఏడాది ముగింపు నాటికి పీఎస్‌యూల్లో వాటాల విక్రయం ద్వారా నిధుల సమీకరణ రూ.1 కోట్లను దాటొచ్చని తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని రూ.80,000 కోట్లుగా నిర్దేశించకున్నట్టుగా వివరించారు. ఎయిరిండియాతో సహా ఇప్పటికే 24 పీఎస్‌యూల్లో ఇప్పటికే మొదలు పెట్టినట్టుగా ఆయన వివరించారు. గత బడ్జెట్‌లో సర్కారు డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా దాదాపు రూ.72,500 కోట్ల నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఇందులో రూ.46,500 కోట్ల నిధులను స్వల్ప మొత్తంలో వాటాల విక్రయం, రూ.15,000 కోట్లను వ్యూహాత్మక వాటా విక్రయం, రూ.11,000 కోట్లను బీమా సంస్థల లిస్టింగ్ ద్వారా సమీకరించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. డిసెంబరు ముగింపు నాటికి ఈ విభాగంలో సర్కారు రూ.54,338 కోట్ల ఆదాయాన్ని వెనకేసుకుంది. దీనికి అదనంగా ఎయిరిండియా అమ్మకం, వోఎన్‌జీసీ-హెచ్‌పీసీఎల్ డీల్ కూడా తోడవడంతో ఈ ఏడాది డిజిన్వెస్ట్‌మెంట్ ఆదాయం లక్ష కోట్లను దాటేయనుంది.

త్వరలో 'పసిడి' పాలసీ



న్యూఢిల్లీ: బంగారాన్ని ఒక ఆస్తిగా పరిగణించేందుకు ఒక గోల్డ్ పాలసీకి త్వరలోనే రూపకల్పన చేయనున్నామని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో పేర్కొన్నారు. గోల్డ్ మానిటైజేషన్ పథకం గురించి మాట్లాడుతూ అసెట్ క్లాస్‌గా విలువైన లోహం బంగారాన్ని అభివద్ధి చేసేందుకు ప్రభుత్వం ఒక సమగ్ర గోల్డ్ పాలసీని తీసుకురానుం దన్నారు. దేశంలో స్నేహపూర్వక వినియోగదారి తత్వముతో పాటు పసిడి ఎక్స్‌ఛేంజీల వాణిజ్య సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా గోల్డ్ డిపాజిట్ ఖాతా తెరవడానికి వీలు కల్పించనున్నట్టు జైట్లీ తెలిపారు.

భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. గురువారం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో దేశ జీడీపీ 7.2-7.5 శాతంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. తమ పాలనలోని తొలి మూడేండ్లలో వృద్ధి రేటు 7.5 శాతం చొప్పున పెరిగిందన్నారు. అదే విధంగా ఆర్థిక వ్యవస్థ 2.5 ట్రిలియన్ డాలర్లకు చేరిందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే భారత్ ఏడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. త్వరలోనే ఈ స్థానానికి అయిదుకు మెరుగుపర్చుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు.

మదుపర్లకు కేంద్రం షాక్

- ఎల్‌టీసీజీపై పది శాతం పన్ను
- స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ ఈక్విటీల్లో పెట్టే పెట్టుబడులపై వచ్చే లాభాలపై పన్ను విధించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ)ని పునరుద్ధరించారు. దీన్ని అమల్లోకి తెస్తున్నట్టు ప్రకటించగానే ఒక్కసారి దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. లిస్టెడ్ కంపెనీల్లో వాటాల విక్రయానికి సంబంధించి లక్ష రూపాయల పైబడిన లాభాలపై క్యాపిటల్ గెయిన్స్ కింద 10 శాతం పన్ను విధించనున్నారు. కాగా 2018 జనవరి 31 వరకు వచ్చిన లాభాలపై పన్ను మినహాయింపునిచ్చారు. ఇది వరకు ప్రభుత్వం 2005లో లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై పన్నును రద్దు చేసింది. తాజాగా మళ్లీ దీన్ని కొత్త రూపంలో తెచ్చారు. షార్ట్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్ను రేటును యథాతథంగా 15 శాతంగా ఉంచింది.

ఎల్‌టీసీజీపై జైట్లీ ఉదాహరణతో సహా తెలిపారు. 2018 జనవరి 31కి అరు నెలల ముందు స్టాక్ మార్కెట్‌లో ఒక షేరును రూ.100కు కొనుగోలు చేసినట్టయితే, జనవరి 31 నాటికి ఆ షేర్ ధర రూ.120కి చేరిందనుకుందాం. దీంతో మదుపరికి రూ.20 లాభం వచ్చినట్టు. అయితే ఈ మొత్తంపై ఎటువంటి క్యాపిటల్ పన్ను ఉండదు. అదే షేర్ జనవరి 31 తర్వాత రూ.120 నుంచి రూ. 200 చేరిందనుకుందాం. దీంతో మదుపరికి మొత్తంగా రూ.100 లాభం వస్తుంది. అయితే జనవరి 31 తరవాత వచ్చిన లాభం రూ.80 పైన మాత్రమే క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ వేస్తారు. అదీ కూడా షేరు కొన్న ఏడాది పూర్తయిన తర్వాత విక్రయిస్తేనే ఈ పన్ను చెల్లించాల్సి ఉంటుందని జైట్లీ వివరణ ఇచ్చారు. డొల్ల కంపెనీల్లో, నకిలీ కంపెనీల్లో పెట్టుబడులను నిరోధించి పన్ను ఆదాయం పెంచేందుకే ఈ చర్యలు తీసుకున్నట్టు ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీని ద్వారా తొలి సంవత్సరం రూ.20,000 కోట్లు, తర్వాత ఏడాది రూ.40,000 కోట్ల రెవెన్యూ సమకూరనుందని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తాజా నిర్ణయంతో ఆదాయం మార్పిడికి సంబంధించి భారీ అక్రమాలు తగ్గుముఖం పడతాయని మార్కెట్ విశ్లేషకుడు సందీప్ సబర్వాల్ తెలిపారు.

కుదేలైనా స్టాక్ మార్కెట్లు..

కేంద్ర బడ్జెట్‌లో లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్‌లు తీవ్ర ఒడిదుడులకు గురైయ్యాయి. ద్రవ్యలోటు అంచనాలు పెరగడంతో పాటు డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని తక్కువగా రూ.80వేలుగా నిర్దేశించుకోవడం మార్కెట్లలో ప్రతికూలతను నింపాయి. రూ.250 కోట్ల లోపు టర్నోవర్ కలిగిన కంపెనీల కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించినప్పటికీ బడా కార్పొరేట్లు నిరాశకు గురైయ్యారు. ఈ పన్ను తగ్గింపుతో కీలక సూచీలైన నిఫ్టీ, సెన్సెక్స్‌ల్లోని ప్రధాన షేర్లకు కార్పొరేట్ పన్ను తగ్గే అవకాశం లేదు. ఫలితంగా సూచీలు నష్టాలబాట పట్టాయి. ఈ పరిణామాల మధ్య బీఎస్‌ఈ సెన్సెక్స్ తుదకు 58.36 పాయింట్లు కోల్పోయి 35,906.66కు పడిపోయింది. ఎల్‌టీసీజీ ప్రకటనతో ఇంట్రా ట్రేడింగ్‌లో ఏకంగా 463 పాయింట్ల మేర పతనమైంది. మరో దశలో క్రమంగా పుంజుకుని 200 పాయింట్లు పెరిగినప్పటికీ తుదకు నష్టాలతోనే ముగిసింది. 36,048 వద్ద మొదలైన సూచీ కొద్ది సేపు లాభాల్లో కొనసాగినప్పటికీ మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఏకంగా 35,501.74 కనిష్ట స్థాయిని తాకింది. మరో దశలో 36,256 పాయింట్ల గరిష్ట స్థాయి వద్ద నమోదైనప్పటికీ.. మళ్లీ నష్టాల వైపు సాగాయి. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 10.80 పాయింట్లు తగ్గి 11,017 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 1319 సూచీలు లాభాల్లో ముగియగా, 1453 స్టాక్స్ నష్టాల పాలయ్యాయి. మరో 230 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, లార్సన్ అండ్ టర్బో, ఐచర్ మోటార్స్ షేర్లు అధిక లాభాలు సాధించగా మరో వైపు సన్ ఫార్మా, ఓఎన్‌జీసీ, డాక్టర్ రెడ్డీస్ షేర్లు అధిక నష్టాలు చవి చూశాయి.

పారిశ్రామిక వర్గాల పెదవి విరుపు..

మనల్ని విస్మరించారు



కేంద్ర బడ్జెట్‌పై స్థానిక పారిశ్రామిక వర్గాలు పెదవి విరిచాయి. తాము పెట్టుకున్న ఆశలు 2018-19 బడ్జెట్ నెరవేర్చలేని విధంగా ఉందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పారిశ్రామిక, ఆర్థిక, వాణిజ్య మండళల సమాఖ్య (ఎఫ్టాప్సీ) అధ్యక్షులు గౌర శ్రీనివాస్ విమర్శించారు. తెలుగు రాష్ట్రాలను ఈ బడ్జెట్లో పూర్తిగా విస్మరించారని భావించక తప్పదనీ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎఫ్‌టాప్సీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ కొంతవరకు సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు మేలు కలిగించేదిగా ఉందన్నారు. అయితే చాలా వరకు పారిశ్రామిక వర్గాన్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలను దష్టిలో ఉంచుకుని వ్యవసాయం, ఆహారోత్పత్తి సంస్థలు, ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివద్ధి రంగాలకు ప్రోత్సాహాన్ని అందించారన్నారు. రూ.250 కోట్ల లోపు టర్నోవర్ కంపెనీలకు కార్పొరేట్ టాక్స్‌ను 25 శాతానికి తగ్గించడంతో ఎస్ఎంఇలకు మద్దతునిచ్చినట్లయ్యిందన్నారు.

- నవతెలంగాణ వాణిజ్య విభాగం

బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ : సీఐఐ

బడ్జెట్ సమతూకంగా ఉందని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ అన్నారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపేలా భవిష్యత్తు సంవత్సరాల్లో సూక్ష్మ స్థిరత్వాన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు.

వృద్ధికి దోహదం ఫిక్కీ

ప్రస్తుత బడ్జెట్ గ్రామీణ ప్రాంతం, వ్యవసాయ రంగానికి మద్దతునిచ్చేలా ఉందని ఫిక్కీ ప్రెసిడెంట్ రాషెష్ షా పేర్కొన్నారు. దీంతో భవిష్యత్తులో వృద్ధి మరిన్ని రెట్లు పెరగనుందని అభిప్రాయపడ్డారు.

గ్రామీణ ఆదాయానికి దన్ను : చందా కొచ్చర్



కేంద్ర బడ్జెట్ గ్రామీణ ప్రాంత ఆదాయ పెరుగుదలకు దోహదం చేయనుందని ఐసీఐసీఐ బ్యాంకు సీఈవో చందా కొచ్చర్ అభిప్రాయపడ్డారు. ఇందులో సామాజిక రంగాలకు ప్రాధాన్యతనిచ్చారన్నారు. అదే విధంగా మౌలిక వసతుల కల్పనకు దోహదం చేయనుందన్నారు.

పేదల ఆరోగ్యంపై దృష్టి : కిరణ్ మజూందర్



కేంద్ర బడ్జెట్ ఈ దఫా పేదల ఆరోగ్యంపై దృష్టి పెట్టిందని బయోకాన్ సీఎండి కిరణ్ మజూందర్ పేర్కొన్నారు. వైద్య రక్షణ లేకపోతే పేదలు మరింత పేదలుగా మారే ప్రమాదం ఉందన్నారు.

గ్రామీణ మార్కెట్ వృద్ధి : ఆనంద్ మహీంద్రా



గ్రామీణ ప్రాంత మార్కెట్ అభివృద్ధికి దోహదం చేసేలా బడ్జెట్ ఉందని మహీంద్రా గ్రూపు చైర్మెన్ ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు. ఒక విధంగా ఇది ముందస్తు ఎన్నికల బడ్జెట్ అదే విధంగా వృద్ధికి దోహదం చేసేలా ఉందన్నారు.

బడ్జెట్ ఆసక్తి..

కేంద్ర ప్రభుత్వం తమకు ఏమీ కేటాయించబోతోందని పారిశ్రామిక వర్గాలు బడ్జెట్‌ను చాలా ఆసక్తిగా తిలకించారు. న్యూఢిల్లీలో ఫిక్కీ ఏర్పాటు చేసిన లైవ్ బడ్జెట్ సెషన్‌లో ప్రముఖ వ్యాపారవేత్తలు హరీష్ పాటి సింఘానియా, కెకె మోడీ, రాజన్ భారతీ మిట్టల్ తదితరులు హాజరయ్యారు. విత్త సేవల రంగంపై మాత్రమే కేంద్రం దృష్టి కేంద్రీకరించినట్టుందని వారు అభిప్రాయపడ్డారు.

ఏ ప్రయోజనం లేదు



ఇది పూర్తిగా ఎన్నికల ముందు పాలకపక్ష మార్క్ బడ్జెట్. ఈ బడ్జెట్‌లో పన్ను చెల్లింపుదారులకు ఎటువంటి ప్రయోజనం లేదు. పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదు. వ్యవసాయ, గ్రామీణ భారతదేశానికి అనుకూలంగా చాలా ప్రకటనలు చేశారు. కొన్ని కేటాయిపులు, రాయితీలు, గ్రామీణ భారతానికి మేలు చేసేలా ఉన్నా..వాస్తవ రూపం దాల్చేసరికి..ఈప్రయోజనాలు ఎంత మేరకు అందుతాయో? అమలు ఎలా ఉంటుందో చూడాలి. కార్పొరేట్ టాక్స్ తగ్గించటం కొంచం ఊరట ఇచ్చిన ఐటీ సేవల, ఎగుమతుల రంగానికి నిరాశే మిగిల్చింది.

డాక్టర్ గేదెల శ్రీనుబాబు, సీఈవో పల్సస్ గ్రూప్

నాగార్జునసాగర్ స్పిల్‌వే సబ్‌డివిజన్ తరలింపు సరిగాదు

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో



నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే సబ్‌డివిజన్‌ను నాగార్జునసాగర్ నుంచి వనపర్తి జిల్లా పెబ్బేరుకు తరలించాలనే ప్రతిపాదన సరిగాదని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు గురువారం లేఖ రాశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం నుంచి ఇప్పటి వరకూ నాగార్జునసాగర్ స్పిల్‌వే సబ్‌డివిజన్.. ప్రాజెక్టుకు రక్షణ కల్పిస్తూ తక్షణ, దీర్ఘకాలిక ఉపయోగకర పనులను చేస్తున్నదని తెలిపారు. అలాంటి సబ్‌డివిజన్‌ను ఎత్తేసి వనపర్తి జిల్లా పెబ్బేరు తరలించడం భావ్యం కాదని పేర్కొన్నారు. స్పిల్‌వే సబ్‌డివిజన్‌ను నాగార్జునసాగర్‌లోనే ఉంచేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

తెలంగాణకు కేటాయింపుల్లేవ్.. కేంద్ర బడ్జెట్‌పై తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఎలాంటి కేటాయింపుల్లేవని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. గత మూడేండ్లలో రాష్ట్రంలో మూతబడిన పరిశ్రమలను తెరిపించేందుకు నిధులు కేటాయించలేదని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీలు, విశ్వ విద్యాల యాలు, విద్యు దుత్పత్తి కేంద్రాలను కేంద్రం పట్టించుకోలేదని తెలిపారు. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్-ఫేజ్ 2 కోసం కేటాయింపుల్లేకపోవటం శోచనీయమని పేర్కొన్నారు.

గిరిజనులకు దక్కింది 1.8 శాతమే.. : సున్నం రాజయ్య

చిన్న చూపెందుకు.. : ఆదివాసీ గిరిజన సంఘం

దేశవ్యాప్తంగా 8.6 శాతంగా ఉన్న గిరిజనులకు కేంద్ర బడ్జెట్‌లో 1.8 శాతం నిధులనే కేటాయించారని సీపీఐ (ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రానికి, పేదలకు ప్రయోజనం చేకూరలేదని పేర్కొన్నారు. ఏటా కోటి ఉద్యోగాలిస్తానన్న మోడీ.. బడ్జెట్‌లో అందుకనుగుణంగా నిధులు కేటాయించలేదని విమర్శించారు. మోడీ సర్కారుకు గిరిజనులంటేే చిన్న చూపెందుకుని ఆదివాసీ గిరిజన సంఘం ప్రశ్నించింది. 1.8 శాతం నిధులతో ఆదివాసీలు ఎలా అభివృద్ధి చెందుతారని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి తొడసం భీంరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో కేవలం రూ.39,135 కోట్లే కేటాయించటం శోచనీయమని విమర్శించారు.

నిర్బంధంపై ప్రజల నిప్పులు

- వామపక్షాలను మరింత ఐక్యం చేసిన ధర్నాచౌక్ ఉద్యమం
- గల్లీ నుంచి ఢిల్లీదాకా సాగిన పోరాటం



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రతి ఒక్కరికీ నిరసన తెలియజేసే హక్కు రాజ్యాంగం మనకు కల్పించింది. ఈ హక్కును హరించేలా తెలంగాణ ప్రభుత్వం తన చర్యలను ప్రారంభించింది. 2017 సంవత్సరం ప్రారంభం నుంచే ధర్నాచౌక్‌లో నిరసనలపై నిర్బంధం ప్రారంభిస్తూ వచ్చింది. మార్చిలో ఇందిరాపార్క్ వద్ద ధర్నాలే చేయవద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఎవ్వరినీ ఆందోళనలు చేయనీయకుండా అక్కడ నిత్యం వందలాది మంది పోలీసులతో పహారా చేయించింది. దీన్ని నిరసిస్తూ పలు పార్టీలు, ప్రజాసంఘాలతో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ ఏర్పాటైంది. ఏప్రిల్ 4న జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో రూపొందించిన నిర్దిష్ట పోరాట కార్యక్రమ ప్రతిపాదన రూపొందించగా, అదే నెల 9న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ముఖ్యనాయకుల సదస్సులో కార్యాచరణ ప్రకటించారు. మగ్దుంభవన్‌లో ఏప్రిల్15 నుంచి మే 9 వరకూ రిలే దీక్షలు నిర్వహించింది. ఈ ధర్నాల్లో తొలిరోజు వామపక్షపార్టీల ముఖ్య నేతలు పాల్గొనగా, ఆ తర్వాత రైతు, కార్మిక, వృత్తి, వ్యవసాయ కార్మిక, యువజన, విద్యార్థి, జర్నలిస్టులు, గిరిజన, దళిత, బీసీ, ఉపాధ్యాయ, సాంస్కృతిక, అసంఘటిత, మహిళా, న్యాయవాద, వికలాంగ, మైనార్టీ, ట్రాన్స్‌జెండర్స్ ఇలా పలు సంఘాలు పాల్గొన్నారు. చివరికి బాలల సంఘాలూ దీక్షల్లో పాల్గొన్నాయి. ఈ నిర్బంధాన్ని నిరసిస్తూ జిల్లాల్లోనూ సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిగాయి. ఈ పరిరక్షణ కమిటీలో సీపీఐ(ఎం) కీలకపాత్ర పోశించింది. ఈ కమిటీ సీపీఐ(ఎం) తరపున సమన్వయ కర్తగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు వ్యవహరించారు.

ధర్నా చౌక్ దద్దరిల్లేలా..

ఏప్రిల్ 10న ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఆక్రమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో వేలాది మంది ఆయా పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు. వీరిలో సగం మంది సీపీఐ(ఎం)కు చెందిన వారే కావడం గమనార్హం. ఈ కార్యక్రమాన్ని ఫెయిల్ చేసేందుకు గానూ ప్రభుత్వం కుట్రపన్ని పోలీసులు, అధికార పార్టీకి చెందిన ఇతర ప్రాంతాల నేతలతో అక్కడి కాలనీవాసులుగా చెబుతూ వ్యతిరేక దీక్ష చేయించింది. ఈ కుట్రలను మీడియా బహిర్గతం చేసింది. ఈసందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి చేసిన లాఠీచార్జిలో 40 మందికిపైగా గాయాలయ్యాయి. వీరిలో 25 మంది సీపీఐ(ఎం) కార్యకర్తలే. ఈ కార్యక్రమాన్ని ఇంతటితో ఆపకుండా, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఐదువందల మందికి పైగా వామపక్ష, ప్రజాతంత్ర కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని గవర్నర్ నరసింహన్ దృష్టికి తీసుకుపోయారు. అయినా సర్కారులో మాత్రం మార్పురాలేదు. ప్రస్తుతం ఈ ఆందోళన నివురుగప్పిన నిప్పులా కొనసాగుతూనే ఉంది.

కేసీఆర్‌ది నియంతృత్వ పాలన



ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో నియంతృత్వం రాజ్యమేలుతున్నది. గతంలో పాలకులు ఎవరైనా ఆందోళనలు చేస్తుంటే, వారిని పిలిచి సమస్యలు వినేవారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం దీనికి పూర్తి విరుద్ధం. కనీసం చర్చలకు పిలవడం కాదు..నిరసన తెలిపేందుకూ అవకాశం ఇవ్వడం లేదు. హైదరాబాద్ నగరంలో ప్రతిరోజూ 144 సెక్షన్ పెట్టి నిర్బంధం కొనసాగిస్తున్నది. ధర్నాలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం శోచనీయమే. ఇదే పద్ధతిలో కేసీఆర్ పాలన సాగితే, రానున్న రోజుల్లో ఈ సర్కారుకు ప్రజలు తగిన బుద్ధిచెబుతారు.

- డీజీ నర్సింహారావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

ఒకప్పుడు హైదరాబాద్‌లో ధర్నా అంటే చాలు.. వెంటనే ప్రతి ఒక్కరికీ ఇందిరాపార్క్ గుర్తుకొచ్చేది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ కీలకభూమిక పోషించింది. సామాన్యుడి స్వరంగా పేరొందిన ధర్నాచౌక్ తెలంగాణ ఏర్పడిన తర్వాత దాని ఉనికి లేకుండా ప్రభుత్వం నిర్బంధం విధించింది. రాష్ట్రంలో ధర్నాచౌక్ లేకుండా చేస్తానని నాటి టీఆర్ఎస్ అధినేత, నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ చెబితే సమస్యలన్నీ పరిష్కరిస్తారు కావొచ్చని అందరూ భావించారు. కానీ ధర్నాలు చేయకుండా ధర్నాచౌక్‌నే ఎత్తివేశారు. ధర్నాచౌక్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ధర్నాలు చేయాల్సిన పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ అప్రకటిత నిర్బంధంపై వామపక్షాలన్నీ ఒక్కతాటిపై వచ్చి పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. వీరికి మద్దతుగా ప్రజలూ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. ఈమహత్తర పోరాటంలో నిరంతరం ప్రజాలపక్షాన పోరాడే సీపీఐ(ఎం) కీలకపాత్ర పోషించింది. ఈనెల 4 నుంచి జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల నేపథ్యంలో ఈ పోరాటాన్ని మరోసారి గుర్తుచేసుకుందాం..

11
హైదరాబాద్
శుక్రవారం 2-2-2018
www.navatelangana.com
రక్ష
నవతెలంగాణ


శరీరంలో కొత్త కణాలు ఎప్పటికప్పుడు పుట్టుకొస్తుంటాయి. అవసరం లేకపోయినా ఇవి నిరంతరం ఏర్పడుతూ ఉంటాయి. కొత్తవి రావడంతో సాధారణంగా పాతవి క్షీణించిపోతాయి. అలా జరగ్గపోతే మాత్రం అనర్థమే. అలాంటప్పుడు పాత, కొత్త కణాల సముదాయంతో కణతి ఏర్పడుతుంది. దీన్నే క్యాన్సర్ అంటారు. ఈ మహమ్మారి శారీరకంగానే కాకుండా మానసికంగానూ వేధిస్తుంది. మరెన్నో పర్యవసనాలకూ దారితీస్తుంది. అయితే.. అన్ని కణతులూ క్యాన్సర్‌వే అనుకోవద్దు. అలా ఏర్పడి.. ఇలా తగ్గేవి గడ్డలు కూడా కొన్ని ఉంటాయి.

4న వరల్డ్ క్యాన్సర్ డే



అన్ని కణతులూ అవేనా..?

శరీరంలో గడ్డలు, కణతులు ఏర్పడగానే క్యాన్సర్ అని బెంబేలెత్తిపోవద్దు. అన్ని కణతులూ అపాయకరం కావు. అపాయకరం కానివి కూడా కొన్ని ఉంటాయి. వీటిని క్యాన్సర్ కణతులు అనడానికి వీల్లేదు. శస్త్ర చికిత్స ద్వారా ఈ కణతులను తొలగించొచ్చు. అవి సాధారణంగా తిరగబెట్టవు. వేరే అవయవాలకు వ్యాపించవు.



అపాయకరమేవి?

కణతుల్లోని కణాలు అసాధారణంగా ఉంటాయి. ఇవి నియంత్రణ లేకుండా విభజన చెందుతూ పోతాయి. తమ చుట్టూ ఉన్న కణ జాలం లోనికి చొచ్చుకుపోయి వాటిని విఛిన్నం చేస్తాయి. ఈ క్యాన్సరు కణాలు కణతుల నుంచి విడిపోయి దూరంగా రక్తస్రావంలోకి లేదా శోషరస వ్యవస్థలోకి చేరుతాయి. రక్తనాళాల చివరి నిర్మాణంలో రక్తనాళికలు, సిరలు, ధమనులు అన్ని కలిసి ఉంటాయి. వీటి ద్వారానే శరీరంలోని అన్ని భాగాలకూ రక్తం వెళ్తుంది.

కణాల్లోని జన్యువుల్లో కలిగే మార్పుల వల్ల, సాధారణంగా కణాలు కలిగే మార్పుల వల్ల సాధారణంగా కణాల విభజన, పెరుగుదల, క్షీణించడం వంటి అంశాలపై నియంత్రణ కోల్పోతాయి. కొన్ని రకాల జీవిత విధానాలు, వాతావరణ మార్పుల మూలంగా సాధారణంగా ఉండాల్సిన జన్యువులు క్యాన్సర్ పెరగడానికి అనుమతించేవిగా మారుతాయి. ఈ విధమైన జన్యు మార్పులకు ధూమపానం, నియంతరణ లేని ఆహారపుటలవాట్లు, సూర్యరశ్మిలోని అయనీకరణ వికిరణాలు కారణాలు. కొన్ని వంశపార్యంపరంగా కూడా రావచ్చు. మరికొన్ని కొన్ని పదార్థాల వల్ల సంభవించొచ్చు.

అనువంశికంగా జన్యువుల్లో వచ్చే మార్పుల వల్ల తప్పనిసరిగా ప్రాణాంతకమైన గడ్డలు ఏర్పడతాయని కచ్చితంగా చెప్పలేం. అయితే.. వచ్చే అవకాశాలు ఎక్కువ అని మాత్రం చెప్పొచ్చు. ఈ విషయంలో పరిశోధనలు జరుగుతున్నాయి. కొన్ని వైరస్‌ల వల్ల కూడా క్యాన్సర్లు వస్తాయి. హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పివీ), హెపటైటిస్-బీ, హెపటైటిస్-సీ, ఎయిడ్స్ వైరస్‌ల వల్ల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువని చెప్పొచ్చు.

సాధారణంగా కనిపించే లక్షణాలు

- కణజాలంలో కొంత మేరకు మందంగా మారడం లేదా గడ్డలు (కణతులు) లేదా శరీరంలో ఏ భాగంలోనైనా గడ్డలు ఏర్పడటం.
- పుట్టు మచ్చలు ఏర్పడటం లేదా ప్రస్తుతం ఉన్న ఆనలు లేదా మచ్చల్లో మార్పులు స్పష్టంగా కనిపించడం.
- ఎంత చికిత్స చేయించినా పుండ్లు మానకపోవడం.
- గొంతులో గరగరతోపాటు నిరంతరంగా పొడి దగ్గు రావడం.
- మల, మూత్ర విసర్జన అలవాట్లలో మార్పులు కనిపించడం.
- ఎప్పటికీ అజీర్తి ఉండటం.. ఆహారం మింగడం ఇబ్బందికరంగా ఉండటం.
- బరువులో హెచ్చుతగ్గులు కనిపించడం.
- అసాధారణ రక్తస్రావం లేదా ద్రవాలు స్రవించడం.

ముందు జాగ్రత్తలు

క్యాన్సర్ రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి. తక్కువ కొవ్వు పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. కూరగాయలు, పండ్లు, ముడిధాన్యం అధికంగా తీసుకోవాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. నిరంతరంగా వ్యాయామం చేయాలి. శారీరక బరువును ఎత్తుకు తగ్గట్టుగా నియంత్రించుకోవాలి. సూర్యరశ్మిలోని అపాయకరమైన కిరణాల నుంచి రక్షణ పొందాలి. డాక్టర్‌ని సంప్రదించి క్యాన్సర్ నివారణ మందులు వాడాలి.

చికిత్సలు

- అయనీకరణ కిరణ చికిత్స
- మందులు
- హార్మోన్ల చికిత్స

వీటిలో డాక్టర్లు అవసరాన్నిబట్టి ఒకే రకమైన లేదా రెండు మూడు రకాల చికిత్సలను కలిపి చేస్తారు.

సర్జరీలు

క్యాన్సర్ గడ్డలను తొలగించేందుకు శస్త్రచికిత్స చేస్తారు. దీని దుష్ప్రరిమాణాలు చాలా అంశాలపై ఆధారపడి ఉంటాయి. రోగి శారీరక, ఆరోగ్య పరిస్థితి, గడ్డ పరిమాణం, గడ్డ పుట్టిన అవయవం తదితర అంశాలను పరిణనలోకి తీసుకుంటారు.

శస్త్రచికిత్స అనంతరం రోగికి నొప్పి అధికంగా ఉండొచ్చు. దీన్ని మందులతో నియంత్రించొచ్చు. కొంతమంది రోగులకు బలహీనంగానూ అలసటగానూ అనిపించొచ్చు.

శస్త్ర చికిత్స తర్వాత కొంతకాలం వరకు ఇవి ఉండొచ్చు. కొంతమంది రోగులు శస్త్ర చికిత్స మూలంగా క్యాన్సర్ శరీరమంతటా వ్యాపిస్తుందని అపోహపడతారు. ఈ శస్త్ర చికిత్స చేసేటప్పుడు వైద్యులు అన్ని రకాల జాగ్రత్తలూ తీసుకుంటారు. చివరకు ఒక్కమాట.. క్యాన్సర్ అనేది అంటువ్యాధి కాదు. ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాపించదు. గాయాలు, కందిపోయిన భాగం నుంచి క్యాన్సర్ ఏమాత్రం పుట్టదు.

స్వల్ప కోతల కొత్త విధానం

వైద్య విధానం కొత్త పుంతలు తొక్కుతోంది. సులభ పద్ధతుల్లో సర్జరీలు అందుబాటులోకి వచ్చాయి. ఎంత పెద్ద రుగ్మతనైనా తక్కువ కోతలతో శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. క్యాన్సర్‌కు ఇప్పటి వరకు ఎండోస్కోపిక్, కీహెూల్ సర్జరీల ద్వారా చికిత్స అందేది. ఇప్పుడు కొత్తగా వీక్ష్మీూ అందుబాటులోకి వచ్చింది. అంటే.. ఎఱఅఱఎఝశ్రీశ్రీఎ ఱఅఝుంఅజవ ంబతీస్త్రవతీఎ అన్నమాట. తక్కువ కోతలతో చేసే సర్జరీ ఇది. క్యాన్సర్ కణజాలాన్ని సమర్ధంగా తొలగించడానికి ఇదెంతో ఉపయోగపడుతుంది.

సంప్రదాయ శస్త్రచికిత్సలో శరీరంలో ఎక్కువ భాగం కోతకు గురవుతుంది. ఇలాంటి శస్త్రచికిత్సలు చేయడం కత్తిమీద సాము లాంటిది. 'మిన్'లో అలా కాదు. శరీరంపై అతి చిన్న రంధ్రాలు వేస్తారు. తక్కువలో తక్కువ అంటే అర అంగుళం మేరకు రంధ్రం చేసి సర్జరీ చేస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన పరికరాలను ఉపయోగిస్తారు. శరీరంలోకి పంపించే అత్యాధునిక పరికరానికి వీడియోరికార్డర్ అమర్చుతారు.



లాప్రోస్కోపిక్ సర్జరీ

ఈ విధానంలో పొత్తికడుపు మీద చిన్న రంధ్రం చేసి సర్జరీ చేస్తారు. గ్యాస్ట్రోఇన్‌టెస్టినల్, యుటెరైన్, సెర్వికల్, కిడ్నీ, యురీనరి బ్లాడర్ క్యాన్సర్లకు ఇది ఉపయోగపడుతుంది.

థోరోస్కోపిక్ సర్జరీ

ఛాతీ మీద చిన్న రంధ్రం చేసి వీడియో సహాయంతో ఈ సర్జరీ చేస్తారు. ఊపిరితిత్తుల, ఆహారనాళం క్యాన్సర్లకు ఈ విధానం ఉపయోగపడుతుంది.

ప్రయోజనాలు

- ప్రతి శస్త్రచికిత్సలోనూ ఎంతో కొంత రిస్క్ ఉంటుంది. మిన్ పద్ధతిలో జరిగే సర్జరీలు ఎన్నోరెట్లు విజయవంతమవుతున్నాయి.
- శస్త్రచికిత్స తర్వాత తక్కువ నొప్పి ఉంటుంది.
- నొప్పి నివాహణ మందులు ఎక్కువగా వేసుకోవాల్సిన అవసరం ఉండదు.
- శరీరం మీద పెద్దపెద్ద గాట్లు కనిపించవు.
- సర్జరీ సమయంలో రక్తస్రావాన్ని నివారించొచ్చు.
- హాస్పిటల్‌లో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం లేదు.
- శస్త్రచికిత్స కారణంగా రక్తనాళాలు దెబ్బతినడాన్ని నివారించొచ్చు.
- కొద్దిరోజుల విశ్రాంతి అనంతరం తమ తమ పనులు చేసుకోవచ్చు.
- అంతర్గత అవయవాలు సురక్షితంగా ఉంటాయి.
- రోగులు త్వరగా కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

- డాక్టర్ రవిచందర్ వెలిగేటి,
సర్జికల్ ఆంకాలజిస్ట్



పాలు చేసే మేలు



- చిన్నారులకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం. గేదె పాలు, ఆవు పాలు కూడా ఆరోగ్యానికి మంచివే.
- ఆరోగ్యంగా జీవించాలనుకునేవారు రోజూ తప్పనిసరిగా 200 మి.లీటర్ల పాలు తాగాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.
- పాలలో ప్రొటీన్లు, కొవ్వు, కార్బోహైడ్రేడ్లు, అన్నిరకాల విటమిన్లు, ఖనిజ లవణాలు లభిస్తాయి.
- లీటరు పాలలో ఒక మనిషికి ఒక రోజుకు అవసరమయ్యే సరిపడా కాల్షియం, ఫాస్పరస్, విటమిన్-ఏ, విటమిన్-సీ అందుతాయి. మూడో వంతు ప్రొటీన్లు, ఎనిమిదో వంతు ఐరన్, నాలుగోవంతు శక్తి లభిస్తాయి. విటమిన్-బీ, ఈ, డీలు అందుతాయి.
- పాలలో ఉండే ప్రొటీన్లతో శరీర నిర్మాణానికి అవసరమయ్యే అమినోయాసిడ్స్ అందుతాయి.
- పాలలో లభించే కొవ్వులో 99 శాతం, ప్రొటీన్లలో 97 శాతం, కార్బోహైడ్రేట్లలో 98 శాతం తేలికగా జీర్ణం అవుతాయి. అందుకే పాలు జీర్ణం కావటానికి గంటన్నర సమయం సరిపోతుంది.
- కొందరికి పాలు సరిపడవు. అలాంటి వాళ్లకు పాలు తాగగానే కడుపులో గ్యాస్ ఉత్పత్తి అయి వాంతి చేసుకుంటారు. పాలలో ఉన్న కార్బోహైడ్రేట్‌ని జీర్ణం చేసే లాక్టోస్ ఎంజైమ్ వీరిలో సరిగా ఉత్పత్తి లేకపోవటమే కారణం. ఇలాంటి వారు పది రోజుల పాటు పాలు, పాల ఉత్పత్తులు మానేసి ఈ లక్షణాలు తొలగిపోతాయేమో చూడాలి. పాలు మానేయ గానే ఈ ఇబ్బందన్నీ తొలగి పోయి, తిరిగి పాలను తీసుకోవటం మొదలు పెట్టగానే సమస్య మొదలైతే తమకు పాలు పడవని నిర్ధారణకు రావాలి. పాలను మానేయాలి. ఇలాంటి వారు శరీరానికి కావాల్సిన పోషక పదార్థాల కోసం ప్రత్యామ్నాయంగా గుడ్లు, సోయా చిక్కుళ్ళు, పప్పు ధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలి.

మధుమేహం నియంత్రణ ఇలా..

క్రమశిక్షణ పాటిస్తే మన ఒంట్లో ఉన్న షుగర్ లెవెల్స్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. మధుమేహం బారిన పడ్డవారు సమయానికి నిద్రపోవాలి. సమయానికి భోజనం చేయాలి. ఒకేసారి ఎక్కువగా కాకుండా సమపాళ్లలో రోజుకు నాలుగుసార్లు భుజించడం మంచిది. అయితే.. షుగర్ లెవెల్స్‌ను తగ్గించుకునేందుకు పూర్తిగా మందుల మీదే ఆధారపడడం మాత్రం మంచిదికాదు. మనకు అందుబాటులో ఉన్న సహజ వనరులతో కూడా గ్లూకోజ్ లెవెల్స్‌ను కంట్రోల్ చేసుకోవచ్చని అంటున్నారు ప్రకృతి వైద్యులు. ఇలా చేయడం వల్ల సైడ్ ఎఫెక్ట్ సమస్య కూడా తగ్గుతుందని సూచిస్తున్నారు. కొన్ని చిట్కాలు పాటిస్తే మధుమేహాన్ని నియంత్రించొచ్చని అంటున్నారు.



వేపచిగురు వైద్యం : మన ఒంట్లో ఉన్న అధిక గ్లూకోజ్ లెవెల్స్‌ను వేగంగా తగ్గించే శక్తి వేపచిగురుకు ఉంది. ఆయుర్వేద విధానంలా చూర్ణం చేసుకుని తీసుకోవడమో, పసరు చేసుకుని తాగడమో అవసరం లేకుండానే లేత వేప చిగురును నేరుగా నమిలి మింగితే చాలు. మంచి ఫలితం కనిపిస్తుంది. ఉదయాన్నే టిఫిన్ చేసిన తర్వాత కొద్దిగా వేపచిగురు నమిలి మింగితే భోజనానంతరం వరకూ శరీరంలోని గ్లూకోజ్ పెరగకుండా చూస్తుంది.

మెంతులు: మెంతులకు కూడా షుగర్ లెవెల్స్ తగ్గించే శక్తి ఉంది. ఓ పది గింజలు తీసుకుని పూర్తిగా నమిలి మింగితే గ్లూకోజ్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. అలా అని అధిక మోతాదులో తీసుకోవడం కూడా మంచిది కాదు. మెంతులు నమలలేని వాళ్లు వాటిని పొడిచేసుకుని నీళ్ళతో కలిపి కూడా తీసుకోవచ్చు.

కాకరకాయ: పచ్చి కాకరకాయ నమలాలంటే ఎవరికైనా కష్టమే. కానీ కాకరకాయను పూర్తిగా వేయించ కుండా, పూర్తిగా ఉడకపెట్టకుండా తయారుచేసే కూరలు కనీసం వారానికి మూడు రోజులైనా తినడం మంచిది. దీంతో గ్లూకోజ్ లెవెల్స్‌ను కొంత వరకు అదుపులో ఉంచుకోవచ్చు. మీరు చేయగలిగితే కాకరకాయ రసం తాగడం ఉత్తమమైన పద్ధతి. ఇది మనం వాడే మాత్రలతో సమంగా ఫలితం చూపిస్తుంది.

మనం నిత్యం విధి నిర్వహణలతో బిజీగా ఉంటాం. పొరపాటుగానో, తప్పనిసరిగానో తీపితో కూడిన ద్రవపదార్థాలను తీసుకుంటూనే ఉంటాం. పండుగలు పబ్బాల్లో, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో మొహమాటానికో, బిడియానికో స్వీట్లు కూడా లాగించేస్తాం. ఇలాంటి సందర్భాల్లో మనం వాడే అల్లోపతి మందు ప్రభావం అంతంతమాత్రంగానే ఉంటుంది. అలాంటప్పుడు ఇలాంటి చిట్కాలు పాటిస్తే మన ఒంట్లోని షుగరును కొంతవరకు అదుపులో ఉంచుకోవచ్చు.

డిప్రెషన్‌కి మందు

మనాదికి మందులేదంటారు పెద్దలు. అవును.. మానసిక సమస్యలను నయం చేయడం కష్టమైన పనే. ఇది వైద్య రంగానికే పెద్ద సవాల్. అయితే.. ఇది అసాధ్యమేమీ కాదంటున్నారు ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్‌కు చెందిన పరిశోధకులు. డిప్రెషన్‌ని తగ్గించే శక్తి పుట్టగొడుగుల్లో ఉందంటు న్నారు. మెదడును 'రీసెట్' చేసే ఉత్ప్రేరకాలు వీటిలో ఉన్నట్టు తేల్చారు. పుట్టగొడుగుల నుంచి తీసిన 'సైలోసైబిన్' అనే పదార్థాన్ని మానసిక కుంగుబాటుతో బాధపడుతున్న 19 మందికి ఇచ్చారు. సైలోసైబిన్ ఇవ్వక ముందు, ఇచ్చిన ఒకరోజు తర్వాత రోగుల మెదడును స్కాన్ చేశారు. వీరి మెదడులో రెండు కీలక మార్పులను గుర్తించారు. సైలోసైబిన్ తీసుకున్న తర్వాత తమ మెదుడులో మంచి మార్పులు వచ్చాయని సగం మంది చెప్పారు.



ఐరన్ లోపం.. శక్తికి విఘాతం

మన శరీర నిర్మాణం, జీవక్రియలు సక్రమంగా జరగడానికి స్థూల, సూక్ష్మ పోషకాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. కార్బోహైడ్రేట్స్ (పిండి పదార్థాలు), ప్రోటీన్స్ (మాంసకృత్తులు), కొవ్వులను స్థూల పోషకాలు అంటారు. ఏ,బీ,సీ,డీ,ఈ,కే విటమిన్లు, ఐరన్, సోడియం, పోటాషియం, కాల్షియం, ఫాస్పరస్, కాపర్, కోబాల్ట్, జింక్, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలను సూక్ష్మపోషకాలు అంటారు.

రక్తం ఒక ద్రవరూప కణజాలం. రక్తంలో ప్లాస్మా, ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు, ప్లేట్‌లెట్స్ ఉంటాయి. రక్త కణాలు ఎముక మజ్జలో ఉత్పత్తి అవుతాయి. ఎర్ర రక్త కణాల ఉత్పత్తిలో ఫోలేట్, విటమిన్ బీ12 ప్రధాన పాత్ర పోషిస్తాయి. రక్తం ఎర్రగా ఉండటానికి ఎర్ర రక్తకణాల్లో ఉండే హిమోగ్లోబిన్ అనే పదార్థం కారణం. ఇది 'గ్లోబిన్' అనే ప్రోటీన్ (స్థూలపాక్షికం), ఐరన్ అనే సూక్ష్మ పోషకాలతో



ఏర్పడుతుంది. ఈ హీమోగ్లోబిన్ వల్లే ఎర్ర రక్త కణాలు ఊపిరితిత్తుల నుంచి ఆక్సిజన్‌ని అన్ని శరీర భాగాలకు సరఫరా చేస్తాయి. రక్తహీనత అంటే రక్తంలో ఈ హీమోగ్లోబిన్ స్థాయి సాధారణ కంటే తక్కువగా ఉండటం. ఇది ఐరన్ లోపం వల్ల అతి సాధారణంగా కలుగుతుంది. మన దేశంలో కూడా ఐరన్ లోపంతో వచ్చే రక్త హీనత అధికం.

బాధితులెవరు?

ఈ రక్తహీనత ప్రపంచాన్ని పట్టిపీడుస్తోంది. ముఖ్యంగా మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు పెను సవాల్‌గా మారింది. మూడింట రెండు వంతుల గర్భిణులు, దాదాపు సగం మంది మిగతా మహిళలు ఈ రక్తహీనతతో బాధపడుతున్నారు. పాలు ఇస్తున్న తల్లులతోపాటు శిశువులు ఈ సమస్యతో సతమతమవుతున్నారు.

కారణాలు?

రక్తహీనకు ఎన్నో రకాల కారణాలున్నాయి. పోషకాహార లోపంతో వచ్చే రక్తహీనతను కచ్చితంగా నివారించొచ్చు.

- అసాధారణంగా రుతుస్రావం, ప్రసవం, పేగుల్లో వచ్చే అల్సర్లు, నులి పురుగులు, అర్షమొలలు, మలేరియా వల్ల వచ్చే రక్తహీనతకు ఐరన్ లోపం కారణం.
- పేదరికం, రక్షిత మంచినీరు లేకపోవడం, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ సరిగా లేకపోవడం, వివిధ వర్గాల్లో ఉన్న ఆహారపు అలవాట్లను రక్తహీనతకు సామాజిక కారణాలుగా చెప్పొచ్చు.
- పూర్తి శాఖాహారుల్లో విటమిన్-బీ12 లోపం వచ్చే అవకాశం ఎక్కువ.
- విటమిన్-ఏ, విటమిన్-సీ లోపం కూడా పరోక్షంగా రక్తహీనతకు కారణం.

పర్యవసానాలు

- రక్తహీనత కారణంగా నీరసం, ఆయాసం, తిమ్మిర్లు, గుండెదడ, గుండె జబ్బులు, జ్వరం, డిప్రేషన్ వంటి ఆరోగ్య సమస్యలు సంక్రమిస్తాయి. ఇది ఉన్నవారు సులువుగా వ్యాధుల బారిన పడతారు
- మనదేశంలో దాదాపు 17 శాతం తల్లుల మరణానికి ఇది కారణమవుతోంది.
- మాతాశిశు మరణాలు, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి.
- అబార్షన్, తక్కువ బరువు పిల్లలు పుట్టడం, నెలలు నిండక ముందే జన్మించడం, ప్రసవం తర్వాత తీవ్ర రక్తస్రావం కావడం లాంటివి సంభివిస్తాయి.
- శక్తి సరిపోక శరీర దారుఢ్యం, పనిచేసే సామర్థ్యం తగ్గుతుంది. తద్వారా ఉత్పత్తి తగ్గి దేశ ఆర్థి ప్రగతి కుంటుపడుతుంది.
- పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల మందగిస్తుంది.
- రోగ నిరోధకశక్తి తగ్గుతుంది.
- జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది.
- జుట్టు రంగు మారుతుంది. చర్మ పాలిపోతుంది.
- సంతానలేమి, నపుంసకత్వం కూడా రావచ్చు.

నివారణ మార్గాలు

- పిల్లలకు మొదటి ఆరు నెలలు కచ్చితంగా తల్లిపాలనే ఇవ్వాలి.
- గర్భిణులు ప్రతిరోజూ కనీసం 100 రోజులపాటు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలి.
- పిల్లల్లో నులిపురుగులు, ఇతర జీర్ణవ్యవస్థ ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూసుకోవాలి.
- పిల్లలకు రోగ నిరోధక టీకాలు వేయించాలి.
- లివర్, మాంసం, చికెన్, చేపలు, ఆకుకూరలు, బెల్లం, పప్పులు, డ్రైఫ్రూట్స్ లాంటి ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. విటమిన్-సీ ఐరన్ శోషణను పెంచుతుంది. విటమిన్-ఏ, సీ ఉన్న పదార్థాలు తీసుకోవాలి.
- ఫోలేట్ అధికంగా ఉండే పాలకూర, పాలు, గుడ్లు, లివర్, మాంసం, చేపలు, అరటి, పుచ్చకాయ బాగా తీసుకోవాలి.

ఈ విధంగా మంచి పోషక పదార్థాలున్న ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించుకోవచ్చు. మంచి శక్తిమంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు.

డాక్టర్ తగరం రామచంద్ర,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
కమ్యూనిటీ మెడిసిన్ విభాగం,
షాదాన్ ఇన్‌స్టిట్యూట్
ఆఫ్ మెడికల్ సైన్స్ -హైదరాబాద్



మణికట్టు మాంత్రికులు మాయ చేశారు. సఫారీ టాప్, మిడిల్ ఆర్డర్‌లను కకావికలం చేశారు. అయితే ఒంటరి పోరాటంతో సెంచరీ నమోదు చేసిన దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ మనోళ్ల ఓపికను పరీక్షించాడు. డికాక్, మోరిస్, అండిలెలు ఓ మోస్తరు స్కోరు చేయటంతో సఫారీలు భారత్‌కు చెప్పుకోదగ్గ లక్ష్యాన్ని నిర్దేశించారు. ఛేదనలో టీమ్ ఇండియా ఓపెనర్లను కోల్పోయినా.. శతకంతో పరుగుల యంత్రం విరాట్ కోహ్లి, అర్ధ శతకంతో అజింక్య రహానె విజృంభించటంతో ఆరు వికెట్ల తేడాతో భారత్ గెలుపొందింది.

కోహ్లి శతకొట్టుడు


కోహ్లి (112, 119 బంతుల్లో 10 X 4)

తొలి వన్డేలో ఆరు వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం

- అజింక్య రహానె అర్ధ శతకం
- మెరిసిన కుల్దీప్, చాహల్


అజింక్య రహానె (79, 86 బంతుల్లో 5 X 4, 2 X 6)

నవతెలంగాణ-డర్బన్

అనుకున్నదే జరిగింది. ఆరంభం అదిరింది. తొలి వన్డేలో టీమ్ ఇండియా గెలుపొందింది. సారథి కోహ్లి డర్బన్‌లో పరుగుల వరద పారించగా, నాల్గో స్థానంలో నమ్మిన రహానె భళా! అనిపించుకున్నాడు. కింగ్స్‌మీడ్ పిచ్‌పై చెలరేగిన భారత స్పిన్నర్లు తొలుత దక్షిణాఫ్రికాను కట్టడి చేసినా.. శతకంతో ఓవైపు గోడలా నిలబడిన డుప్లెసిస్ (120, 112 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికా 269 పరుగులు చేయగల్గింది. టీమ్ ఇండియాకు ఎనమిది వికెట్లే కోల్పోయిన సఫారీలు ఛేదనలో భారత ఓపెనింగ్ జోడీని స్వల్ప స్కోరుకే పరిమితం చేశారు. ఓపెనర్లు అనుకున్న రీతిలో రాణించకపోయినా.. సెంచరీతో కోహ్లి (112, 119 బంతుల్లో 10 ఫోర్లు), అతనికి అండగా అజింక్య రహానె (79, 86 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) నిప్పులు చెరగటంతో భారత్ మరో 27 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది.తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం అందుకున్నది. ఆరు మ్యాచుల వన్డే సిరీస్‌లో భాగంగా రెండో వన్డే సెంచూరియన్‌లో ఈ నెల 4న (ఆదివారం) జరగనున్నది.

కోహ్లి, రహానె మెరుపులు : 270 పరుగులు లక్ష్యంతో బరిలోకి దిగిన కోహ్లి సేన ఆదిలోనే ఓపెనర్లను కోల్పోయింది. ఏడో ఓవర్‌లో మూడో బంతికి ఓపెనర్ రోహిత్ శర్మ (20, 30 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) పేసర్ మోర్నీ మోర్కెల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. జట్టు స్కోరు 33 ఉన్న వేళ మరో ఓపెనర్ శిఖర్ ధావన్ (35, 29 బంతుల్లో 6 ఫోర్లు)కు జతగా వన్‌డౌన్‌లో సారథి విరాట్ కోహ్లి బరిలో దిగాడు. అయితే దూకుడుగా ఆడిన గబ్బర్ ఎంతో సేపు వికెట్ నిలుపుకోలేదు. క్రీజులో సమన్వయ లోపం కారణం రనౌట్ అయ్యాడు. క్రిస్ మోరిస్ వేసిన 12.2వ బంతిని ధావన్ ఆడాడు. బంతి వికెట్ల వెనుకకు వెళ్లేలోపు అవతల ఎండ్ నుంచి కోహ్లి పరుగెత్తుకొచ్చాడు. తప్పనిసరి పరిస్థితుల్లో ధావన్ పరుగందుకోగా, ఆలోపే ఫీల్డర్ ఏడెన్ మార్క్‌రం బంతిని వికెట్ల మీదకు విసిరాడు. దీంతో రెండో వికెట్‌కు 31 బంతుల్లో 32 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన జోడీ విడివడింది. నాల్గో స్థానంలో అజింక్య రహానె బరిలో దిగాడు. వేగం పెంచిన కోహ్లి.. ఇమ్రాన్ తాహిర్ బౌలింగ్‌లో 26వ ఓవర్ తొలి బంతికి సింగిల్ తీసి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కోహ్లి వేగానికి సమయోచిత సహకారం అందించిన రహానె.. 35వ ఓవర్‌లో మోర్కెల్ బౌలింగ్‌లో బౌండరీతో అర్ధ శతకం అందుకున్నాడు. అదే జోరులో పది ఫోర్ల సహాయంతో కోహ్లి శతకం మార్కునూ దాటాడు. వీరిద్దరి అమోఘ భాగస్వామ్యంతో భారత్ విజయానికి చేరువైన తరుణంలో అండిలె బౌలింగ్‌లో రెండు ఓవర్ల వ్యవధిలో కోహ్లి, రహానెలు ఔటవ్వగా హార్దిక్ పాండ్య (3 నాటౌట్), ధోని (4 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు.

స్పిన్నర్ల హవా : టాస్ గెల్చి తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌పై భారత మణికట్టు మాయగాళ్లు దండెత్తారు. అయితే తొలి వికెట్ దక్కటానికి భారత్‌కు ఏడు ఓవర్ల సమయం పట్టింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (34), హషీమ్ ఆమ్లా (16)లు తొలుత నిలకడగా ఆడటంతో దక్షిణాఫ్రికా స్కోరు బోర్డు ఊపందుకున్నది. ఈ దశలో పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా భారత్‌కు తొలి వికెట్ అందించాడు. ఎనిమిదో ఓవర్‌లో బుమ్రా వేసిన మూడో బంతిని ఆడబోయిన ఆమ్లా వికెట్ల ముందు దొరికిపోయాడు. భారత బౌలింగ్ బృందం కట్టుదిట్టమైన బంతులతో సఫారీలను ముప్పుతిప్పలు పెట్టారు. కానీ ఆమ్లా నిష్క్రమణతో మైదానంలోకొచ్చిన దక్షిణాఫ్రికా సారథి డుప్లెసిస్ (120) టీమిండియా బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. భువనేశ్వర్ వేసిన తొమ్మిదో ఓవర్‌లో ఏకంగా మూడు బౌండరీలు బాదాడు. డుప్లెసిస్, డికాక్‌లు భారీ భాగస్వామ్యం నెలకొల్పే దిశగా అడుగులేస్తున్న తరుణంలో యుజ్వేంద్ర చాహల్ ఆ జంటను విడదీశాడు. కుదురుగా ఆడుతోన్న వికెట్ కీపర్ డికాక్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. స్పిన్నర్లకు అనుకూలంగా మారిన పిచ్‌పై ఆపై వరుస వికెట్లతో మణికట్టు స్పిన్ ద్వయం చెలరేగింది. ఏడెన్ మార్క్‌రం (9) చాహల్ బౌలింగ్‌లో హార్దిక్ పాండ్య పట్టిన అద్భుతమైన క్యాచ్‌తో పెవిలియన్ బాటపట్టగా, ఆల్‌రౌండర్ బ్యాట్స్‌మెన్ జేపీ డుమిని (12)సైతం స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. 26వ ఓవర్ చివరి బంతికి కండ్లు చెదిరే గూగ్లీతో డుమినిని బౌల్డ్ చేసిన కుల్దీప్ యాదవ్ తన ఖాతాలో తొలి వికెట్ జమచేసుకున్నాడు. సరిగ్గా రెండు ఓవర్ల వ్యవధిలో డెవిడ్ మిల్లర్ (7) కుల్దీప్ బౌలింగ్‌లోనే కోహ్లి చేతిలో క్యాచౌట్ అయ్యాడు. ఈ దశలో క్రిస్ మోరిస్ (37), అండిలె ఫెహ్లూక్వాయో (27 నాటౌట్)లు డుప్లెసిస్ జతగా స్కోరు బోర్డును ఉరికించారు. మ్యాచ్ చివరి ఓవర్లో డుప్లెసిస్ భువీ బౌలింగ్‌లో పాండ్యకు క్యాచ్ ఇవ్వగా, రబాడా రనౌట్ అయ్యాడు. ఎనమిది వికెట్ల నష్టానికి దక్షిణాఫ్రికా 269 పరుగులు చేసింది. కుల్దీప్ యాదవ్ మూడు, యుజ్వేంద్ర చాహల్ రెండు వికెట్లు పడగొట్టారు. భువనేశ్వర్, బుమ్రాలకు చెరో వికెట్ దక్కింది.

కోహ్లికి గాయం

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ సమయంలో ఫీల్డింగ్ చేస్తూ బంతిని అందుకునే క్రమంలో కోహ్లి క్రింద పడ్డాడు. అతని మోకాలు నేలకు బలంగా తాకింది. నొప్పితో కోహ్లి డగౌట్ చేరగా కాసేపు మాజీ కెప్టెన్, మిస్టర్ కూల్ ధోని సహచరులకు సూచలిస్తూ తారసపడ్డాడు. నొప్పి తగ్గాక మైదానంలో అడుగుపెట్టిన కోహ్లి అద్భుతమైన డైవ్‌తో మిల్లర్‌ను క్యాచౌట్ చేశాడు.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : క్వింటన్ డికాక్ ఎల్‌బి (బి) యుజ్వేంద్ర చాహల్ 34, హషీమ్ ఆమ్లా ఎల్‌బి (బి) జస్‌ప్రీత్ బుమ్రా 16, డుప్లెసిస్ (సి) హార్దిక్ పాండ్య (బి) భువనేశ్వర్ కుమార్ 120, ఏడెన్ మార్క్‌రం (సి) హార్దిక్ పాండ్య (బి)యుజ్వేంద్ర చాహల్ 9, జేపీ డుమిని (బి) కుల్దీప్ యాదవ్ 12, డెవిడ్ మిల్లర్ (సి) విరాట్ కోహ్లి (బి) కుల్దీప్ యాదవ్ 7, క్రిస్ మోరిస్ (బి) కుల్దీప్ యాదవ్ 37, అండిలె ఫెహ్లూక్వాయో నాటౌట్ 27, కగిసో రబాడా రనౌట్ (ధోని/భువనేశ్వర్) 1, మోర్నీ మోర్కెల్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 6, **మొత్తం : (50 ఓవర్లలో 8 వికెట్లకు) 269.**

వికెట్ల పతనం : 1-30, 2-83, 3-103, 4-122, 5-134, 6-208, 7-264, 8-268.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 10-1-71-1, జస్‌ప్రీత్ బుమ్రా 10-0-56-1, హార్దిక్ పాండ్య 7-0-41-0, యుజ్వేంద్ర చాహల్ 10-0-45-2, కుల్దీప్ యాదవ్ 10-0-34-3, కేదార్ జాదవ్ 3-0-19-0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) డికాక్ (బి) మోర్నీ మోర్కెల్ 20, శిఖర్ ధావన్ రనౌట్ (మార్క్‌రం) 35, విరాట్ కోహ్లి (సి) రబాడా (బి) అండిలె 112, అజింక్య రహానె (సి) తాహిర్ (బి) అండిలె 79, ఎక్స్‌ట్రాలు 17, **మొత్తం : (45.3 ఓవర్లలో 4 వికెట్లకు) 270.**

వికెట్ల పతనం : 1-33, 2-67, 3-256, 4-262.

బౌలింగ్ : మోర్నీ మోర్కెల్ 7-0-35-1, కగిసో రబాడా 9.3-0-48-0, క్రిస్ మోరిస్ 7-0-52-0, ఇమ్రాన్ తాహిర్ 7-0-52-0, అండిలె ఫెహ్లూక్వాయో 8-0-42-2, జేపీ డుమిని 2-0-16-0, ఏడెన్ మార్క్‌రం 2-0-20-0.

సింధు ముందంజ

ప్రీ క్వార్టర్స్ లిండాపై 2-0తో సునాయస గెలుపు


పివి సింధు

- ప్రీ క్వార్టర్స్‌లో కిదాంబి ఔట్
- క్వార్టర్స్‌లో సైనా, కశ్యప్
- ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్

న్యూఢిల్లీ : ఒలింపిక్ సిల్వర్ స్టార్ పివి సింధు స్వదేశంలో జరగుతోన్న బ్యాడ్మింటన్ సమరంలో టైటిల్ వేటగా మరో అడుగు ముందుకేసింది. గురువారం జరిగిన పోరులో టాప్ సీడ్ పివి సింధు.. ప్రత్యర్థి లిండా జెచిరి (బల్గేరియా)పై సులువుగా నెగ్గి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ రెండో రౌండ్‌లో ఓడి ఇంటిముఖం పట్టాడు. నాల్గో సీడ్ సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్, సమీర్ వర్మ క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

42 నిమిషాల్లో ముగిసిన రెండు సెట్ల షటిల్ సమరంలో సింధు 21-10, 21-14తో గెలుపొందింది. 0-1తో తొలి సెట్ ఆరంభించిన సింధు 6-5 వరకూ నిదానంగా ఆడినా ఆపై ప్రత్యర్థికి ఒక్క పాయింటూ కోల్పోకుండా 18-5కు దూసుకెళ్లింది. 21-10తో తొలి సెట్ నెగ్గింది. రెండో సెట్లో పుంజుకున్న లిండా తొలుత 2-2, 6-6, 12-12తో స్కోరు సమం చేస్తూ సింధుకు సవాలు విసిరింది. అయితే పదునైన షాట్లతో విరుచుకుపడిన హైదారాబాదీ షట్లర్ 16-14 వద్ద ప్రత్యర్థిని నిలువరించి 21-14తో సెట్ కైవసం చేసుకున్నది. ఇటీవలి ఇండోనేషియా ఓపెన్ రన్నరప్ సైనా నెహ్వాల్ 21-12, 21-11తో హోజ్‌మార్క్ జార్స్‌ఫెల్ట్ (డెన్మార్క్)పై సులువైన విజయం నమోదు చేసింది. రెండు సెట్లూ ఏకపక్షంగా సాగగా 21 నిమిషాల్లోనే మ్యాచ్ ముగియటం విశేషం. గద్దె రుత్వికా శివాని 19-21, 16-21తో తన కన్నా మెరుగైన ర్యాంకర్, ఎనమిదో సీడ్ బీట్రిజ్ కొరాల్స్ (స్పెయిన్) చేతిలో ఓడింది. అర్హత పోరు నెగ్గి ప్రధాన డ్రాలో అడుగిడిన ఆకర్షి కశ్యప్ మూడో సీడ్ రచనాక్ ఇంటనాన్ (థాయిలాండ్) చేతిలో 11-21, 12-21తో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఐదో సీడ్ బేవాన్ జంగ్ (అమెరికా) చేతిలో ముగ్ధా ఆగ్రే 12-21, 16-21తో ఓటమిపాలైంది.

పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్.. సహచర భారత షట్లర్, వరుస అర్హత పోరుల్లో నెగ్గి ప్రధాన టోర్నీలో అడుగుపెట్టిన శ్రేయాన్ష్ జైస్వాల్‌పై 21-19, 19-21, 21-12తో గెలుపొందాడు. హోరాహోరీగా సాగిన మూడు సెట్ల పోరులో శ్రేయాన్ష్ గట్టి పోటీ నిచ్చినా నిర్ణాయక సెట్‌లో రాణించిన కశ్యప్ క్వార్టర్స్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు. సమీర్ వర్మ 21-18, 19-21, 21-17తో టామీ సుగియార్తో (ఇండోనేషియా)పై పోరాడి గెలిచాడు. రెండో సీడ్ కిదాంబి శ్రీకాంత్ నిరాశ పర్చాడు. మలేసియా షట్లర్, ప్రపంచ 85వ ర్యాంకర్ ఇస్కందర్ జుల్కర్‌నైన్ చేతిలో 19-21, 17-21తో ఓడాడు. మహిళల డబుల్స్‌లో సిక్కి రెడ్డి, పొన్నప్ప జోడీ క్వార్టర్స్‌లో ప్రవేశించగా, మిక్స్‌డ్‌లో సైతం సిక్కి రెడ్డి, పొన్నప్పల జోడీలు ప్రీ క్వార్టర్స్‌లో గెలుపొందాయి.

మేరీ పసిడి పంచ్

- ఇండియా ఓపెన్ బాక్సింగ్



న్యూఢిల్లీ : భారత ఏస్ బాక్సర్ మేరీ కోమ్ తొలి ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకం గెల్చుకున్నది. ఫైనల్లో అడుగుపెట్టిన పురుష బాక్సర్లలో సంజీత్ (91 కిలోలు) మినహా ఎవరూ స్వర్ణం సాధించలేదు. మహిళలు అన్ని విభాగాల్లో కలిపి ఐదు బంగారు పతకాలు సాధించారు. 48 కిలోల విభాగంలో మేరీకోమ్ ఫిలిప్పీన్స్ బాక్సర్ జోసీ గాబుకోను 4-1తో చిత్తు చేసింది. కామన్‌వెల్త్ కాంస్య విజేత పింకీ జగ్రార్తా (51 కిలోలు) మంగోలియా బాక్సర్ జార్గలన్ ఒచిర్‌బట్‌పై నెగ్గగా, మనీషా (54 కిలోలు) మరో భారత బాక్సర్ మీనా కుమారిపై గెలుపొందింది. మాజీ ప్రపంచ చాంపియన్ సరితా దేవి 60 కిలోల విభాగంలో రజతంతో సరిపెట్టుకున్నది. గురువారం జరిగిన ఫైనల్లో ఫిన్లాండ్ దిగ్గజం మిరా పొట్‌కెనాన్ చేతిలో పోరాడి ఓడింది. బూర సవీటి, సతీష్ కుమార్, మనీష్ కుమార్, దినేష్ డాగర్‌లు రజతాలకే పరిమితమయ్యారు.

మూడో స్థానంలో పాకిస్థాన్

- అండర్ 19 ప్రపంచ కప్

క్వీన్స్‌టౌన్ (న్యూజిలాండ్) : రెండు సార్లు ప్రపంచ చాంపియన్ పాకిస్థాన్ అండర్ 19 ప్రపంచ కప్‌లో మూడో స్థానంలో నిలిచింది. మూడో స్థానం కోసం గురువారం ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో గ్రూప్ డిలో టాప్ పొజిషన్‌లో ఉన్న పాకిస్థాన్‌కు ఒక్క బంతి సైతం ఆడకుండానే మూడో స్థానం దక్కింది. పాక్ కోచ్ మన్సూర్ రాణా తమ జట్టు ప్రదర్శనపై సంతృప్తిగా ఉన్నట్టు తెలిపాడు. ఫాస్ట్ బౌలర్లు షాహీన్ అఫ్రిద, ముహమ్మద్ మూసా, అర్షాద్ ఇక్బాల్‌లపై ప్రశంసల జల్లు కురిపించాడు.



వీర్‌భగత్‌సింగ్ రెజ్లింగ్ పోటీలో తొమ్మిదేండ్ల కాసోజు సిద్ధూచారి వీర్ భగత్‌సింగ్ బాల కేసరీ అవార్డును గెలుపొందాడు. 30 కిలోల బరువుకేటగరిలో చుడీబజార్ జైన్ మందిర్ ప్రాంతానికి చెందిన సిద్ధూచారి తన 11 మంది ప్రత్యర్థులను మట్టికరిపించి అవార్డును కైవసం చేసుకున్నాడు. నిర్వాహకులు సిద్ధూచారికి గదతో పాటు మెమొంటోను బహూకరించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.